Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 28.02.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 39 పేజీలు : 16, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

• రాజుకున్న

అన్ని జిల్లాల నుండి డిమాండ్లు

# రాజధాని రగడ!



నిన్నటిదాకా ప్రత్యేకరాష్ట్రం కావాలంటూ తెలంగాణవాళ్లు, సమైక్య రాష్ట్రమంటూ సీమాంధ్ర వాళ్లు తన్నుకున్నారు. పార్లమెంటులో విభజన బిల్లు ఆమోదం పొందడంతో ఆ గొడవలు సర్దుమణిగాయి. తెలంగాణవాళ్లు సంబరాలు, విజయోత్సవాలు చేసుకుంటున్నారు. నిన్నటిదాకా సమైక్యాంధ్ర అంటూ ఉద్యమాలు జరిగిన సీమాంధ్రలో ఇప్పుడు రాజధాని కోసం తన్నుకునే పరిస్థితులొస్తున్నాయి. రాజధాని కోసం రక్తపాతానికైనా సిద్ధమని ప్రాంతాలవారీగా నాయకులు సవాళ్లు విసురుతున్నారు.

విభజన బిల్లును రూపొందించిన కేంద్రప్రభుత్వమే సీమాంధ్ర రాజధానిని నిర్ణయించేసి ఉంటే ఓ పనైపోయి ఉండేది. ఈ తగువులు తంటాలుండేవి కావు. సీమాంధ్ర రాజధానిని ఇంకో ఆరునెలల్లో నిర్ణయిస్తామంటున్నారు. ఈలోపు కేంద్రంలో ప్రభుత్వం మారిపోయే అవకాశముంది.

సీమాంధ్రలో 13జిల్లాలున్నాయి. రాయలసీమలో రెండు కేంద్రాల నుండి రాజధాని డిమాండ్లు వినవస్తున్నాయి. ఆంధ్రరాష్ట్రానికి తొలి రాజధాని కర్నూలు కాబట్టి మళ్ళీ అక్కడే రాజధానిని పెట్టాలంటూ అక్కడి నాయకులు కోరుతున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిని రాజధానిని చేయాలని, ఈ నగరానికి అన్ని ప్రాంతాల ప్రజలతో అనుబంధం ఉంది కాబట్టి అందరూ ఒప్పుకుంటారని ఇక్కడివారి అభిప్రాయం. విశాఖపట్నం, లేదా కాకినాడలలో ఏర్పాటు చేస్తే మాకు దగ్గరగా ఉంటుందని ఉత్తరాంధ్ర నాయకుల ఆశ. ఇక రాజధానిగా ఎక్కువ ప్రచారంలో ఉండేది విజయవాడ – గుంటూరు ప్రాంతం. అయితే ఈ ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేయాలంటే భూముల సమస్య ఉత్పన్నం కానుంది. భవనాల నిర్మాణాలకు సారవంతమైన భూములను వాడుకోవాల్సి రావచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సారవంతమైన భూములను వాడుకోవడం అన్ని విధాలా

(మిగతా 12వ పేజీలో)

విభజనతో ఒక్కసారిగా మారిన సీను

సీమాంధ్రంతా •

# జగన్ జపమే!



ఒకే ఒక ఐడియా జీవితాన్ని మారుస్తుందని టీవీ ప్రకటనల్లో చూస్తున్నాం. కాని ఒకరి ఐడియా ఇంకొకరి జీవితాన్ని కూడా మారుస్తుంది. ఒకరి నిర్ణయం ఇంకొకరి పాలిట శాపంలా, మారొకరికి అవకాశంలా మారుతుంది. ఇలాంటిదే రాష్ట్ర రాజకీయాలలో జరిగింది. లోక్‌సభలో రాష్ట్ర విభజన బిల్లుకు బీజేపీ ఏకపక్షంగా మద్దతు పలకడంతో మొత్తం సీమాంధ్ర రాజకీయ స్వరూపమే మారిపోయింది. పార్లమెంటులో తెలంగాణబిల్లు ఆమోదం పొందడంతో విభజన బిల్లుకు మద్దతునిచ్చిన కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశం పార్టీలను సీమాంధ్ర ప్రజలు విలన్‌లుగా చూస్తున్నారు. విభజన బిల్లును పూర్తిగా వ్యతిరేకించిన జగన్‌కే ఇప్పుడు జైకొడుతున్నారు.

రాష్ట్ర విభజన బిల్లు విషయంలో సీమాంధ్రకు బీజేపీ న్యాయం చేస్తుందని, అప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకుంటే రాజకీయంగా లాభపడొచ్చని ఆశపడ్డ తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఆశలు నీరుగారిపోయాయి. పార్లమెంటులో ఏ మాత్రం విభజన బిల్లు ఆగివున్నా, లేదా బీజేపీ పట్టుబట్టి తన సవరణలను ఆమోదింపజేసుకున్నా సీమాంధ్రలో రాజకీయ పరిస్థితులలో కొంత తేడా వచ్చేవి. పార్లమెంటులో బీజేపీ పాత్రపై సీమాంధ్రులు కొంత సంతృప్తి చెందేవాళ్లు. అప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకుంటే తెలుగుదేశంకు ప్రయోజనం వుండేది. ఇతర పార్టీల నుండి కూడా తెలుగుదేశంలోకి భారీగానే వలసలుండేవి. కాని పార్లమెంటులో బీజేపీ వైఖరితో సీమాంధ్రుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇలాంటి స్థితిలో చంద్రబాబు ఆ పార్టీతో పొత్తుపెట్టుకోలేడు. పొత్తు పెట్టుకుంటే బీజేపీ మీద వున్న కోపం టీడీపీపై కూడా చూపిస్తారు. అదీగాక చంద్రబాబు మొదటి నుండి సమన్యాయం అంటున్నాడేగాని సమైక్యరాష్ట్రం అనలేదు. రాష్ట్ర విభజనకు చంద్రబాబు ఇచ్చిన లేఖ కూడా ఒక కారణమనే ప్రచారం ఆ పార్టీకి ప్రతికూలంగా మారింది. విభజన విషయంలో బీజేపీ ఏదో చేస్తుందనుకుంటే ఆ పార్టీ ఇంకేదో

(మిగతా 12వ పేజీలో)

# 'రాష్ట్ర'పతి పాలనే

## కాంగ్రెస్ నేతల ఆశలు గల్లంతు



రెండు నెలలు సీఎం పోస్ట్ ఇచ్చినా చాలు... అదే పదివేలు... నాలుగు ఫైళ్లు దొరికినా చాలు... అదే వందలకోట్లు అన్నట్లు ఆశపడుతున్న సీమాంధ్ర కాంగ్రెస్ నేతల కోరిక నెరవేరకుండా పోయింది. గురువారం రాత్రికి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకే కేంద్రం మొగ్గు చూపుతున్నట్లు ప్రకటించింది. దీంతో నాలుగో కృష్ణుడిగా రంగంలోకి రావడానికి మేకప్ వేసుకుంటున్న కాంగ్రెస్ నాయకుల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది.

విభజనను నిరసిస్తూ ఇటీవలే ముఖ్యమంత్రి పదవికి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేయడం జరిగింది. ఇంకా ఆయన పదవిలో ఎవరినీ నియమించలేదు. విభజన బిల్లుకు ఇంకా రాష్ట్రపతి ఆమోదముద్ర పడలేదు కాబట్టి సమైక్య రాష్ట్రానికే ముఖ్యమంత్రి అవుతారు. కాని మానసికంగా సీమాంధ్ర, తెలంగాణలు వేరుపడ్డాయి. కాబట్టి ఏ ప్రాంతం వారిని సీఎంను చేసినా ఇంకో ప్రాంతం వారు వ్యతిరేకించే అవకాశం ఉంది కాబట్టి ఏ ప్రాంతం వారితో చెడ్డ లేకుండా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకే కేంద్రం మొగ్గుచూపింది.

అయితే సీమాంధ్రలో కొందరు నాయకులు మాత్రం ఈ రెండు నెలలు తమను సీఎంగా చేసినా చాలని ఆశపడ్డారు. సీమాంధ్రలో రెడ్డి కులస్తులు కాంగ్రెస్‌కు దూరమయ్యారు. వారంతా జగన్ వైపు చేరిపోయారు. కాబట్టి కాంగ్రెస్‌పార్టీ కాపు ఓట్లకు గాలం వేసే ప్రయత్నంలో ఆ వర్గానికి చెందిన చిరంజీవి, బొత్స సత్యనారాయణ, కన్నా లక్ష్మీనారాయణలలో ఒకరిని సీఎంను చేయాలనుకుంది. ఈ దిశగా సంకేతాలు వెలువడ్డాయి. అయితే ఈ సమయంలో

(మిగతా 12వ పేజీలో)

• కిరణ్ పార్టీ

# మునిగే పడవే!

మంచో చెడో చేసే ప్రయత్నం సంపూర్ణంగా ఉండాలి. అరకొరగా ప్రయత్నం చేస్తే అది ఎందుకూ పనికిరాకుండా పోతుంది. రాష్ట్ర విభజన బిల్లు విషయంలో కాంగ్రెస్ అధిష్టాన నిర్ణయాన్ని వ్యతిరేకించి సమైక్య హీరోగా మొదట పేరు తెచ్చుకున్నా, ఆ దిశలో పూర్తి ప్రయత్నం చేయకుండా ఇమేజ్‌ను పోగొట్టుకున్నాడు. అటు కాంగ్రెస్‌కు పూర్తి విధేయత ప్రదర్శించకుండా, అలాగని పూర్తిగా వ్యతిరేకించకుండా ఇప్పుడు ఎటూ లేకుండా పోయాడు. ఈరోజు ఆయన కాంగ్రెస్ నుండి బయటకొచ్చి సొంత పార్టీని పెట్టినా వచ్చే లాభమేమీ కనపడడం లేదు. సీడబ్ల్యూసీలో విభజన నిర్ణయం తీసుకున్నాక సీఎంగా కిరణ్ దానిని

(మిగతా 12వ పేజీలో)




# తెలంగాణలో హీరో

## విలీనమైతే జీరో



వై.యస్. దెబ్బకు తెలంగాణ ఉద్యమం అంతమైపోయిందనుకున్నారందరూ. కేసీఆర్ ఇక కనుమరుగై మందుకొట్టుకుంటూ ఫాంహౌస్‌లో వుండాల్సిందే అని కలలు కన్నారు. కానీ ఊహలన్నీ తారుమారయ్యాయి. కొంతకాలం స్తబ్ధుగా వున్నా మళ్ళీ ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగిసాడు. తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు. ఇప్పుడు తెలంగాణ హీరోగా నిలిచాడు.

ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమకల సాకారమైంది కేసీఆర్‌తోనే! ఖచ్చితంగా ఆయనే తెలంగాణ హీరో! గత ఆరు దశాబ్దాల చరిత్రలో ఎన్నోసార్లు తెలంగాణ ఉద్యమాలొచ్చాయి. ఇప్పుడు జరిగిన దానికంటే తీవ్రస్థాయిలోనే ఉద్యమాలు నడిచాయి. కాని అప్పుడు తెలంగాణ రాలేదు. ఇప్పుడొచ్చిందంటే అది కేసీఆర్ వల్లనే! అయితే ఇక్కడ ఇంకో లాజిక్ ఉంది. కేసీఆర్ నడిపిన ఉద్యమానికి భయపడి కేంద్రం తెలంగాణ ఇవ్వలేదు. కేసీఆర్ వెనుక ఉన్న జనాన్ని, కేసీఆర్‌ను కలుపుకుంటే వచ్చే సీట్లను లెక్కలోకి తీసుకునే కేంద్రం తెలంగాణ ఇచ్చింది.

తెలుగుదేశం పార్టీలో ఒకప్పుడు సాధారణ నాయకుడు కేసీఆర్. మంత్రిపదవి దక్కితే మహాభాగ్యమనుకున్నాడు. చంద్రబాబు హయాంలో మంత్రిపదవి వచ్చుంటే కేసీఆర్ అసలు తెలంగాణ జోలికే పోయి ఉండేవాడు కాదు. చంద్రబాబు మంత్రిపదవి ఇవ్వకపోబట్టే తన రాజకీయ మనుగడ కోసం తెలంగాణ ఉద్యమబాట పట్టాడు. మొదట ఒక్కడుగా ప్రయాణం మొదలుపెట్టాడు. ఉద్యమంలో ఒక్కొక్కరిని చేర్చుకుంటూ, ఉద్యమ పునాదులను

(మిగతా 12వ పేజీలో)

# జావగారిన 'దేశం' తమ్ముళ్లు

- విభజనపై కమలం ముంచడంతో ఆందోళన చెందుతున్న కేడర్
- బీజేపీతో పొత్తుకు విముఖత చూపుతున్న లీడర్






**రాష్ట్ర విభజన నేపథ్యంలో పార్లమెంటులో సంభవించిన పరిణామాల దెబ్బకు తెలుగుదేశం నాయకులు పూర్తిగా నీరుగారిపోయారు. వారి ఆశలకు తెరదించినట్లయ్యింది. ఫిబ్రవరి 18వ తేదీ నాడు లోక్‌సభలో బీజేపీ చేసిన పనితో తెలుగుదేశం జాతకమే మారిపోయింది. నెల్లూరుజిల్లాలో తెలుగుదేశం నాయకులు సైతం డీలా పడిపోయారు.**

రేపటి ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని చంద్రబాబు ఆరాట పడుతూ వచ్చాడు. నిన్నటివరకు సీమాంధ్రలో సైతం నరేంద్ర మోడీ అంటే ప్రత్యేక అభిమానం వుండింది. పార్టీలకతీతంగా మోడీకి ఓటేయాలనే ఫీలింగ్ ప్రజలలో బలంగా వచ్చింది. ఇక విభజన బిల్లు విషయంలో బీజేపీ నాయకులు చెప్పిన మాటలు నమ్మి ఆ పార్టీపై అభిమానం మరింతగా పెంచుకున్నారు. సీమాంధ్రకు న్యాయం చేస్తేనే తెలంగాణ బిల్లుకు మద్దతు ఇస్తామన్న వారి మాటను నిలబెట్టుకుని వుంటే ఆ పార్టీ ఇమేజ్ సీమాంధ్రలో ఎంతగానో పెరిగిఉండేది. అప్పుడు ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్నా చంద్రబాబుకు ఉపయోగముండేది. బీజేపీ సానుకూల ఓటు తెలుగు దేశంకు కలిసొచ్చేది.

కాని లోక్‌సభలో టీ-బిల్లు పెట్టినప్పుడు బీజేపీ బేషరతుగా మద్దతు తెలుపడంతో సీమాంధ్రలో సీన్ మారిపోయింది. మొన్నటివరకు మోడీకి ఓట్లేయాలనుకున్న వాళ్లు ఇప్పుడు తమ నిర్ణయం మార్చుకున్నారు. చచ్చినా మోడీకి ఓట్లేయకూడదనుకుంటున్నారు. విభజన బిల్లు విషయంలో బీజేపీ నమ్మించి మోసం చేసిందనేది సీమాంధ్రుల బాధ. ఈ ఆవేశాన్ని రేపటి ఎన్నికలలో చూపిస్తారు. సీమాంధ్రలో ఇంతటి ఉద్వేగ పరిస్థితి ఉంటే, రేపు టీడీపీ పోయి బీజేపీతో కలిస్తే ప్రజలు బీజేపీ మీదున్న కసిని టీడీపీ మీద కూడా చూపిస్తారు. అప్పుడు అసలుకే మోసం వస్తుంది. అలాగని పొత్తు లేకుండా తెలుగుదేశంకు ఒంటరి ప్రయాణం కూడా కష్టమే. బీజేపీ మోజులో పడి ఆ పార్టీ వామపక్షాలను దూరం చేసుకుంది.

బీజేపీతో పొత్తు పెట్టుకుంటే మన జిల్లాలోనూ టీడీపీకి నష్టం వాటిల్లే అవకాశముంది. లోక్‌సభలో టీ-బిల్లును పెట్టకముందు జిల్లాలో టీడీపీకి కొంతన్నా సానుకూల వాతావరణం కనిపించింది. ఇప్పుడు అది కూడా లేకుండా తుడిచి పెట్టుకుపోయింది.

# నెల్లూరేం తీసిపోయింది!



**రాష్ట్ర విభజన నేపథ్యంలో సీమాంధ్రకు కొత్త రాజధాని అవసరం ఏర్పడింది. కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణకు అన్నీ వడ్డించిన విస్తరిలా హైదరాబాద్ ఉంది కాబట్టి రాజధాని సమస్య లేకుండా పోయింది. ఇప్పుడు రాష్ట్రానికి కొత్త రాజధాని అవసరమైన నేపథ్యంలో సీమాంధ్రలోని 13జిల్లాల్లో దాదాపు 10జిల్లాల నుండి రాజధానిని మా జిల్లాలోనే నిర్మించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.**

కేంద్రమంత్రి కిషోర్ చంద్రదేవ్ లాంటోళ్లు, ఇంకో రాష్ట్ర మంత్రి విశాఖలో రాజధాని పెట్టాలంటారు, పల్లంరాజు కాకినాడ అంటే ఇంకొక నాయకుడు ఏలూరు అంటాడు, మరో నాయకుడు విజయవాడ, ఒక కేంద్రమంత్రి గుంటూరు అంటే, రాయలసీమకు చెందిన ఓ మంత్రి కర్నూలును రాజధాని చేయాలంటాడు, అసలు ఇంత సమస్యకు మూలకారణం తొలుత కర్నూలులో రాజధానిని పెట్టడం వల్లేననే విషయం ఆయనకు తెలియదేమో! 1953లో కర్నూలులో రాజధానిని పెట్టబట్టే అక్కడ గుడారాలలో ఉండలేక, అక్కడ వాతావరణం సరిపడక, అక్కడ తిండి, నీళ్లు వీళ్ల ఒంటికి పడక రాజధానిని హైదరాబాద్‌కు మార్చుకున్నారు. కష్టమో నష్టమో అప్పుడే కర్నూలులో స్థిరపడిపోయి వుంటే ఈరోజు హైదరాబాద్ కంటే మిన్నగా కర్నూలు రూపుదిద్దుకుని వుండేది. ఒకసారి కర్నూలులో పెట్టబట్టే 5దశాబ్దాలుగా ఇన్ని తలనొప్పులు ఎదుర్కొన్నాం, మరోసారి అదే తప్పును చేస్తారా?

రాజధాని నగరానికి అన్ని వసతులతో పాటు వాతావరణం స్థానిక పరిస్థితులు కూడా అనువుగా వుండాలి. ఇప్పటి పరిస్థితుల్లో భౌగోళికంగా కూడా అన్ని ప్రాంతాలకు దగ్గరలో ఉండాల్సిన అవసరముంది. ఎందుకంటే గతంలో రాజధాని నగరంతో ఏ రాజకీయ నాయకులకో, అధికారులకో, వ్యాపారులకో పని వుండేది. కాబట్టి దాని గురించి పెద్దగా పట్టించుకునేవాళ్లు కాదు. కాని ఇప్పుడు రాజధాని నగరంతో అందరికీ సంబంధాలు ఏర్పడుతున్నాయి. ఈరోజు హైదరాబాద్‌ను వదులుకోవడానికి సీమాంధ్రలో ఏ ఒక్కరూ ఇష్టపడలేదు. కారణం వీరికి బంధుత్వపరంగానో, బిడ్డలు ఇక్కడ చదువుకుంటూనో, ఉద్యోగం చేస్తూనో హైదరాబాద్ నగరంతో అనుబంధం ఏర్పడింది. అలాంటి నగరాన్ని ఎవరు మాత్రం వదులుకోగలరు? రేపు సీమాంధ్ర రాజధానిని అన్ని ప్రాంతాల వారికి అనువుగా ఉండేలా ఏర్పాటు చేయాలి. విజయవాడ అటు ఉత్తరాంధ్రకు ఇటు రాయలసీమకు సెంటర్ అవుతుందిగాని, అక్కడ ప్రభుత్వ భూమి తక్కువ. బంగారం వంటి భూములను వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగిస్తే ఉత్పాదన దెబ్బతింటుంది. విజయవాడను రాజధానిని చేస్తే రియల్‌భూమ్ పెరిగి వ్యవసాయ పొలాలను కూడా కమర్షియల్ స్థలాలుగా మార్చే ప్రమాదముంది.

ఏదైనా రాజధాని నిర్మాణానికి గుంటూరు - ప్రకాశం, నెల్లూరుజిల్లాలే అనువైనవి. గుంటూరులోనూ ప్రభుత్వ భూములు తక్కువ, కాబట్టి ప్రకాశం - నెల్లూరుజిల్లాలను అనుసంధానం చేస్తూ రాజధాని ఏర్పాటు చేయడం కరెక్ట్‌గా వుంటుంది. అటు ఉత్తరాంధ్ర నుండి కాని, ఇటు రాయలసీమ జిల్లాల నుండి గాని కనెక్టివిటి వుంది. ఒంగోలు, నెల్లూరుల మధ్య అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తే సీమలోని జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. శ్రీశైలం నుండి కృష్ణజలాలను విడుదల చేసి నీటి సమస్య లేకుండా చేయొచ్చు. జాతీయ రహదారి వుండడంతో రవాణాకు ఇబ్బంది లేదు. ప్రభుత్వ భూములున్నాయి... నిరుపయోగ భూములు వేల ఎకరాలలో ఉన్నాయి. వీటిని ఉపయోగించుకుంటే వ్యవసాయ భూముల జోలికెళ్లే పని ఉండదు. అన్ని అవసరాలను పరిగణనలోకి తీసుకుంటే నెల్లూరు - ఒంగోలుల మధ్య రాజధాని శ్రేయస్కరం.




స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు
నిర్యాణం - 06.03.2001

13వ వర్ధంతి



పూజ్యులు
స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు
స్వర్గస్తులై 06.03.2014 నాటికి
పదమూడు సంవత్సరాలు నిండుతాయి.
వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు:
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
కాంట్రాక్టర్, రామ్మూర్తినగర్, నెల్లూరు.




నెల్లూరుజిల్లా రాజకీయాలలో "గాంధీ" కుటుంబం తరహాలో కుటుంబ రాజకీయాలకు ప్రాధాన్యత పెరుగుతోంది. దశాబ్ధాల చరిత్ర కలిగిన కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడూ కుటుంబ పరిపాలనకే ప్రాముఖ్యత కల్పిస్తూ వంశపారంపర్య రాజకీయాలను ప్రోత్సహిస్తూ వుంది. అదే తరహాలో నెల్లూరుజిల్లాను ఏలడానికి ఇప్పుడు రెండు కుటుంబాలు పోటీపడుతున్నాయి.

## జిల్లా రాజకీయాలలో రెండు కుటుంబాలు ఆరు స్థానాలు!




ఈ రెండు కుటుంబాలలో మొదటిది ఆనం కుటుంబం. ఏసి సుబ్బారెడ్డి మొదలుకుని 70సంవత్సరాలుగా తాము రాజకీయాలలో వుంటున్నామని ప్రకటించుకుంటున్న ఈ కుటుంబం నేడు జిల్లా రాజకీయాలలో కాంగ్రెస్‌పార్టీ వేదికగా కీలకపాత్ర పోషిస్తోంది. అటు ఇటు మారినా చివరికి కాంగ్రెస్ గూటికే చేరిపోయి గత రెండు దశాబ్ధాలుగా జిల్లాలో చక్రం తిప్పుతున్నారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి హవా చెల్లినంత కాలం వీరికి పెద్దగా సాగకపోయినా వై.యస్.రాజశేఖరరెడ్డి నాయకత్వం రాష్ట్రంలో బలపడినప్పటి నుండి జిల్లాలో ఆనంకు తిరుగులేకుండా పోయింది. రేపు రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఆనం కుటుంబసభ్యులు మూడు స్థానాల నుండి పోటీ చేయబోతున్నట్లు సమాచారం. ఆనం వివేకానందరెడ్డి నెల్లూరు నగరం నుండి రామనారాయణరెడ్డి ఆత్మకూరు నుండి వీరిద్దరికి సోదరుడు ఆనం విజయకుమార్‌రెడ్డి నెల్లూరు గ్రామీణం నుండి కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో దిగబోతున్నారు. అయితే ఇక్కడ మరో కీలక పరిణామం చోటు చేసుకునే అవకాశం కూడలేకపోలేదని వీరి మరో సోదరుడు ఆనం జయకుమార్‌రెడ్డి చివరి నిముషంలో తెలుగుదేశంలోకి దూకి గ్రామీణ అభ్యర్థిగా ఆ పార్టీనుండి బరిలోకి దిగే ఛాన్సకూడా వుందని రాజకీయ మేధావులు అంచనా వేస్తున్నారు. సోదరులతో విభేదించి కుటుంబం నుండి బయటకు వచ్చిన జయకుమార్‌రెడ్డి వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీలో చేరాలని విశ్వప్రయత్నమే చేశాడు, అయితే ఆ పార్టీలో అప్పటికే దేశముదుర్లు వుండడంతో ఆయన ప్రవేశాన్ని నో ఎంట్రీ బోర్డుతో అడ్డుకున్నారు. ఇప్పటికీ ఆయన తాను వై.యస్.ఆర్.సి.పినే బలపరుస్తున్నానని చెప్పినా జరగబోయే పరిణామాలతో తెలుగుదేశం అభ్యర్థిగా బరిలో దిగినా ఆశ్చర్యపోనవసరంలేదన్నది పొలిటికల్ టాక్. ఇక ఇప్పటికే ఆనం కుటుంబం నుండి ముగ్గురు బరిలో వుండబోతున్నట్లు స్పష్టంగా అర్ధంకావడంతో జయకుమార్‌రెడ్డి కూడా వస్తే మొత్తం నలుగురు ఈ కుటుంబం వారే అభ్యర్థులుగా వుంటారన్నది సర్వత్రా వినవస్తున్న వార్త.

సీమాంధ్ర జిల్లాల్లో ఈసారి కాంగ్రెస్ టిక్కెట్లు అడిగే వారే లేరు. ఆ పార్టీలో ఉన్న చాలామంది నాయకులు ఆ పార్టీని చీదరించుకుంటూ ఇతర పార్టీలవైపుకు పోతున్నారు. ఇంతమంది బయటకు పోతున్నా నెల్లూరు జిల్లాలో ఆనం సోదరులు మాత్రం కాంగ్రెస్‌ను వీడిపోయేది లేదంటున్నారు. తల్లి తప్పు చేసిందని వదిలేసి వస్తామా అంటున్నారు. కాంగ్రెస్‌లో వున్న నాయకులంతా రాజకీయంగా సురక్షిత శిబిరాలకు చేరుకుంటున్నారు. ఆనం సోదరులకు కూడా తెలుగుదేశం అధినేత చంద్రబాబు నుండి ఆఫర్ వచ్చినట్లు తెలుస్తుంది. తెలుగుదేశంలోకి వస్తే ఆనం రామనారాయణరెడ్డికి ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఎటువంటి స్థానం వుందో ఆ స్థాయి స్థానాన్నే కల్పిస్తానని హామీ ఇచ్చాడట. కాని కాంగ్రెస్‌ను వదిలిపోవడానికి ఆనం సోదరులు ఇష్టపడలేదు.

గత కొన్నేళ్లుగా చూస్తుంటే ఆనం కుటుంబం నుండి ఇద్దరేసి నాయకులు రాజకీయాల్లో ఉంటూ వచ్చారు. ఏ.సి. సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి కొంతకాలం, ఆనం వెంకటరెడ్డి, ఆనం సంజీవరెడ్డిలు కొంతకాలం, ఆనం వెంకటరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు మరికొంతకాలం, 1995 నుండి ఆనం రామనారాయణరెడ్డి, ఆనం వివేకానందరెడ్డి సుధీర్ఘకాలంగా రాజకీయాలను శాసిస్తూ వచ్చారు. రేపటి ఎన్నికల్లో ఆ కుటుంబం నుండి ఇద్దరు పోయి ముగ్గురు వచ్చే అవకాశముంది. ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలతో పాటు వారి సోదరుడు ఆనం విజయకుమార్‌రెడ్డి కూడా ఎన్నికల గోదాలోకి దిగేందుకు రంగం సిద్ధమైంది.

ఇక జిల్లాలో ప్రస్తుతం వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీలో చక్రం తిప్పుతున్న కుటుంబం మేకపాటి కుటుంబం. 30సంవత్సరాల క్రితం మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఉదయగిరి నుండి జిల్లా రాజకీయాలలో ఆరంగేట్రం చేశాడు. 1983లో తొలిసారి ఎన్నికలలో ఓడిపోయాడు. 1985లో ఉదయగిరి నుండి ఎమ్మెల్యేగా గెలిచాడు. 1989లో ప్రకాశం జిల్లాలో కాలుమోపి ఒంగోలు పార్లమెంటు సభ్యుడిగా గెలిచాడు. అయితే మాగుంట సుబ్బరామిరెడ్డి రంగప్రవేశంతో తెలుగుదేశంలో చేరాడు. పార్వతమ్మ మీద ఒకసారి, మాగుంట శ్రీనివాసులురెడ్డి చేతిలో మరోసారి ఒంగోలు పార్లమెంటు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. వై.యస్.ఆశీస్సులతో తిరిగి కాంగ్రెస్‌పార్టీలో చేరి 2004లో జరిగిన ఎన్నికలలో నరసరావుపేట నుండి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికై 2009 తరువాత నెల్లూరు స్థానం జనరల్ కావడంతో సొంత జిల్లాకి వచ్చేశాడు. 2009లో వై.యస్ మరణానంతరం జరిగిన అనూహ్య పరిణామాలతో 2012లోనూ జరిగిన ఎన్నికలలో అఖండ విజయం సాధించాడు. ఈ కుటుంబాన్ని గమనిస్తే రాజమోహన్‌రెడ్డి రాజకీయ రంగప్రవేశం చేసిన 15సంవత్సరాల తరువాత 1999లో ఆయన సోదరుడు మేకపాటి చంద్రమోహన్‌రెడ్డి రాజకీయాలోకి ప్రవేశించాడు. రాజమోహన్‌రెడ్డిలాగే 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పరాజయం పాలయ్యాడు. ఆ తరువాత 2004లోనూ మళ్ళీ 2009లోనూ గెలిచి ఆ తరువాత 2012లో జరిగిన ఉపఎన్నికలలో కూడా విజయం సాధించాడు. సరిగ్గా ఆయన రాజకీయ ప్రవేశం చేసిన 15సంవత్సరాలకు రాజమోహన్‌రెడ్డి కుమారుడు మేకపాటి గౌతం ఇప్పుడు ఆత్మకూరు నుండి బరిలో దిగ బోతున్నాడు. తన తండ్రి, బాబాయ్‌ల చేదు చరిత్రని తుడిపేసి తొలిసారే తాను విజయ పతాకం ఎగురవేయాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తున్నాడు.

(మిగతా 12వ పేజీలో)

# శివనామస్మరణతో హోరెత్తిన శివాలయాలు

మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 27న నెల్లూరుజిల్లాలోని అన్ని శివాలయాలలో ఆధ్యాత్మికశోభ మిన్నంటింది. గురువారం వేకువజాము నుంచే నలుమూలలా వున్న శైవక్షేత్రాలలోని శివలింగాలకు పాలాభిషేకాలు, ఏకాదశరుద్రాభిషేకాలు, ఏకరుద్రాభిషేకాలు, అన్నాభిషేకాలు, భక్తిప్రపత్తులతో నిర్వహించారు. లయకారుడైన ముక్కంటీశ్వరుని దర్శనభాగ్యంకోసం భక్తులు బారులు దీరారు. సీతారామపురానికి 20కి.మీ దూరంలో వున్న భైరవకోన శైవక్షేత్రం పురాతన చరిత్ర కలిగింది. కావడంతో శివరాత్రి ముందు నుంచి భక్తుల రద్దీ విపరీతంగా వుంది. ఒక శిలలో 9ఆలయాలు చెక్కబడి వున్న ఈ క్షేత్రంలో శివునికి పూజలు చేస్తే ఆయన అనుగ్రహ పాత్రులవుతారని భక్తుల నమ్మకం. నెల్లూరు నుంచే కాక ప్రకాశం, కడపజిల్లాల నుంచి కూడా వేలాది మంది భక్తులు ఈ శైవక్షేత్రానిరి తరలి వచ్చి పూజలు చేస్తుండడంతో శివరాత్రి రోజు భక్తుల శివోహంతో ఆ ప్రదేశం మార్మోగిపోయినంది. నెల్లూరు కడప జిల్లాల సరిహద్దులలోని తూర్పు కనుమల్లో వున్న ప్రసిద్ధ శైవక్షేత్రం ఘటిక సిద్ధేశ్వరంలో మహ శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఆలయం క్రీ.శ1406లో విజయనగరరాజు రెండవ దేవరాయలు నిర్మించిందని శాసనాలు తెలుపుతున్నాయి. ఇక్కడ గల సప్త కోనేరుల్లో కార్తీక పౌర్ణమి రోజున దేవతలు వచ్చి స్నానం చేస్తారని ప్రతీతి. కడప నెల్లూరు జిల్లాల సరిహద్దులోనే వున్న మరో శైవక్షేత్రం సోమశిల జలాశయం కింది భాగంలో కొలువైన సోమేశ్వరుని ఆలయం. ఈ సోమేశ్వరుని పేరు మీదే ఇక్కడ గ్రామం ఏర్పడడంగానీ, జలాశయానికి ఆ పేరు రావడంగాని జరిగింది. సోముడు అనగా చంద్రుడు. చంద్రుని కోరికపైనే ఈశ్వరుడు ఇక్కడ కొలువుదీరాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ ఆలయాన్ని విక్రమాదిత్య మహారాజు నిర్మించారని శాసనాలు చెబుతున్నాయి. శివుడికి ప్రీతిపాత్రమైన సోమవారం రోజు సోమేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేస్తే మంచిదని ఇక్కడే వారు చెబుతుంటారు. ఇక శివరాత్రి రోజు సోమేశ్వరుడి దర్శనంకోసం జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి పలురీతుల పూజించారు. సైదాపురం మండలంలోని సిద్ధలయ్యకోనలో గల సిద్ధేశ్వరస్వామి మహిమాన్వితుడుగా ప్రసిద్ధి. సైదాపురానికి 5కి.మీ దూరంలో వున్న ఈ క్షేత్రంలో యోగీశ్వరులు శ్రీ నవకోటి సిద్ధలయ్య, నవనాథుల సిద్ధలయ్యతో పాటు వారి శిష్యుడు సారంగధరుడు ఇక్కడ కొలువుదీరి వున్నారు. భక్తులు శివరాత్రి రోజు తండోపతండాలుగా వచ్చి శివరాత్రి పర్వదినాన వీరిని దర్శించుకొని తరించారు. ఇక జిల్లాలోని సముద్రతీరంలో వున్న కాటేపల్లిలో కొలువుతీరిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కామాక్షిదేవి సమేత చంద్రశేఖరస్వామి ఆలయం ఆరుదశాబ్ధాల క్రితం కాటేపల్లి సముద్ర తీరాన బట్టారకం కామయ్య ఈ ఆలయాన్ని నిర్మించారు. శివరాత్రి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిభక్తులు తరలి రావడంతో సముద్రతీరం కళకళలాడింది. నెల్లూరు మూలాపేటలోని మూలస్థానేశ్వరుని ఆలయంలో, జిల్లాజైలు దగ్గరగల ఉమామహేశ్వర ఆలయంలో, నవాబుపేటలోని భ్రమరాంబికా మల్లికార్జున దేవస్థానంలో ఉస్మాన్‌సాహెబ్‌పేటలో వసంతోపులో గల శివాలయాలలో భక్తులు శివనామస్మరణ చేస్తూ పూజలు చేసి తరించారు.










## టియస్సార్ ఎన్నిక జిల్లాకు గర్వకారణం

తిక్కవరపు సుబ్బరామిరెడ్డి వరుసగా మూడవసారి రాజ్యసభ సభ్యులుగా ఎన్నిక కావడం నెల్లూరు జిల్లాకు గర్వకారణం. జిల్లాలో పుట్టి నెల్లూరుకు జాతీయ స్థాయిలో కీర్తి తెచ్చిన నాయకులు టియస్సార్ సామాజిక సేవకులుగా దైవభక్తి పరాయణులుగా నిరంతరం ప్రజా సేవ చేసే టియస్సార్‌ను కాంగ్రెస్ అధిష్టానం రాజ్యసభకు ఎంపిక చేయడం, ఆయన ఎన్నిక కావడం హర్షణీయం. 2002, 2008లో రాజ్యసభకు ఎన్నికైనా, 11, 12 లోక్‌సభలో విశాఖపట్నం నుండి ఎంపిగా గెలిచి అక్కడి ప్రజలకు ఎంతో సేవ చేసాడు. 2006 జనవరి నుండి 2008 ఏప్రిల్ వరకు కేంద్ర గనులశాఖ సహాయమంత్రిగా పనిచేసి పేరు తెచ్చుకున్నారు. మూడవసారి రాజ్య సభకు ఎన్నికైన టియస్సార్‌కు అభినందనలు.

యస్.బాబురావు, కావలి.

## మరో శంకరన్ కావాలి

పురుషుల్లో పుణ్యపురుషులు మాజీకలెక్టర్ శంకరన్. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు నేటికీ ఆయనను మరచిపోరు. నేటి కలెక్టర్ శ్రీకాంత్ కూడా ఆయన బాటలో నడవాలి. విద్య, వైద్య రంగా లపై అమితశ్రద్ధ చూపిస్తున్నారు. భూ ఆక్రమణలకు కళ్లెం వేస్తున్నారు. శ్రీకాంత్ పరిపాలనా తీరు బాగుంది. ఆయన నిజాయితీ పని తీరు అభినందనీయం. ఆయన కూడా శంకరన్ లాంటి మంచిపేరు తెచ్చుకోవాలని కోరుతున్నాను.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## ఒక్కరు గెలిచినా మనం ఓడినట్లే!

సీమాంధ్రులకు పూర్తిగా అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీ. సీమాంధ్రలోని 13జిల్లాల్లో ఒక్క అసెంబ్లీ సీటు లేకపోయినా అంతో ఇంతో బీజేపీ వాళ్లే నయమనిపిం చారు. చరిత్రలో చూస్తే కాంగ్రెస్‌ను నెత్తిన పెట్టుకున్నది సీమాంధ్ర ప్రాంతమే. ఇప్పుడు ఆ సీమాంధ్రుల తలలనే కాంగ్రెస్ పగలగొట్టింది. వచ్చే ఎన్నికల్లో ఈ 13జిల్లాల్లో కాంగ్రెస్ ఒక్క సీటు గెలిచినా సీమాంధ్రులు ఓడినట్లే!

జి.భాస్కర్, రాపూరు.

# 'ప్రభా'తం

భారత రాజకీయాలలో మంచి అనిపించుకోవడం చాలా కష్టం. చెడు అనిపించుకోవడానికి పెద్ద సమయం పట్టదు. రాష్ట్ర విభజన విషయంలో బీజేపీ పరిస్థితి ఇలాగే తయారయ్యింది. అడ్డగోలు విభజన ద్వారా కాంగ్రెస్‌పార్టీ విమర్శల పాలయ్యింది. లోపభూయిష్టంగా విభజిస్తుందంటూ అన్ని పార్టీలు కాంగ్రెస్‌ను తిట్టిపోసాయి. ఇక ప్రధాన ప్రతిపక్షం బీజేపీ కూడా దీనిని తప్పుల తడక బిల్లుగా అభివర్ణిస్తూనే వచ్చింది. అద్వానీ లాంటి అగ్రనేత అయితే ఇలాంటి ఛండాలపు బిల్లుకు తాము మద్దతిచ్చేది లేదని చెప్పాడు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లును ఏకపక్షంగా, అవగాహనా రాహిత్యంతో రూపొందించి కాంగ్రెస్ నవ్వులపాలైంది. అయితే ఆ పార్టీ బిల్లును ఆమోదింపచేసుకునే క్రమంలో ప్రధాన ప్రతిపక్షం బీజేపీని భాగస్వామిగా చేసుకున్న తీరు ఆశ్చర్యకరం. మేమొక్కరిమే వెధవలం అని ఎందుకనిపించుకోవాలి... మాతో కలిపి బీజేపీని కూడా తిట్టిస్తే సరిపోతుందనుకుని ఎన్నడూ లేని విధంగా బీజేపీతో తెగ రాయబారాలు, పంచాయితీలు సాగించారు. బిల్లుకు మద్దతునిచ్చేలా బీజేపీని ఒప్పించుకున్నారు. ఈ విషయంలో బీజేపీ ఓ మెట్టు దిగొచ్చి సీమాంధ్రకు న్యాయం చేసే దిశగా తాము ఇచ్చిన సవరణలను బిల్లులో పొందు పరిస్తేనే మద్దతు ఇస్తామంది. దీనిపై ఇరు పార్టీల మధ్య ఏం అంగీకారం కుదిరిందో ఏమోగాని లోక్‌సభలోకి వచ్చేసరికి పూర్తిగా సీన్ మారిపోయింది. సీమాంధ్రలో బీజేపీ ఉనికి నామ మాత్రం. ఇక్కడ ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా లేదు. రాజకీయంగా తీసుకుంటే ఈ ప్రాంతం కోసం పనిచేయాల్సిన అవసరం వారికి లేదు. కాని బాధ్యతాయుత ప్రతిపక్షంగా ముందుకొచ్చి ఇరు ప్రాంతాలకు న్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఓట్ల కక్కుర్తితో కాంగ్రెస్ ఏకపక్ష విభజనకు పూనుకున్నా, బీజేపీ వల్లయినా తమకు న్యాయం జరుగుతుందని సీమాంధ్రులు ఆశపడ్డారు. పార్లమెంటులో బీజేపీ వ్యవహరించే తీరుపై ఆసక్తిగా ఎదురుచూసారు. అద్వానీ, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీలు సీమాంధ్రకు న్యాయం చేస్తామని పదేపదే చెప్పారు. దీంతో రాష్ట్రం విడిపోయినా సీమాంధ్రులకు అన్యాయం జరగబోదనే నమ్మకాన్ని కమలనాథులు పెంచారు.

అయితే లోక్‌సభలో అందుకు విరుద్ధంగా జరిగింది. ఎటువంటి సవరణలు ప్రతిపాదించకుండానే బీజేపీ లోక్‌సభాపక్ష నాయకురాలు సుష్మాస్వరాజ్ బిల్లుకు మద్దతు పలికారు. దీనికి గంట ముందే లోక్‌సభ ఆవరణలో ఎన్నో ఒప్పందాలు జరిగాయనేది వినికిడి. తప్పుల తడక బిల్లుకు అద్వానీ వ్యతిరేకంగా వున్నా, సుష్మాస్వరాజ్ ఆయన మాటకు ప్రాధాన్యతనివ్వలేదు. కాంగ్రెస్‌తో ఆమె రహస్య ఒప్పందమేదో కుదుర్చుకుంది. అదీగాక లోక్‌సభలో గనుక బిల్లును ఆపి సీమాంధ్ర సమస్యలను పరిష్కరిస్తే ఆ క్రెడిట్ నరేంద్ర మోడీకే పోతుందిగాని, సుష్మాకు రాదు. బీజేపీలో ఉన్న ఈ అంతర్గత విభేదాలతోనే సుష్మాస్వరాజ్ లోక్‌సభలో పార్టీ అగ్రనాయకుల అభిప్రాయాలకు భిన్నంగా వ్యవహరించింది. బీజేపీ వ్యవహరించిన తీరుతో సీమాంధ్ర భగ్గుమంది. సీమాంధ్రను కాంగ్రెస్ చెప్పి హత్యచేస్తే, బీజేపీ కాపాడుతానని చెప్పి హత్యచేసింది. కాబట్టే ఇప్పుడు సీమాంధ్రులకు కాంగ్రెస్ కంటే బీజేపీనే పెద్ద విలన్ అయ్యింది.

కాంగ్రెస్ రెండు పడవలపై కాళ్లు పెట్టకుండా ఒకే పడవను నమ్ముకుని ముందుకు పోయింది. తెలంగాణలో సీట్లే లక్ష్యంగా ఆ పార్టీ విభజన బిల్లును తయారుచేసింది. బీజేపీ మాత్రం కొంత విలువలను పాటించి రెండు ప్రాంతాలకూ న్యాయం చేయాలంటూ రెండుచోట్లా సానుభూతిని పొందే ప్రయత్నం చేసింది. కాని రెండు చోట్లా కొరగాకుండాపోయింది. తెలంగాణ వాళ్లు ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసి తమకు ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారేగాని, సవరణలు, నిబంధనలు అని టెన్షన్ పెట్టిన బీజేపీని కాదు. సీమాంధ్రలో చూస్తే తమకు నష్టం కలిగించిన కాంగ్రెస్‌తో సమానంగా బీజేపీని చూస్తున్నారు. రెండుచోట్లా బీజేపీ చెడిపోయింది. లోక్‌సభలో జరిగిన తప్పును సరిదిద్దు కునేందుకు రాజ్యసభలో ఆ పార్టీ నాయకులు అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడులు నానా తంటాలు పడ్డారు. సవరణలకు పట్టుబట్టి అది కుదరక ప్రధానితో కొన్ని హామీలిప్పించి సరిపెట్టారు. కాని ఇది సీమాంధ్రులలో నెలకొన్న అసంతృప్తిని మాత్రం పూర్తిగా తొలగించలేదు.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు విషయంలో అధికార కాంగ్రెస్‌తో పాటూ ప్రతిపక్ష బీజేపీ కూడా ముద్దాయిగా నిలవాల్సి వచ్చింది. దీనికి కారణం రెండుపార్టీలు కూడా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడడమే. బిల్లులో న్యాయపరమైన చిక్కులు అనేకం ఉన్నాయని, రాజ్యాంగ ఉల్లంఘనలు జరిగాయని పలుమార్లు బీజేపీ తప్పు పట్టింది. రెండు, మూడేళ్లు పట్టే రాష్ట్ర విభజన ప్రక్రియను రెండు, మూడు నెలల్లోనే ముగించాలని కేంద్రప్రభుత్వం తొందరపడడంతో బిల్లులో అనేక లోపాలు చోటు చేసుకున్నాయి. బిల్లు రూపకల్పనలో వీరి అవగాహనా రాహిత్యం బయటపడింది. తెలంగాణలో సీట్లే కేంద్రం ముందు కనిపించాయిగాని రాజ్యాంగ నిబంధనలు, ప్రజాస్వామ్య విలువలు అసలు వారి కంటికి కనిపించలేదు. ఈ బిల్లు న్యాయస్థానంలో నిలవదని బీజేపీయే పలుమార్లు చెప్పింది. అలాంటి లోపభూయిష్టమైన బిల్లుకే బీజేపీ మద్దతు పలికిందంటే కాంగ్రెస్ కన్నా మొదటి ముద్దాయి బీజేపీనే!

### బీజేపీలో ఏం జరిగింది!

ఎటువంటి సవరణలు ప్రతిపాదించకుండానే బీజేపీ లోక్‌సభాపక్ష నాయకురాలు సుష్మాస్వరాజ్ బిల్లుకు మద్దతు పలికారు. దీనికి గంట ముందే లోక్‌సభ ఆవరణలో ఎన్నో ఒప్పందాలు జరిగాయనేది వినికిడి. తప్పుల తడక బిల్లుకు అద్వానీ వ్యతిరేకంగా వున్నా, సుష్మాస్వరాజ్ ఆయన మాటకు ప్రాధాన్యతనివ్వలేదు.

# 'అంతర్'జాతీయం

- ఈసారి జరిగే సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ అత్యంత ఘోరంగా ఓడిపోతుందని బీజేపీ సీనియర్ నేత అద్వానీ అన్నారు. కాంగ్రెస్‌పార్టీకి ఈసారి చరిత్రలో ఎన్నడూ రానన్ని తక్కువ సీట్లు వస్తాయని ఆయన పేర్కొన్నారు. బీజేపీకి గతంలో ఎన్నడూ లేనంత సానుకూల వాతావరణం ఉందని, ఈసారి తాము చారిత్రాత్మక విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేసారు.
- హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి వీరభద్రసింగ్ కుటుంబంపై బీజేపీ అవినీతి ఆరోపణలు సంధించింది. సీఎం కుమారుడు, కుమార్తెలు ఢిల్లీలో కొనుగోలు చేసిన ఓ తోటబంగళా బినామీ వ్యవహారంతో నడిచిందన్నారు. 25కోట్ల విలువచేసే ఈ భూమిని 1.2కోట్లకే కొనుగోలు చేసారన్నారు. ఈ ఆస్తిని ఎన్నికల కమీషన్‌కు సీఎం ఇచ్చిన అఫిడవిట్లో చూపలేదని ఆరోపించింది.
- తెలంగాణ ఏర్పడిన నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌లో గూర్ఖాలాండ్ ఉద్యమం మళ్లీ ఊపందుకుంది. గూర్ఖా జనముక్తి మోర్చా ఆధ్వర్యంలో మళ్లీ ఆందోళనలు జరుగుతున్నాయి.
- అయిదేళ్లలో ప్రపంచ వృద్ధిని 2శాతం పెంచుతామని జి-20దేశాలు ప్రతినబూనాయి. భారత కీలక డిమాండ్లయిన స్వయంపాలక పన్ను సమాచారం మార్పిడి, ఐఎంఎఫ్ సంస్కరణలు వంటి వాటికి జి-20 దేశాలు ఆమోదం తెలిపాయి.
- రాజీవ్ హంతకులను విడుదల చేయాలన్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితను కేంద్రమంత్రి నారాయణస్వామి కోరారు. తమిళనాడు ప్రభుత్వ నిర్ణయం ఆమోదయోగ్యం కాదని ఆయన పేర్కొన్నారు.
- పాకిస్థాన్‌లోని ఖైబర్ ప్రాంతంలో ఉగ్రవాద శిబిరాలపై పాక్‌సైన్యం వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 38మంది ఉగ్రవాదులు మరణించారు.
- దేశంలో పోలియో మాదిరిగానే క్షయ కూడా తుడిచి పెట్టుకుపోతుందని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆశాభావం వ్యక్తం చేసారు. భారత క్షయ సంస్థ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ పోలియో రహిత దేశంలాగే క్షయ రహిత దేశంగా భారత్‌ను నిలపడం సులభ సాధ్యమేనన్నారు.
- ఉత్తరప్రదేశ్‌ను నాలుగు రాష్ట్రాలుగా విభజించాలని కేంద్రమంత్రి జైరాం రమేష్ అభిప్రాయపడ్డారు. రాబోయే ప్రభుత్వం తప్పకుండా దీనిపై దృష్టి సారించాలని ఆయన ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.
- పూణేలోని బెంగుళూరు బేకరి, బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బాంబులు అమర్చినట్లు ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది యాసిన్‌భత్కల్ అంగీకరించాడు. 2008లో ఢిల్లీలో జరిగిన వరుస పేలుళ్లకు అవసరమైన ఐఈడీలను తానే సరఫరా చేసినట్లు మెజిస్ట్రేట్ ముందు వెల్లడించాడు. హాలీవుడ్ సినిమా స్ఫూర్తితోనే ఐఈడీలు తయారు చేసినట్లు చెప్పాడు.

# వార్త వ్యాఖ్య

వార్త :- బంగ్లాదేశ్ హిందువులకు భారతే కదా దిక్కు. – ఈశాన్య పర్యటనలో మోడీ.
**వ్యాఖ్య :- భారత్‌లో ఉన్న హిందువులకే దిక్కులేకుండా పోతుంది.**

వార్త :- ముజఫర్‌పూర్‌లో లాలూ టీ దుకాణాలు.
**వ్యాఖ్య :- ఊరూరా దాణా దుకాణాలు పెడితే ఆయనకు సెట్ అవుతుంది.**

వార్త :- విజయవాడను సీమాంధ్రకు రాజధానిని చేయాలి. – మంత్రి పార్థసారధి.
**వ్యాఖ్య :- అన్ని జిల్లాలవాళ్లు కూడా రాజధాని అడుగుతున్నారే!**

వార్త :- కాంగ్రెస్, భాజపాలను చిత్తుగా ఓడించాలి. – అశోక్‌బాబు.
**వ్యాఖ్య :- వాళ్లను ఓడించాలంటే ఇంకెవరినో గెలిపించాలనేగా!**

వార్త :- సోనియా ఓ నియంత. – జేసీ.
**వ్యాఖ్య :- ఎంతయినా 'రోమ్' లక్షణాలుంటాయిగా!**

వార్త :- అణగదొక్కేస్తాం... జాగ్రత్త. – మీడియాపై షిండే ఆగ్రహం.
**వ్యాఖ్య :- పాత పోలీసు బుద్ధి పోనిచ్చుకోలేదు.**

వార్త :- సీమాంధ్రులపై వ్యతిరేకభావం లేదు. – టీఎన్జీఓ అధ్యక్షుడు దేవీప్రసాద్.
**వ్యాఖ్య :- మీ పని అయ్యిందిగా... ఇక వ్యతిరేకత ఎందుకుంటుంది.**

వార్త :- భాజపా ప్రజలను విభజిస్తుంది. – రాహుల్.
**వ్యాఖ్య :- మీ లాగా ప్రాంతాలను విభజించమంటారా?**

వార్త :- మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం. – చిరంజీవి.
**వ్యాఖ్య :- దేశానికి దరిద్రం పడితే అంతే...**

వార్త :- సీమాంధ్రకు తిరుపతిని రాజధాని చేయాలి. – ఎంపి చింతా
**వ్యాఖ్య :- దీని కోసమేనా మీరు విభజన కావాలని కోరుకుంది.**


వార్త :- సైనిక తిరుగుబాటుకు తావేలేదు. – ఆంటోని.
**వ్యాఖ్య :- కాంగ్రెస్సే ఇంకో పదేళ్లుంటే వస్తుందేమో!**

వార్త :- ఢిల్లీ పీఠం వశం చేసుకునే సమయం ఆసన్నం. – మమతా బెనర్జీ.
**వ్యాఖ్య :- దౌర్జన్యంగానా?**

వార్త :- సీమాంధ్రను సింగపూర్ చేస్తా. – చంద్రబాబు.
**వ్యాఖ్య :- కొంపదీసి 'సింగపూర్' అని పేరు పెట్టరుగా?**

# మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నెల్లూరుజిల్లా కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో రైతులు, మిల్లర్లు, పౌర సరఫరాల అధికారులతో రైతులకు కనీస మద్దతు ధరపై ఫిబ్రవరి 24న సమీక్షా సమావేశం జరిగింది. జేసీ జి.రేఖారాణి మాట్లాడుతూ ధాన్యసేకరణకు రైతులు మరియు మిల్లర్లు సహాయోధ్యగా టీములుగా ఏర్పడి నిర్దేశించిన లక్ష్యాన్ని సమర్థవంతంగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. ప్రధానంగా రైతుల ప్రయోజనార్థం పండించే ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరపై విక్రయించుకునేందుకు వీలుగా జిల్లాలో దాదాపు 150ధాన్య కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగింద న్నారు. గత సంవత్సరం కేవలం 105 కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందని ఈ కేంద్రాలను ఈ సంవత్సరం ఎక్కువ సంఖ్యలో ఏర్పాటుచేసి రైతులకు మరింత ప్రయోజనం కల్పించడం జరుగుతుంద న్నారు. ఈ ప్రక్రియలో రైతులు, మిల్లర్లు సమన్వయ సహకారంతో కనీస మద్దతు ధర కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేసేలా చూడాలన్నారు. మండలస్థాయిలో వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లు, రైతుల సంఘం, మిల్లర్ల సంఘం నుండి సభ్యులను చేర్చి టీములుగా ఏర్పాటుచేసి కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యసేకరణ కార్యక్రమం పటిష్టంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సాగునీరు సక్రమంగా లేక పంటలు ఎండి పోతున్నాయని అటువంటి పంటలను సేవ్ దిక్రాప్ క్రింద ప్రయోజనం కల్పించాలని, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. జేసీ స్పందిస్తూ అటువంటి పంటల వివరాల నివేదికను పంపితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. సమావేశంలో అదనపు సంయుక్త కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి చంద్రమౌళి, జిల్లా పౌరసరఫరాల అధికారి శాంతకుమారి, నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్ ధర్మారెడ్డి, రైతులు, మిల్లర్స్ సభ్యులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రేఖారాణి

## నేత్రదానం



నెల్లూరు జీనిగల వీధిలో నివసిస్తున్న యడ్లపల్లి కుసుమ లక్ష్మి(62) ఈనెల 25న మృతిచెందారు. ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు ఆమె కోరిక ప్రకారం లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని అర్బన్ ఆర్యవైశ్య యువజన సంఘం సంయుక్త నిర్వహణలో దానం చేసారు. ప్రముఖ కంటివైద్యనిపుణులు డా॥పిఎల్ రావు ఆధ్వర్యంలో ఐ బ్యాంక్ టెక్నీషియన్ యండిబి ప్రసాద్ నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో నేత్ర దాన మోటివేట్ బయ్యా ప్రసాద్, యడ్లపల్లి శ్రీరాములు, కుడుముల సురేంద్రనాథ్, బైసాని పార్థసారధి, అయితా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


నేత్రదానం చేయదలచినవారు 9700416822నెంబరులో బయ్యా ప్రసాద్‌ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

నిరంకుశ డి.ఇ.ఓపై...

# ఉక్కుపిడికిలి బిగించిన ఉపాధ్యాయులు

జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం ఒంటెత్తు పోకడతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులను, ఉపాధ్యాయినులను నానా రకాల ఇబ్బందులకు గురిచేస్తుండడంతో ఫిబ్రవరి 26న జిల్లాలో ప్రముఖ ఉపాధ్యాయ సంఘాలు యూటిఎఫ్, ఏపిటిఎస్(1938)ల సంయుక్త నిర్వహణలో వేలాది మంది ఉపాధ్యాయులు నెల్లూరులోని డి.ఇ.ఓ కార్యాలయంముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులతో పాటు, రాష్ట్ర నాయకులు, ముగ్గురు ఎమ్మెల్సీలు పాల్గొనడం విశేషం. మొక్కై వంగనిది మానై వంగునా అన్నట్టు అవినీతిలో అందెవేసిన చేయిలాగా పేరుపడ్డ రామలింగం గుంటూరు జిల్లాలో ఏసిబి చేతికి చిక్కినప్పుడే శిక్షపడకుండా తన చేతివాటంతో పలుకుబడితో రాష్ట్రస్థాయిలో పైరవీలుచేసి తప్పించుకోవడం తెలిసిందే తరువాత డిఇఓగా పనిచేసిన చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో కూడా వివాదాస్పదుడిగా, లంచగొండిగా, అవినీతిపరుడిగా అపారమైన పేరు ప్రఖ్యాతులు సంపాదించాడన్నది లోకవిదితమే అటువంటి వ్యక్తి ఒకప్పుడు డిప్యూటీ డిఇఓగా పనిచేసిన నెల్లూరుకు డిఇఓగా రావడంలో జిల్లా ప్రజాప్రతినిధుల చేతులు భారీగా తడిపారని జనఉవాచ. మరి అలా వచ్చిన రామలింగం తన ఇష్టానుసారం వ్యవహరించక ఎలా వుంటాడు. దాని పర్యవసానం ఉపాధ్యాయ లోకం నష్టపోవడం, కష్టపడడం మామూలు విషయం. అలాగే అతని చేష్టలను ఇష్టపడే ఉపాధ్యాయ సంఘాలు, కులసంఘాలు కొన్ని అతనికి వెన్నుదన్నుగా నిలవడంలో జిల్లాలో తనకు ఎదురు లేదన్నట్లుగా ప్రభుత్వ ఉత్తర్వులను కూడా లెక్కచేయకుండా తాను రాసిందే వేదం, తాను చెప్పిందే మోదం అన్నట్టుగా ఉపాధ్యాయులందరూ వుండాలని హుకుం జారీచేసాడు. ఎంతకాలం భరిస్తారు. ఎన్ని వేదనలకు గురవుతారు. అటు ఉపాధ్యాయినులతో అతని వ్యవహారశైలి ఎలా వుంటుందన్న విషయం కూడా చెప్పనక్కరలేదు. అందుకే అతనికి రాసలింగం అని ఓ నిక్‌నేమ్ కూడా పెట్టింది ఉపాధ్యాయలోకం. ఆరు నెలలుగా ఉద్యోగోన్నతి ఇవ్వకుండా ఆయన నిలిపివేసి వుండడంతో కొంతమంది ఉపాధ్యాయులు విశ్రాంత ఉద్యోగులుగా మారి రావలసిన రెండు ఇంక్రిమెంట్లు నష్టపోయి తద్వారా జీవితకాలంలో ప్రభుత్వం నుంచి లభించే లక్షల రూపాయల ప్రయోజనాన్ని కోల్పోవలసి వచ్చింది. కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు కాకుండా దొడ్డిదారిన పైరవీలతో చేయించుకున్న బదిలీలకు ఈ జిల్లాలో ఆయనే ఆలంబనగా నిలిచి కొందరు ఉపాధ్యాయుల నుండి లక్షల రూపాయలు తన బొక్కసంలో జమ చేసుకున్నట్టు లోకం కోడైకూస్తోంది.

సమైక్యాంధ్ర ఉద్యమంలో రామలింగం జిల్లాలో ప్రముఖ



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

పాత్ర పోషించి ప్రభుత్వ బడులు మూయించేలా చూసాడు. ప్రైవేటు పాఠశాలలు మాత్రం దానికి మినహాయింపు అన్నట్టు వ్యవహరించాడు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ సంఘాలలో ఏపిటిఎఫ్(1938)కు చెందిన ఉపాధ్యా యులు సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొనలేదు పాఠశాలలకు హాజరయ్యారు. మిగిలిన సంఘాల ఉపాధ్యాయులు సెప్టెంబరు 4 నుంచి అక్టోబరు 10వరకు పాఠశాలలకు హాజరుకాకుండా ఉద్యమంలో పాల్గొన్నారు. దాని వల్ల 22 పాఠశాలల పనిదినాలు కోల్పోవడం జరిగింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వాటికి ప్రత్యామ్నాయంగా సంక్రాంతి సెలవు, రెండవ శనివారం, ఆదివారాలలో పాఠశాలలు నిర్వహించి ఫిబ్రవరి రెండో వారానికే ఉపాధ్యాయులు వాటిని అధిగమించారు. అయినా ప్రభుత్వ ఉత్తర్వులను కాదని ఉపాధ్యాయ సంఘాలపై కక్ష సాధింపు చర్యగా ఇంకా ఆదివారాలు, రెండో శనివారాలలో ప్రభుత్వ బడులు నడవాల్సిందేనని హుకుం జారీ చేసారు. దానిని, పదోన్నతులు ఇవ్వకపోవడాన్ని, ఉపాధ్యాయుల పట్ల రామలింగం అనుచిత వ్యవహారశైలిని నిరసిస్తూ వారు ఈ ధర్నా చేపట్టారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, జేసీ రేఖారాణి ఉపాధ్యాయసంఘాల నాయకులు, ఎమ్మెల్సీలతో చర్చించింది. అడిషనల్ సంయుక్త కలెక్టర్‌తో మాట్లాడి పదోన్నతులు కల్పిస్తామని, మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని, డిఇఓపై చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. రెండు రోజుల్లో డిఈఓ పై చర్యలు తీసుకోకపోతే తిరిగి నిర్విరామంగా ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ధర్నాలో ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, యడపల్లి శ్రీనివాసులురెడ్డి, బి.నాగేశ్వరరావు, ఏపిటిఎస్, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారెడ్డి, నర్సిరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర సహాధ్యక్షుడు బాబురెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు చీపినాపి శ్రీహరి, పరంధామయ్య, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

# వ్యవసాయపరమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్**

నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లోని గోల్డెన్ జూబ్లీహాలులో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ గ్రామసభలలో లేవనెత్తిన సమస్యలపై సంబంధిత జిల్లాస్థాయి అధికారులతో సమీక్షించి పలు సూచనలు సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాలలో వ్యవసాయపరమైన సమస్యలు ఎక్కువుగా వస్తున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో రైతువారీగా, విత్తనాలు, ఎరువులు, పంటలకు సాగునీటి కొరత తదితర సమస్యలను పరిష్కరించుటలో ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. ఈ ప్రక్రియలో అలక్ష్యం వహించిన వ్యవసాయ అధికారులపై తగిన చర్యలు తీసుకొని సక్రమంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత వుందన్నారు. పశుసంవర్ధకశాఖ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖలకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్షించి పలు ఆదేశాలిచ్చారు. సమావేశంలో అదనపు సంయుక్త కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి జితేంద్ర, వ్యవసాయశాఖ జెడి సుబ్బారావు, పశుసంవర్ధకశాఖ జెడి భాస్కర్, ఉద్యానవనశాఖ ఏడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పాలధర లీటరుకు రూ॥2 పెంపు

నెల్లూరు వెంకటేశ్వరపురంలోని విజయడెయిరీలో ఫిబ్రవరి 25న జరిగిన పాలకవర్గ సమావేశంలో పాల అమ్మకాలపై, సేకరణపై ధరను పెంచారు. ఈ సందర్భంగా డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ పాల అమ్మకాలపై లీటరుకు రూ॥2పెంచు తున్నట్టు, సేకరణధరలో 10శాతం వెన్నగల గేదెపాలకు గరిష్టంగా రూ. 50.90, 5% వెన్నగల గేదెపాలకు కనిష్టంగా రూ. 25.45చెల్లించనున్నట్టు ప్రకటించారు. గేదెపాలు కేజీ వెన్నకు రూ. 490 నుంచి 510, ఆవుపాలకు కేజీ ఘనపదార్థంకు రూ. 195 నుండి 205కు పెంచామని తెలిపారు. సమావేశంలో డెయిరీ యండి కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# పురమందిరంలో నృత్య సంగీత, ఏకపాత్రాభినయ పోటీలు

పెళ్కూరు పట్టాభిరామిరెడ్డి స్మారక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2 వరకు మూడు రోజుల పాటు నెల్లూరులోని రేబాలలక్ష్మీ నరసారెడ్డి పురమందిరంలో జిల్లాస్థాయి శాస్త్రీయ నృత్య, సంగీత పోటీలు, ఏకపాత్రాభినయ పోటీలు జరుగుతాయని ట్రస్ట్ మేనేజింగ్ పెళ్కూరు సుధాకర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జీవీ కృష్ణారెడ్డిలు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శాస్త్రీయ నృత్య పోటీలు, శనివారం శాస్త్రీయ సంగీత పోటీలు, ఆదివారం 8.30గంటల నుండి 10గంటల వరకు ఏకపాత్రాభినయ పోటీలు జరుగుతాయని తదుపరి 7 గంటలకు విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ రంగస్థల నటులు వల్లకవి సుబ్బారావు నట స్వర్ణోత్సవ అభినందన కార్యక్రమం వుంటుందని తెలిపారు.

# రోజుకో మాట మాట్లాడడం చేతకాదు


నెల్లూరు నగరప్రజలకు మిక్కిలి సేవలను అందించేందుకు టీడీపీలో చేరుతున్న నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తెలిపారు. నెల్లూరులోని మద్రాసుబస్టాండ్ సమీపంలో నిర్మిస్తున్న డ్రెయిన్ పనులకు ఆయన ఫిబ్రవరి 25న శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ విధానాలు నచ్చకనే పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరుతున్నానని, తనకిప్పుడు ఎంతో సంతోషంగా వుందని పేర్కొన్నారు. తనను విమర్శిస్తున్న వ్యక్తుల మాదిరిగా రోజుకో మాట మాట్లాడడం తనకు చేతకాదన్నారు. రాష్ట్ర విభజన కాంగ్రెస్ పార్టీవల్లే జరిగిందని, చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్టు ఇప్పుడు బాధపడి లాభంలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు మహేష్, కల్యాణ్, మస్తాన్, నన్నే సాహెబ్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ముంగమూరు

# లోకకల్యాణార్థం శ్రీ లక్ష్మీవెంకటేశ్వర మహాయజ్ఞం

శ్రీ లక్ష్మీ వెంకటరమణ ప్రభ ధార్మిక మండలి ఆధ్వర్యంలో నెల్లూరులోని వి.ఆర్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 25న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరమహాయజ్ఞం శాస్త్రోక్తంగా జరిగింది. యజ్ఞంలో ఉదయం గం॥ 5.30కు సుప్రభాతసేవ, తోమాలసేవ 6గంటలకు తిరుప్పావై సేవ, తీర్థ ప్రసాదగోష్ఠి, 7గంటలకు సహస్రనామార్చన జరిపి 8గంటలకు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరమహాయజ్ఞం, విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు. తిరుమల తిరుపతి ఆస్థాన జీయర్‌స్వాములు, పెరికోయిల్ కేళ్విఅప్పన్, శఠగోపరామానుజ పెద్దజీయర్‌స్వామి, సిరికోయిల్ కేళ్విఅప్పన్ గోవింద రామానుజ చినజీయర్‌స్వామిల నిర్వహణలో ఈ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. రాత్రి సామూహిక సరస్వతీ పూజ, ముత్తయిదువలతో కుంకుమార్చన యాజ్ఞికబ్రహ్మ ఐనవోలు సత్యనారాయణా చార్యులు పర్యవేక్షణలో భక్తిపూర్వకంగా జరిగాయి.



# త్వరలో ఎన్నికల షెడ్యూల్

## జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

సాధారణ ఎన్నికల ప్రక్రియ, విఆర్ఓ, విఆర్‌ఏ పోస్టుల ఎంపిక ప్రజల ఫిర్యాదుల విషయాలకు సంబంధించి ఆర్‌డిఓలు, మండల తహశీల్దార్లతో ఫిబ్రవరి 24న జరిగిన వీడియోకాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రధానంగా 2014సాధారణ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందని పేర్కొ న్నారు. మండలస్థాయిలో తహశీల్దార్లు, వస్త్రవ్యాపారులు, పత్రికారంగం, ఎలక్ట్రానిక్ మీడియా యజమానులు పెయిడ్ న్యూస్, ఎలక్ట్రానిక్ పరికరాల వ్యాపారస్తులు, షామియానా వ్యాపారులు, ఫంక్షన్‌హాల్ యజమానులు, ఆహార ధాన్యాల కమీషన్ ఏజెంట్లు, బంగారు ఆభరణాలు తదితర వ్యాపారస్థులతో ఎన్నికల వ్యయ ప్రక్రియపై అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. అలాగే డివిజన్ స్థాయిలో ఆర్‌డిఓలు పెట్రోల్ బంకుల యజమానులు, కుదువవ్యాపారస్థులు, మెడికల్ మరియు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు, బోర్‌వెల్, రిగ్ యజమానులు మరియు ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో తప్పని సరిగా సమావేశాలు నిర్వహించడంతో పాటు వీడియోగ్రఫీ తీయాలన్నారు. 25న ఆయా మండలస్థాయిలో విఆర్ఓ మరియు విఆర్‌ఏ అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన ధృవీకరణ పత్రాల పరిశీలన నిర్వహించాలన్నారు. ప్రజల నుండి వచ్చే వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

ఈ ప్రక్రియలో భూసమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాలు, ఇండ్లస్థలాలు, అవసరమైన ధృవీకరణ పత్రాల మంజూరులో అవకతవకలు లేకుండా సక్రమంగా పరిష్కరించేలా గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, సంబంధిత గ్రామస్థాయి అధికారులు సమర్ధవంతంగా పరిష్కరించి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ జి.రేఖారాణి, జిల్లా రెవెన్యూ అధికారి, చంద్రమౌళి, నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# సీమాంధ్ర కోసం టీడీపీ చేసిందేమీ లేదు

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

నెల్లూరు మినిబైపాస్‌రోడ్డులోని భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో ఫిబ్రవరి 22న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర విభజన విషయంలో స్పష్టత లేకుండా రాజకీయ డ్రామాలాడిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని 9ఏళ్ళు పాలించిన టీడీపీ అధినాయకుడు చంద్రబాబునాయుడు రెండుకళ్ళ సిద్ధాంతంతో వ్యవహరిస్తూ సీమాంధ్రకు రూ.5లక్షల కోట్ల ప్యాకేజీ అడగడం తప్ప న్యాయం చేయలేదని తెలిపారు. రాష్ట్ర విభజన విషయంలో బీజేపీ స్పష్టంగా తన భావాలను వెల్లడించిందన్నారు. మొదట నుంచి తాము తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కట్టుబడ్డామని, అదే సందర్భంలో సీమాంధ్రకు న్యాయం చేయాలని కోరామన్నారు. టీడీపీ నేతలు సీమాంధ్ర కోసం ఏమి చేసారో ప్రజలకు తెలపాలన్నారు. రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ వాళ్లిచ్చే 2, 3 సీట్ల కోసం తాము సిద్ధంగాలేమని సీమాంధ్రలోని అన్ని ఎంపీ సీట్లలో పోటీచేసి తమ సమర్ధత చాటుకుంటామన్నారు. సీమాంధ్ర అభివృద్ధి కాబోయే ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సాధ్యమని అన్నారు.

సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు వి.భాస్కర్‌గౌడ్, మారుబోయిన శ్రీనివాసులుగౌడ్, ఎస్ఎస్ఆర్ నాయుడు, బండారు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కిరణ్‌వి ఉత్తరకుమార ప్రగల్భాలు



నెల్లూరులోని వైఎస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో ఫిబ్రవరి 23న ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వైయస్సార్సీపీ జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్ పాల్గొని మాట్లాడారు. కిరణ్ కుమార్ అధిష్టానం ఆడించినట్టల్లా ఆడారని, ఆయన పలుకులన్నీ ఉత్తరకుమార ప్రగల్భాలేనని, తెలుగు వారినందరినీ దగా చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు రాజకీయ సమాధి చేస్తారన్నారు. అధిష్టానం స్క్రీన్ ప్లేను ఎంచక్కా అనుసరించిన ఆయనను తెలుగుజాతి క్షమించదని, చంద్రబాబు నాయుడు భారతీయ జనతాపార్టీ పొత్తు కోసం తహతహలాడుతూ రాష్ట్రాన్ని ముక్కలు చేసారని మండిపడ్డారు. చంద్రబాబు చరిత్ర హీనుడుగా మిగిలిపోవడం ఖాయమన్నారు. సమావేశంలో పాల్గొన్న వైయస్సార్సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ పార్టీలకు తెలుగుజాతిపై ఎందుకింత కక్ష అని ఆవేదన వ్యక్తం చేసారు. సమావేశంలో వైయస్సార్సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్, ప్రచార కమిటీ కన్వీనర్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నోటిఫికేషన్‌లోపే...

# పోర్టుకు శంకుస్థాపన

సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయకముందే జిల్లాలోని దుగరాజపట్నం వద్ద కేంద్రం నిర్మించతలపెట్టిన అతిపెద్ద ఓడరేవు నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రధాని మన్మోహన్‌సింగ్ చేతుల మీదుగా ఈ పోర్టుకు శంకుస్థాపన చేయించాలని చూస్తున్నారు. దీని కోసం ఆయన ఏరోజున వస్తాడనేది తేలాల్సివుంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే ఇక ఈ పోర్టుకు శంకుస్థాపన చేసే అవకాశముండదు. ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వం పోర్టు నిర్మాణాన్ని చేపడుతుంది.

ఈ పోర్టును నిర్మించామన్న క్రెడిట్‌ను కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకోవాలంటే ఎన్నికల షెడ్యూల్ లోపే శంకుస్థాపన జరిపించాల్సి వుంది. 2009 ఎన్నికలకు ముందు సోనియాగాంధీ జిల్లాలోనే కృష్ణపట్నం పోర్టును ప్రారంభించారు. వచ్చే ఎన్నికలలోపు ఈ జిల్లాలోనే దుగరాజపట్నంకు ప్రధాని శంకుస్థాపన చేస్తే పోర్టుల సెంటిమెంట్ కలిసి రావొచ్చేమో!

# ప్రజాసమస్యలకే పెద్దపీట


సమావేశంలో ప్రసంగిస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి పట్టణంలోని ఆర్ఎస్ఆర్ కల్యాణమండపంలో ఫిబ్రవరి 23న వైఎస్సార్సీపీ కావలి పట్టణ అధ్యక్షుడు పొనుగోటి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యనేతల సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైఎస్సార్సీపీ కావలి నియోజకవర్గ సమన్వయకర్త రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకంటే ప్రజాసమస్యల పరిష్కారమే తమ మొదటి ప్రాధాన్యాంశమని పేర్కొన్నారు. కావలి పట్టణాన్ని సుందరనగరంలా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసం తాను కావలిలో జనదీవెన కార్యక్రమం చేపట్టానని అన్నారు. కావలి పట్టణంలో 40వార్డులకు కమిటీలను వేసామని, వార్డులలోని సమస్యల పరిష్కారానికి అందరం కలిసి కృషి చేద్దామని తెలిపారు. ఇప్పుడు పరిష్కరించలేని పక్షంలో ఎన్నికల అనంతరం జగన్ ఆధ్వర్యంలో ఏర్పడే ప్రభుత్వం ద్వారా తప్పక పరిష్కరించి తీరుతామన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పథకాలు, జగన్ కొత్తగా ప్రకటించిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి జగన్‌కి మద్దతు ఇచ్చి గెలిపించేలా చేద్దామని కార్యకర్తలను కోరారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ ప్రభంజనాన్ని చూపాలని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్సీపీ వాణిజ్య విభాగం కన్వీనర్ తిరివీధి ప్రసాద్, పట్టణ మహిళా అధ్యక్షురాలు పత్తిపాటి సులోచనమ్మ, కావలి పట్టణ యువజన విభాగం కన్వీనర్ చీదెళ్ళ కిషోర్‌బాబు, ఎస్సీసెల్ అధ్యక్షుడు అక్కిలగుంట మాల్యాద్రి, ఎస్టీ సెల్ అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు, బిసి సెల్ కన్వీనర్ దేగా రాము, అల్లూరు, కావలి రూరల్ మండలాల కన్వీనర్లు దండా కృష్ణారెడ్డి, చింతం బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీల్లో నెల్లూరు మాస్టర్ అథ్లెట్స్



తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో జరుగబోవు జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ పాల్గొననున్నారు. జట్టు సభ్యులకు ఇటీవల నెల్లూరులోని ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో అభినందనసభ జరిగింది. సభలో నెల్లూరు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులైన ఎస్.నరసింహారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎన్.సి.క్రిష్ణయ్య జాయింట్ సెక్రెటరీ ఎన్.వి.రమణరెడ్డి సెక్రటరీ వై.కోటేశ్వరమ్మ, వైస్‌ప్రెసిడెంట్ కె.నారాయణమ్మ, ట్రెజరర్ ఎల్.శిరీషలు పాల్గొని జట్టుసభ్యులకు అభినందనలు తెలుపుతూ కోయంబత్తూరులో జరుగబోవు జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌నందు రాష్ట్రానికి, మంచి పతకాలు సాధించి తద్వారా నెల్లూరు జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు.


# ముస్లింయూత్ శివరాత్రి సందడి


పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న ముస్లింయూత్

శివరాత్రి సందర్భంగా నెల్లూరులోని జూబ్లీహాస్పిటల్లో ఫిబ్రవరి22న ముస్లింయూత్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం యూత్ నేత ఖాలీద్ మాట్లాడుతూ హిందూ సోదరులకు మహాశివరాత్రిని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. యువత చెడుదారుల్లో నడవకుండా ఉన్నంతలో మరొకరికి సహాయపడేలా స్ఫూర్తి నిచ్చేందుకు ఇటువంటి సేవాకార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏ.ఎమ్.సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల వైద్యనిపుణులు డా॥అస్లాం, కె.జి.ఎన్.ఫ్రూట్స్ మున్నా, ఇస్సాక్, ఉమర్ అల్తాఫ్, డిబ్బు, నాజు, నిస్సార్, అనీద్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచలస్వామికి వేలం రాబడి

రాపూరు మండలం పెంచలకోన క్షేత్రంలో ఏడాదిపాటూ వివిధ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి సోమవారం వేలంపాటలు నిర్వహించారు. టెంకాయలు, పూజా సామాగ్రి దుకాణాలను 22.01లక్షలకు, టోల్‌గేట్ నిర్వహణకు 5.87లక్షలకు, డిస్కోడెకరే షన్‌కు 6.77లక్షలకు, ఎలక్ట్రికల్ డెకరేషన్ పనులను 27వేల రూపాయలకు పాడుకున్నారు. గతేడాది వేలంపాటల ద్వారా దేవస్థానానికి 1,90,10,000 రూపాయలు రాగా ఈసారి కూడా అదే స్థాయిలో 1,93,95,500రూపాయల రాబడి వచ్చింది.

శ్రీ కాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానము

శ్రీకాళహస్తి, చిత్తూరుజిల్లా.

శ్రీ జ్ఞానప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానము

భారత దేశమునందలి అనేక పుణ్య క్షేత్రములలో శ్రీకాళహస్తి మహాక్షేత్రము పరమ పవిత్రమైన ప్రసిద్ధ శివక్షేత్రము. ఇది దక్షిణ కైలాసముగాను, సద్యోముక్తి క్షేత్రముగాను ప్రసిద్ధి చెందినది. పంచభూత క్షేత్రములలో శ్రీకాళహస్తి వాయుక్షేత్రముగా ప్రసిద్ధినొందినది.

శ్రీ స్వామివారి మహా శివరాత్రి బ్రహ్మోత్సవములు

తేది 22-02-2014 నుండి 06-03-2014 వరకు అత్యంత వైభవముగా జరుపబడును.

| | |
|---|---|
| 27-02-14 | మహా శివరాత్రి<br>రా॥ 9.00 గం.లకు నంది సేవ |
| 28-02-14 | ఉ॥ 3.00గం.లకు లింగోద్భవము<br>ఉ॥ 9.30గం.లకు రథోత్సవము<br>రా॥ 8.00 గం.లకు తెప్పోత్సవము |
| 01-03-14 | శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవము |
| 02-03-14 | గిరి ప్రదక్షిణము |

భక్తులెల్లరు శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించి కృపాకటాక్షములు పొందుదురుగాక. దేవస్థానములు వివిధ విరాళముల పథకములకు విరాళములు ఇవ్వలసినదిగా భక్తులను కోరడమైనది. పైబ్రహ్మోత్సవముల సందర్భంగా ఏ విధమైన ఆర్జిత సేవలు జరుపబడవు. రాహు - కేతు పూజలు మహాశివరాత్రి రోజున తప్ప మిగిలిన అన్ని రోజుల యందు యథావిధిగా జరుపబడును. మహాశివరాత్రి రోజున రాత్రి 10.00గం.ల నుండి ఉదయం 5.00 గం.ల వరకు సర్వదర్శనము లేదు.

వివరములకు 08578 - 222240,
సెల్. 9963915043(పి.ఆర్.ఓ), 9866889991(ఏ.పి.ఆర్.ఓ)
మరియు email: eo_srikalahasti@yahoo.co.in

బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, శాసనసభ్యులు, శ్రీకాళహస్తి



వై.రామచంద్రారెడ్డి
కార్యనిర్వహణాధికారి, శ్రీకాళహస్తి

"రాహు - కేతు పూజలు నిర్వహించుకోండి - సకల దోష నివారణ పొందండి"

# జిల్లా రాజకీయ వనంలో మరో యువకుసుమం

***ప్రకాశం జిల్లాలోకి మరో నెల్లూరుజిల్లా నేత అడుగు పెట్టబోతున్నాడు. నేటి యువతే రేపటి భవిత అన్న నినాదంతో దేశవ్యాప్తంగా వున్న పార్టీలన్నీ యువతను ఆకర్షిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో యువనాయకుడే అధ్యక్షుడిగా ఏర్పడ్డ వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ సైతం ఎక్కువస్థాయిలో యువతకే ప్రాధాన్యం కల్పిస్తోంది. జగన్ నాయకత్వంలో అధికశాతం కొత్త వాళ్ళను యం.యల్.ఏలుగా యంపిలుగా చూడబోతున్నామన్నది జగమెరిగిన సత్యం.***

ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం నుండి నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన బొమ్మిరెడ్డి సురేష్‌రెడ్డి బరిలో దిగబోతున్నట్లు సమాచారం. సురేష్‌కి వై.యస్.కుటుంబంతో సన్నిహిత సంబంధాలు వుండడంతో పాటు జగన్ ఆశీస్సులు కూడా లభించాయని తెలిసింది. ఇక్కడ నుండి జగన్ బాబాయి వై.వి.సుబ్బారెడ్డి పోటీలో వుండబోతున్నారన్న ప్రచారం మొదటి నుండీ జరిగినప్పటికీ ఇప్పటికే సుబ్బారెడ్డి చెల్లెలి భర్త బాలినేని శ్రీనివాసులురెడ్డి జిల్లా పార్టీకి నాయకత్వం వహిస్తుండడంతో వీళ్ళిద్దరి మధ్య ఎలాంటి విభేధాలు వుండకూడదన్న సంకల్పంతోనే ఇక్కడ కొత్త అభ్యర్థిని జగన్ తెరపైకి తెచ్చినట్లు పార్టీశ్రేణులు చెప్తున్నాయి. సుబ్బారెడ్డిని విశాఖ నుండి కాని లేదా నరసరావుపేట నుండి కాని బరిలో వుంచుతారని చెప్తున్నారు.

బొమ్మిరెడ్డి సురేష్‌రెడ్డి ప్రకాశం జిల్లా రాజకీయాలకు పూర్తిగా కొత్తవాడు. నెల్లూరు జిల్లాలో ఎక్కువస్థాయిలో బంధుమిత్రులు వున్న సురేష్‌కుటుంబానికి ప్రకాశంజిల్లాలో కూడా మంచి స్నేహసంబంధాలు వున్నాయి.

బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలలో పలు వ్యాపారాలు నిర్వహిస్తూనే మరో వైపు "డ్రీమ్ ఇండియా ఫౌండేషన్" అనే సేవాసంస్థను నెలకొల్పి విద్యారంగానికి దూరమౌతున్న పేద విద్యార్థులను ఆదుకుంటూ వారి చదువులకోసం అధిక మొత్తాన్ని వెచ్చిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నాడు. 108మంది పేద పిల్లలను దత్తత తీసుకుని "డ్రీమ్ ఇండియా ఫౌండేషన్" ద్వారా వారిని చదివిస్తూ వారి కనీస అవసరాలను తీరుస్తూ విద్యారంగంపై తనకున్న మక్కువను కనపరుస్తున్నాడు.

సోదరులు బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, బొమ్మిరెడ్డి సునీల్‌రెడ్డిలతో కలిసి అలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ ప్రైలిమిటెడ్, బొమ్మి మెరైన్స్ ప్రై.లిమిటెడ్, వి.ఎస్.ఎగ్జిమ్ ప్రై.లిమిటెడ్ శ్రీ శ్రీనివాస ఫ్యూయర్స్ వంటి వ్యాపారసంస్థల్లో భాగస్వామ్యుడిగా



**బొమ్మిరెడ్డి సురేష్‌రెడ్డి
ఒంగోలు పార్లమెంటుకు
వై.యస్.ఆర్.సి.పి నుండి పోటీ**

యువవ్యాపారవేత్తగా రాణించాడు సురేష్‌రెడ్డి. సేవారంగంలో అడుగుపెట్టాలనే ఆలోచన మదిలో మెలిగినప్పుడు ఆయనకు ముందుగా గుర్తొచ్చిన వ్యక్తి మహానేత డా॥వై.యస్.రాజశేఖరరెడ్డి, ఆయన స్ఫూర్తితో ఆయన ఆశయాలతో ఏర్పడిన వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ వేదికగా తన రాజకీయ సేవా ప్రస్థానాన్ని కొనసాగించాలనుకోవడం అందుకు జగన్ ఆశీస్సులు లభించడంతో రానున్న ఎన్నికలలో ఆయన ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా వై.యస్.ఆర్.సి.పి నుండి పోటీచేయనున్నట్లు బొమ్మిరెడ్డి అభిమానులు చెప్పారు.

ఒక మంచి ఆశయంతో, సేవాదృక్పథంతో నెల్లూరు జిల్లా నుండి ప్రకాశం జిల్లాలో అడుగుపెడుతున్న ఈతరం వ్యక్తి సురేష్‌రెడ్డి, ఆయన కూడా పార్లమెంటు సభ్యుడిగా కొలువుతీరుతాడని ఆశిద్దాం.

## మాగుంట శీనయ్య దారెటు..?

మొన్నటి వరకూ కాంగ్రెస్ పార్టీలో వుంటూ ప్రకాశంజిల్లాలో చక్రంతిప్పిన మాగుంట శ్రీనివాసులురెడ్డి తన యం.పి.పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే శీనయ్యను వై.యస్.ఆర్.సి.పి నుండి పోటీ చేయవలసిందిగా మాగుంట అభిమానులు వత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు వై.యస్.ఆర్.సి.పిలో ప్రవేశం కోసం శీనయ్య ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు చెప్తున్నారు. అయితే ఒక్కసారి ఇచ్చిన మాటను వెనక్కి తీసుకునే అలవాటు వై.యస్ జగన్‌కులేదు కాబట్టి మాగుంట ప్రయత్నాలు ఫలించే అవకాశమేలేదంటున్నారు ఆ పార్టీ శ్రేణులు. సురేష్‌రెడ్డి కన్నా మాగుంట శీనయ్య అయితే ఇక్కడ పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నది కొందరి వాదనైతే పార్టీ ఇప్పటికే బాగా బలంగా వుందని ఇప్పుడు శీనయ్య వచ్చి కొత్తగా చేసేదేమీ లేదని ఒంగోలులో ప్రస్తుతం శీనయ్యకి అంత సీన్ కూడా లేదని మరికొందరి వాదన. మరి జగన్ తన ప్రత్యేకతని ఋజువు చేసుకుంటాడో లేక అందరు రాజకీయనాయకులాగా పరిస్థితులను బట్టి మాట మారుస్తాడో అని ప్రకాశం జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు.

## చంద్రబాబు పర్యటన మార్చి5కి వాయిదా

మార్చి2వ తేదీ జరగాల్సిన నెల్లూరులోని చంద్రబాబు 'ప్రజాగర్జన' 5వ తేదీకి వాయిదా పడింది. గురువారం రాత్రికి ఈ సమాచారం అందింది. సభా ప్రాంగణం కూడా వి.ఆర్.సి మైదానం నుండి మారే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ సంచికలోని 8వ పేజీలో చంద్రబాబు పర్యటన 2వ తేదీ అన్నట్లుగా ప్రచురించాం. పాఠకులు సవరించుకోగలరని మనవి.

## కిరణ్ వెంటే నడిచేదెవరు?

### జిల్లాలో కొరవడుతున్న సహకారం



***పూర్వ ఆంధ్రప్రదేశ్‌లోని 23జిల్లాలలో రాజకీయంగా నెల్లూరుకు ఒక ప్రత్యేక గుర్తింపు వుంది. ఏ రాజకీయపార్టీ అయినా నెల్లూరు జిల్లాలో లభించే ఆదరణను బట్టే మనుగడ సాగించగలుగుతుంది. రాజకీయాలలో విజయాలకైనా, సినిమాల సక్సెస్‌కైనా నెల్లూరు ఒక సెంటర్. ఇక్కడ సినిమా హిట్ అనే టాక్ వస్తే రాష్ట్రమంతా ఆ సినిమా హిట్ అవుతుంది. ఇక్కడ ఏ పార్టీకైనా బాగా సీట్లొస్తే రాష్ట్రంలో ఆ పార్టీయే అధికారంలోకి వస్తుంది.***

2008లో ప్రజారాజ్యం పార్టీని స్థాపించిన చిరంజీవికి సైతం నెల్లూరుజిల్లాలో ఒక ఎమ్మెల్యే సీటు వచ్చింది. ఆరోజు కనీసం ప్రజారాజ్యం పార్టీకి అన్ని చోట్ల అభ్యర్థులన్నా దొరికారు. కొంత చిరంజీవి సినిమా గ్లామర్ ఉపయోగపడింది.

ఇప్పుడు కిరణ్ సొంత పార్టీ పెడుతున్నాడు. ఆయనకు ఎటువంటి గ్లామర్ లేదు. నరేంద్ర మోడీ, నితీష్‌కుమార్, అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ వంటి నేతల మాదిరిగా సొంత బ్రాండ్ ఇమేజ్ లేదు. పరిపాలనలో విరగబొడిచిందేమీ లేదు. సమైక్యాంధ్ర ఉద్యమంలో కాంగ్రెస్ అధిష్టానాన్ని వ్యతిరేకించడం ద్వారా కొంత ఇమేజ్ తెచ్చుకున్నాడు. అయితే అధిష్టానంపై తన వ్యతిరేకతను విలేకరుల సమావేశం పెట్టి వెల్లడించాడేగాని ప్రజలమధ్యకు పోయి కాదు. విభజనపై కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంటే సీఎం పదవికి రాజీనామా చేయడానికి కూడా చాలా తాత్సారం చేసాడు. కాంగ్రెస్ విభజన నిర్ణయాన్ని గట్టిగా వ్యతిరేకిస్తూ, సీఎం పదవికి ముందుగానే రాజీనామా పడేసి ఆయన ప్రజల్లోకి వెళ్లిపోయి కాంగ్రెస్ మీద యుద్ధం చేసివుంటే, ఈరోజు ఆయన పార్టీ పెట్టినా ఫలితముండేది. కాని ఆయన ప్రెస్‌మీట్లలోనే పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించాడు. అదే సమయంలో విభజన నిర్ణయం తీసుకున్న సోనియాగాంధీ మీద మాత్రం బహిరంగ విమర్శలు చేయలేకపోయాడు. విభజన బిల్లు పెట్టే ముందురోజు కూడా విలేకరుల సమావేశంపెట్టి సోనియా వల్లే తనకు సీఎం పదవి వచ్చిందని చెప్పుకున్నాడు. అసలే సీమాంధ్ర జనం సోనియాగాంధీ మీద ఉడికిపోతున్నారు. అలాంటి సోనియాను ఈయన పల్లెత్తుమాట కూడా అనడం లేదు. ముఖ్యమంత్రిగా వుండి కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయాన్ని తిరస్కరించడం తప్ప ఇక కిరణ్ గొప్ప తనమేమీ లేదు. సొంతంగా ఇమేజ్ లేదు. సొంత ఓటుబ్యాంకు లేదు, పార్టీని నడిపించే ఉత్సాహం కూడా లేదు. మరి ఆయన పార్టీలోకి ఏ నమ్మకంతో వెళ్లగలరు.

మన జిల్లా నుండి కిరణ్ పార్టీలో ఎవరూ పెద్దగా చేరకపోవచ్చు. కిరణ్‌కు సన్నిహితంగా ఉండే ఆదాల ప్రభాకర్‌రెడ్డే తెలుగుదేశంలో చేరుతున్నాడు. ఇక ఆయనను నమ్మి జిల్లాలో ఎవరు మాత్రం వెంటనడుస్తారు.

### పల్లిపాడులో పల్లెవాసుల


## శివరాత్రి సంబరాలు



రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 27వతేదీ గురువారం శివరాత్రి మహోత్సవాలు అత్యంత ఆడంబరంగా జరిగాయి. నెల్లూరుజిల్లా పల్లిపాడు గ్రామంలోని మీనాక్షీ సమేత రామేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ ఉత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ దేవాలయాన్ని చోళరాజులు 1500వ సంవత్సరంలో నిర్మించారు. ఈ ప్రాంగణంలో రామలింగేశ్వరుడు, వేణుగోపాలుడు ఇద్దరూ కొలువై వున్నందున ఈ దేవాలయం దక్షిణకాశీగా కూడా బాగా ప్రసిద్ధి. ఇక్కడ వీరితో పాటుగా అభయఆంజనేయస్వామి, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, చండీశ్వరి, నాగేంద్రస్వామి, నవగ్రహాలు కొలువై రెండు ధ్వజస్థంభాలు ఒకే ప్రాంగణంలో వుండడంతో ఒక ప్రత్యేకస్థానం ఈ ఆలయానికి వుంది. ముఖ్యంగా 2012 సంవత్సరంలో ఎండోమెంట్స్‌శాఖతో సంబంధం లేకుండా ఈ పురాతన ఆలయాన్ని పల్లిపాడు గ్రామస్థులే అత్యంత అధునాతనంగా తీర్చిదిద్దుకుని చుట్టు ప్రక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు. "ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూసి మోసపోకుమా" అన్న ప్రముఖ కవి సూక్తులను ఆదర్శంగా తీసుకుని తమ ఆలయాన్ని తామే ఆధునీకీకరించుకోవడానికి ఈ పల్లెవాసులు ఒక్కటయ్యారు.

పెన్నానదికి తూర్పున వున్న ఈ ఆలయంలో 27వతేదీ ఉదయం నుండే 28తెల్లవారుజాము వరకూ శివరాత్రి సంబరాలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఉదయం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, గణపతి హోమము, రుద్రహోమము, కళ్యాణము పూలంగి సేవ జరిగాయి. సాయంత్రం సహస్రనామ కుంకుమార్చన జరిగిన అనంతరం దేదీప్యమానమైన విద్యుత్‌దీపాలంకరణ, కన్నుల పండువగా పుష్పాలంకరణ జరిగింది. అనంతరం రాత్రి 10గంటల నుండి తెల్లవారే వరకు గంగమ్మ తల్లి దారి చూపగా భారీ బాణా సంచాలూ, మంగళవాయిద్యాలు, తెనాలి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన బ్యాండు వాయిద్యాలు, దేదీప్యమానమైన ప్రభలూ వెంటరాగా వివిధ నృత్య విన్యాసాలతో ఆనందోత్సాహాల నడుమ వందలాదిమంది భక్తులు, యువతీ యువకులు తరలిరాగా నంది వాహనంపై స్వామి వూరేగారు.

తమ బడి, తమ గుడి తామే బాగుచేసుకుని తమ బాగోగులు తామే చూసుకుంటూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న పల్లిపాడు గ్రామస్తులు నిజంగా అభినందనీయులు. 2012 డిసెంబర్ 5వతేదీన జరిగిన ఆలయ పునఃప్రారంభం ఉత్సవానికి పల్లిపాడులోని ప్రతి ఇంటి నుండి ఆడపడుచులతో సహా తమ స్వంత ఇంటి వేడుకకు వచ్చినట్లుగా సకుటుంబసపరివారంగా తరలివచ్చి తమ దేవాలయ అభివృద్ధిని చూసి పొంగిపోయారు. ఇప్పుడు జరిగిన శివరాత్రి ఉత్సవాలకుసైతం తమ ఇంట్లో పండుగ జరిగినట్లుగా అంతా ఒక్కటై ఆలయ ప్రాంగణాన్ని కళకళలాడించారు. వీరి ఐక్యమత్యం ఎప్పుడూ అలాగే ఉండి ఆ స్వామివారల కరుణాకటాక్షాలతో ఈ గ్రామప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని "లాయర్" ఆకాంక్ష.



# నెల్లూరు కబుర్లు

## బాబు వస్తున్నాడు

తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు మార్చి 2వ తేదీన నెల్లూరుకు వస్తున్నాడు. ఆరోజు విఆర్‌సి మైదానంలో జరిగే ప్రజాగర్జన సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డిలు చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరనున్నారు. మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా చేరే అవకాశముంది. ఇక ఎన్నికల ట్రెండ్ మొదలుకాబోతున్న తరుణంలో ఈ సదస్సును విజయవంతం చేసి ఉత్సాహంగా ఎన్నికలకు పోవాలని ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

## రంగడి బ్రహ్మోత్సవాలు



నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 11వతేదీ నుండి మొదలుకానున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఆలయంలో స్థంభప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. స్థంభానికి పసుపు కుంకుమ పూసి, మామిడితోరణాలు, పూలతో అలంకరించారు. అనంతరం రంగనాథుని స్తుతిస్తూ ప్రతిష్ట నిర్వహించారు. మార్చి11 నుండి 22వతేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 11న అంకురార్పణ, 12న ధ్వజారోహణ, 16న గరుడసేవ, 17న కల్యాణం, 18న రథోత్సవం వంటి కార్యక్రమాలు జరుగనున్నాయి.

## ఆక్రమణలతో అవస్థలు



నెల్లూరులో మద్రాసు బస్టాండ్ నుండి రెడ్‌క్రాస్‌కు వెళ్లే మార్గంలో వున్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని నగరపాలక సంస్థ కమీషనర్ జాన్‌శ్యాంసన్‌ను రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ కోరారు. ఈ రోడ్డులో ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, రెడ్‌క్రాస్ కార్యాలయం, వికలాంగుల పాఠశాల, మున్సిపల్ హైస్కూల్, హాస్టల్స్, ఏఆర్‌వి వ్యాక్సినేషన్ క్లినిక్, హెచ్‌ఐవి క్లినిక్‌లు వున్నాయని, వీటికి వచ్చేవాళ్లు ఆక్రమణల మూలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన కమీషనర్‌కు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ రోడ్లోనే పండ్లబండ్లు పెడుతున్నారు. వాహనాలు పెడుతున్నారు. కుళ్లి పోయిన కూరగాయలను ఈ రోడ్డుపైనే పోస్తున్నారు. దీంతో ఈ రోడ్డు కంపుకంపుగా తయారయ్యింది. మార్కెట్‌కు వచ్చే వాహనాలు అడ్డదిడ్డంగా పెడుతున్నందువల్ల ఆసుపత్రులకు వచ్చే 108, 104 అంబులెన్స్‌లకు కూడా ఇబ్బందిగా వుందని ఆయన పేర్కొన్నారు.

## ఏసిబి డిఎస్పీగా నంజుండప్ప



జిల్లా ఏసిబి డిఎస్పీగా నంజుండప్పను నియమిస్తూ డిజిపి బి.ప్రసాదరావు ఉత్తర్వులు జారీ చేసారు. ఇక్కడ డిఎస్పీగా పనిచేస్తున్న భాస్కరరావును విశాఖరూరల్ ఓఎస్డీగా బదిలీ చేయడం తెలిసిందే. తిరుమలలో శాంతిభద్రతల డిఎస్పీగా పనిచేస్తున్న ఆయనను నెల్లూరు బదిలీ చేసారు. 1985 బ్యాచ్‌కు చెందిన నంజుండప్ప ఆర్ఎస్సైగా పోలీసు విధుల్లో చేరారు. 1992లో కన్వర్షన్ క్రింద సివిల్‌కు మారారు. తిరుపతి, తిరుమల, రేణిగుంట, పలమనేరు, కర్నూలుజిల్లా డోన్, గుంటూరు సిఐడిలో ఎస్ఐగా, సిఐగా విధులు నిర్వర్తించారు. డిఎస్పీగా పదోన్నతి వచ్చాక పలమనేరు డిఎస్పీగా పనిచేసారు. తర్వాత తిరుమలకు బదిలీ అయ్యారు. అక్కడనుండి ఇప్పుడు నెల్లూరుకు మారారు.

# వీఆర్ఓ, వీఆర్ఏ పరీక్షల్లో ప్రతిభ చాటిన నెల్లూరీయులు

రాష్ట్రస్థాయిలో ఇటీవల జరిగిన విఆర్ఓ, వీఆర్ఏ పరీక్షల్లో నెల్లూరుజిల్లాకు చెందిన ఇద్దరు యువకులు తమ సత్తా చాటారు. రాష్ట్రస్థాయిలో 20లోపు ర్యాంకుల్లో రెండు ర్యాంకులు జిల్లాకు సొంతమయ్యాయి. విఆర్ఓ పరీక్షల్లో నెల్లూరుకు చెందిన టివిఎం.కృష్ణప్రసాద్ 98మార్కులతో రాష్ట్రస్థాయిలో 18వ ర్యాంక్, పొదలకూరు మండలం ప్రభగిరి పట్టణంవాసి గోగుల రమేష్ రాష్ట్ర స్థాయిలో 19వ ర్యాంక్ సాధించారు. వీఆర్ఏ పరీక్షల్లో కావలి రూరల్ మండలానికి చెందిన వి.అనిల్‌కుమార్‌రెడ్డి 89మార్కులతో జిల్లాలో ప్రథమస్థానాన్ని పొందాడు. జిల్లాలో వున్న 48వీఆర్ఓ పోస్టులకు సంబంధించి 1.2 నిష్పత్తి ప్రకారం 96మంది అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపనున్నారు. వీఆర్ఏ అభ్యర్థులను క్లస్టర్ స్థాయిలో మెరిట్ ఆధారంగా ఎంపికచేయనున్నారు. ఎన్‌ఐసిఆర్ నెల్లూరు డాట్‌కామ్ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల జాబితా పొందుపరిచారు.

## ప్రింటర్స్ రక్తదానం

సోమవారం ప్రింటర్స్‌డే సందర్భంగా నెల్లూరు రాయాజీవీధిలో ఏపి మాస్టర్ ప్రింటర్స్ యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసారు. పలు ప్రింటర్స్ యజమానులు, కార్మికులు రక్తదానం చేసారు. అక్కడే పేదలకు అన్నదానం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కేశవరావు, కార్యదర్శి రమణారెడ్డి, సంయుక్త కార్యదర్శి రాము, కోశాధికారి శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో సేవలందించిన రోటరీక్లబ్



పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రోటరీక్లబ్ వారు ఫిబ్రవరి 23న రోటరీక్లబ్ సెంటర్, ఆర్.టి.సి బస్టాండ్, మద్రాసు బస్టాండు, ముత్తుకూరు బస్టాండు, గాంధీబొమ్మ సెంటర్‌ల వద్ద పల్స్‌పోలియో శిబిరాలు ఏర్పాటుచేసి 1250 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు టి.శేఖర్ మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ వారు ప్రపంచవ్యాప్తంగా పోలియో నిర్మూలనకు రూ.5500కోట్లు ఖర్చు చేసారని, పోలియో రహిత సమాజ నిర్మాణం రోటరీ ఇంటర్నేషనల్ వారి లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు టి.శేఖర్, కె.ప్రతాప్‌కుమార్ మరియు రోటరీక్లబ్ డాక్టర్ మరియు రొటేరియన్ సి.దొరస్వామి నాయుడు మరియు ఇతర రొటేరియన్స్ పాల్గొన్నారు.

## మార్చి 16న సామూహిక సత్యనారాయణవ్రతాలు



నెల్లూరుజిల్లా బ్రాహ్మణ సేవాసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మార్చి 16న నెల్లూరు జొన్నవాడ మార్గంలోగల దొడ్ల డైరీ దగ్గరగల శ్రీ లక్ష్మీగాయత్రి బ్రాహ్మణ అగ్రహారంలో సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతములు నిర్వహిస్తున్నామని సమాఖ్య గౌరవసలహాదారులు స్వయంపాకుల శ్రీనివాసులు తెలిపారు. విశాఖపట్టణంలోని శారదాపీఠస్థాపక సంస్థానాధీశ్వరులు స్వరూపానంద సరస్వతి మహాస్వామి పర్యవేక్షణలో ఈ వ్రతములు జరుగుతాయని తెలిపారు. వ్రతములో పాల్గొనదలచినవారు సమాఖ్య పాలకవర్గసభ్యుల వద్ద గోత్ర నామములతో పేర్లు నమోదు పరచుకోవాలని దంపతులు సంప్రదాయబద్ధముగా ధోవతి ఉత్తరీయం, చీర, రవిక ధరించవలెనని తెలిపారు. అలాగే ఆచమనీయమునకు కావలసిన పంచపాత్ర ఉద్ధరిణి, పళ్ళెము తెచ్చుకోవాలని సూచించారు. నెల్లూరు ట్రంకురోడ్డులోగల తిప్పరాజు వెంకటసుబ్బయ్య కల్యాణసదన్ నుంచి ఆరోజు ఉదయం 6గం॥లకు వాహనసౌకర్యం ఏర్పాటు చేసామని తెలిపారు.

వివరాలకు 98487 09424, 98484 86599, 94932 36022నెంబర్లలో సంప్రదించమని ఆయన తెలిపారు.

## అధునాతన వైద్యంతో కీళ్ళమార్పిడి

నెల్లూరు ఆర్టీసీ బస్టాండు దగ్గరగల అపోలో హాస్పిటల్స్ సమాచార కేంద్రంలో ఫిబ్రవరి 22న చెన్నై అపోలో ఆసుపత్రి ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్ మదన్‌మోహన్ రెడ్డి మోకాలి మార్పిడికి అధునాతన చికిత్స గురించి వివరించారు. మోకాలి పరిస్థితిని కంప్యూటర్ సాయంతో విశ్లేషించి ఐ-ఇన్వెస్ట్ నేగేషన్ విధానంలో అవసరమైన రీతిలో కృత్రిమ కీళ్ళను అమర్చుతామన్నారు. ఈ శస్త్రచికిత్సలో రోగికి 30ఏళ్ళ వరకు ఎటువంటి ఇబ్బంది వుండదన్నారు. నెల్లూరుజిల్లా శ్రీహరికోటకు చెందిన 56ఏళ్ళ వయస్సు రాలైన లక్ష్మీభాయికి మోకాలి కీళ్ళ మార్పిడిని చెన్నై అపోలో ఆసుపత్రిలో ఫిబ్రవరి 17న విజయ వంతంగా నిర్వహించామన్నారు.

## ముగిసిన పరీక్ష

ఏపిపిఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పంచాయితీ కార్యదర్శుల పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 65కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 నుండి 12.30 వరకు పేపర్-1 పరీక్షకు 16,253 మంది హాజరవగా 6,943 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2గంటల నుండి 4.30గంటల వరకు జరిగిన పేపర్-2 పరీక్షకు 16,183మంది హాజరు కాగా 7,013మంది గైర్హాజరయ్యారు.

## ఎంపీడీఓలకు బదిలీ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 36మంది ఎంపీడీవోలకు స్థానచలనం కలిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల దృష్టిలో ఎంపీడీఓలను బదిలీ చేయడం ఇదే తొలిసారి. 36మంది ఎంపీడీఓల బదిలీకి ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి.

## రేంజర్‌గా రఘురాములు


నెల్లూరు ఫారెస్ట్ రేంజర్‌గా రఘురాములును నియమిస్తూ అటవీశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసారు. గతంలో వున్న రేంజర్ మారుతీ ప్రసాద్ ఏసిబికి చిక్కి విధులకు దూరం కావడం తెలిసిందే.

# పెరుగుతున్న డిపాజిట్లు.. తగ్గుతున్న నష్టాలు!

### - డీసీసీబీ ఛైర్మెన్ మెట్టుకూరు



నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు డిపాజిట్ల సేకరణలో ఎంతో ముందుందని ఆ బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి 'లాయర్'కు తెలిపారు. ప్రస్తుత పాలకవర్గం ఏర్పడిన ఏడాది కాలంలోనే బ్యాంకు డిపాజిట్లను పెంచడంతో పాటు నికర నష్టాలను కొంతవరకు తగ్గించగలిగామన్నారు. 2013జూన్ 30 నాటికి ఋణాల రికవరీ శాతం 85.05శాతం ఉండగా ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి దానిని 93శాతానికి పెంచగలిగామన్నారు. గత ఏడాది 54.54శాతంగా ఉన్న లాభం ఫిబ్రవరి 18నాటికి 84.48శాతంగా పెరిగిందన్నారు. 417.64లక్షల్లో వున్న బ్యాంకు నికరనష్టాలు 333.16లక్షలకు తగ్గాయన్నారు. ఏడాది కాలంలో 2130.60లక్షల డిపాజిట్లు పెరిగాయన్నారు. ఈ ఏడాదిలో 3661.00 లక్షల స్వల్పకాలిక ఋణాలు, 380.86లక్షల దీర్ఘకాలిక ఋణాలను అందించినట్లు పేర్కొన్నారు. ఖాతాదారుల సౌకర్యార్థం రాపూరులో బ్రాంచి ఏర్పాటు చేసామని, అల్లూరు, నెల్లూరులలో కూడా త్వరలో కొత్త శాఖలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. 2014-15 సంవత్సరానికి నష్టాలను పూర్తిగా అధిగమించి బ్యాంకును లాభాల్లోకి తేవడమే తమ ధ్యేయమన్నారు.



ఫిబ్రవరి 26వ తేదీన నెల్లూరులోని డ్రైవర్స్ కాలనీలో సి.సి. రోడ్లు మరియు డ్రైన్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, చాట్ల నరసింహారావు తదితరులు

## పోయినోళ్లు చెడ్డోళ్లు...
# ఉన్నోళ్లు మంచోళ్లు

సింహపురి సమాచారం



కాంగ్రెస్‌పార్టీ మహాసముద్రం లాంటిదని, తమ స్వార్థం కోసం ఎంతమంది నాయకులు పార్టీని వీడిపోయినా కాంగ్రెస్ కొచ్చే నష్టమేమీ ఉండదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులోని విఆర్‌సిలో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ద్వారా లబ్ధిపొంది తమ స్వార్థం కోసం ఈరోజు కొందరు పార్టీని వదిలి పోతున్నారని, అలాంటోళ్లు తొందరగా వెళితే మిగిలి ఉన్న వాళ్లతోనే పార్టీని ముందుకు తీసుకెళతామన్నారు. విభజన విషయంలో కాంగ్రెస్ చేసింది తప్పే అయినా ఇందులో అన్ని పార్టీలకు భాగస్వామ్యం ఉందన్నారు. అన్ని పార్టీలు విభజనకు సరే అన్నాకే కాంగ్రెస్ నిర్ణయం తీసుకుందన్నారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరునగర నియోజకవర్గం నుండి నేను, రూరల్ నియోజకవర్గం నుండి తన సోదరుడు ఆనం విజయకుమార్‌రెడ్డి పోటీ చేస్తారని వెల్లడించారు. నెల్లూరు పార్లమెంటుకు సరైన అభ్యర్థి తమ వద్ద ఉన్నాడని, సమయం వచ్చినప్పుడు పేరు బయటపెడతామన్నారు. నెల్లూరులో 2వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, దీనికి మీడియా ఎంతో సహకరించిందని అన్నారు. జిల్లాలో 85ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబం తమదేనని, నెల్లూరులో రౌడీయిజం లేకుండా చేసింది కూడా తామేనన్నారు. కాంగ్రెస్ నుండి కార్యకర్తలెవరూ పోవడం లేదని, కాంగ్రెస్ వల్ల కోట్లు గడించి, చివరిదాకా అధికారాన్ని అనుభవించిన కాంట్రాక్టర్లు, కోటీశ్వరులే ఇప్పుడు కాంగ్రెస్‌పై బురదచల్లి పోతున్నారన్నారు.

ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు చాట్ల నరసింహారావు, మాజీమేయర్ భానుశ్రీ, కాంగ్రెస్ నాయకులు పిండి సురేష్, రావుల వెంకటజ్యోతి, కిన్నెర ప్రసాద్, కర్తం ప్రతాప్‌రెడ్డి, బర్నాబాసు తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాలా... రా ఇలా!

## అన్ని పార్టీల ఆహ్వానం



కావలి నియోజకవర్గంలో తనకంటూ సొంత వర్గాన్ని కలిగిన మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి ప్రస్తుత రాజకీయాలలో తటస్థవైఖరిని అవలంభిస్తున్నారు. తెలుగుదేశంలో ఉన్న ఆయన అధినేత చంద్రబాబు వైఖరి నచ్చక కొంతకాలం క్రితం పార్టీ నుండి బయటకొచ్చారు. తర్వాత ఏ పార్టీలోనూ చేరలేదు. త్వరలో ఎన్నికలు వస్తున్నాయి. కాబట్టి రాజకీయంగా ఆయన ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సివుంది. తాను ప్రత్యక్షంగా ఎన్నికలలో దిగకపోయినా ఏదో ఒక పార్టీకి మద్దతుగా పనిచేస్తేనే ఆయన వెనుక కేడర్ నిలబడుతుంది. ప్రస్తుతం ఆయన పొలిటికల్ జంక్షన్‌లో ఉన్నాడు. మా వైపు రండంటే మా వైపు రండని మూడు ప్రధానపార్టీలు ఆహ్వానిస్తున్నాయి. ఒక దశలో ఆయన కాంగ్రెస్‌లో చేరతాడనే ప్రచారం జరిగింది. అయితే ఆయన కాంగ్రెస్‌లోకి పోలేదు. ఇప్పుడైతే పోయే పనికూడా లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ దివాళా ఎత్తింది. కాంగ్రెస్‌లో ఉన్న నాయకులే తెలుగుదేశం, వైకాపాలలోకి పోతున్నారు. వంటేరుకు మంచి స్నేహితుడైన ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా తెలుగుదేశంలోకి వస్తున్నాడు. ఈ నేపథ్యంలో వంటేరు కూడా తన ఆలోచనను మార్చుకుంటున్నట్లు తెలుస్తుంది. కావలి వైకాపా అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని నియమించారు కాబట్టి ఇక ఆ పార్టీలోకి పోవడం కూడా దండగ. ఈ ఎన్నికలలో వంటేరు ఎవరి కోసమైనా తిరిగి రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాలంటే అది కేవలం ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోసమే. నెల్లూరు లోక్‌సభ తెలుగుదేశం అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి పోటీ చేయబోతున్నాడు. ఆదాల గెలుపు కోసం వంటేరు తిరిగి తెలుగుదేశంలోకి రావడమో లేకుంటే పార్టీతో నిమిత్తం లేకుండా ఆదాలకు మద్దతుగా పనిచేయడమో జరగొచ్చు. వంటేరుకు కావలితో పాటు ఉదయగిరి నియోజకవర్గంలోనూ సొంత కేడర్ వుంది. కాబట్టి ఆయన 'దేశం'లోకి వస్తే ఆదాలకు కొంత బలం చేకూరడం ఖాయం.

# వైఎస్సార్సీపీలోకి గౌరవరం యూత్



కావలి రూరల్ మండలం గౌరవరం అరుంధతీవాడకు చెందిన 50మంది యువకులు ఫిబ్రవరి 23న కావలి రూరల్ మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ చింతంబాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీలో చేరారు. వీరికి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పార్టీకండువా వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. దేవరపల్లి చంద్ర, డి.మాల్యాద్రి, డి.శీనయ్య, బోయిన ప్రసాద్, మహాదేవ, గుర్రం శ్రీనివాసులు, డి.మల్లికార్జున, ఎన్.సాల్మన్, శ్రీనాథ్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఈశ్వర్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

# గంధమహోత్సవంలో శ్రీధర్‌రెడ్డి



నెల్లూరులో ఉన్న ఖాదర్‌వల్లీ దర్గాలో జరిగిన గంధమహోత్సవ కార్యక్రమంలో ఫిబ్రవరి 22న వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు రూరల్ కో–ఆర్డినేటర్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు నరసింహయ్య ముదిరాజ్, పురుషోత్తమయాదవ్, బషీర్‌భాయ్, జావీద్, రఫీ, యస్‌దానీ, జిలానీ, సంధానీ, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



నిర్యాణం: 1995, మార్చి 1వ తేదీ

స్వర్గీయ శ్రీమతి రుక్మిణమ్మ

(స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారి ధర్మపత్ని)

## మాతృదేవోభవ

మా మాతృమూర్తి దైవసన్నిధికి చేరి

పంతొమ్మిదేళ్లు నిండనున్న సందర్భంగా

ఆమె ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

ఆమె ఆత్మీయులైనవారందరికీ

మా మాతృదేవత ఆశీస్సులు కోరుకుంటూ...

డా॥ టి.సుబ్బరామిరెడ్డి

రాజ్యసభ సభ్యులు

మరియు

వారి కుటుంబసభ్యులు

● పేరు గొప్ప వూరు దిబ్బ

## మురుగు గుంటలు ముళ్ళకంపలతో...

# మాగుంట లే అవుట్ ఖాళీస్థలాలు

- అసోసియేషన్ ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన ఖాళీస్థలాలను పూడ్చని మూర్ఖపు యజమానులు
- నోటీసులులిస్తామంటూనే కాలక్షేపం చేస్తున్న మునిసిపల్ అధికారులు
- మాగుంట వాళ్ళవే చాలా ఖాళీస్థలాలు కంపుకొడుతున్నాయి.


మాధవయ్య & సన్స్‌కి చెందిన ప్లాట్ నెం.887

***నెల్లూరు జిల్లాలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన లే అవుట్‌గా 151ఎకరాల విస్తీర్ణంలో ఏర్పడిన అతి పెద్ద లే అవుట్ మాగుంట లే అవుట్. 1990-93సంవత్సరాల మధ్యలో అన్ని హంగులతో విశాలమైన రోడ్లతో డిటిసిపి అనుమతులతో మాగుంట సుబ్బ రామిరెడ్డి కలలకు ప్రతిరూపంగా ఈ లే అవుట్ ఏర్పడింది. ప్రపంచస్థాయి నిర్మాణాలను నెల్లూరులో చేపట్టి అద్భుతాలను నెల్లూరీయులకు చూపించాలనుకున్న ఆయన కల నెరవేరకుండానే 1995 డిసెంబర్ 1న మృత్యువు నక్సలైట్ల రూపంలో ఆయనను కబళించింది.***

ఆయన దివంగతులైన అనంతరం ఆయన కుటుంబసభ్యులు ఆయన అందించిన రాజకీయ వారసత్వాన్ని ఆయన సంపాదించిన ఆస్థిపాస్తులని పంచుకున్నారే తప్ప ఆయన ఆశయాలను, ఆలోచనలను ప్రక్కనపెట్టేశారు. ఎంతో ముందుచూపుతో సుబ్బరామన్న ఆవిష్కరించిన మాగుంటలే అవుట్ ఇతర సాదాసీదా లే అవుట్లలాగా అభివృద్ధికి ఆమడదూరంలోనే వుండిపోయింది. అప్పట్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి వచ్చిన కారణంగా కమర్షియల్‌గా ఎదిగి ప్లాట్ల విలువ అపారంగా పెరిగిపోయిందే తప్ప గడచిన 20సంవత్సరాల కాలంలో ఈ మూడేళ్ళుగానే కొద్దికొద్దిగా అభివృద్ధికి నోచుకుంటోంది. ఆనం వివేకానందరెడ్డి మాగుంట లే అవుట్‌ని ఉద్దేశిస్తూ పదేపదే అనే మాట ***"నాకు ఈ లే అవుట్ అంటే ఇష్టంలేదు" ఇక్కడంతా డబ్బులుండేవాళ్ళే వున్నారు. రోడ్లు, డ్రైనేజీ, లైట్లు లేకుండానే మాగుంట వాళ్ళ దగ్గర ఫ్లాట్లు కొనుక్కొని ఇళ్ళు కట్టుకున్నారు. మీకు మేమేందుకు అభివృద్ధిచేయాలి మీరసలు ఓట్లు వేయడానికూడా రారు. మీకు అభివృద్ధి కావాలంటే వెళ్ళి మాగుంట వాళ్ళనే అడగండి"*** మాగుంట లే అవుట్‌కి వచ్చినప్పుడల్లా ఆనం వివేకా ఇచ్చే వూకదంపుడు ఉపన్యాసం ఇదే. మాజీ మేయర్ శ్రీమతి భానుశ్రీ చొరవతో ఇప్పుడిప్పుడే ఆయనకు ఈ లే అవుట్‌పై దయ కలిగి గత మూడేళ్ళలో కొంత అభివృద్ధి చెందింది. రోడ్లు బాగుపడుతున్నాయి, కాలువలు ఏర్పడుతున్నాయి, మంచినీటి వసతి ఏర్పడింది వీధిలైట్లు వెలుగుతున్నాయి. లక్ష నుండి అంకణం ధర 4లక్షలకు పెరిగిపోయింది. కాని ఇక్కడ స్థలాలున్న యజమానుల మైండ్‌సెట్ మాత్రం మారలేదు. అధికశాతం ఇళ్ళు నిర్మించుకున్నప్పుడికీ ఇంకా వందల సంఖ్యలో ఖాళీ ప్లాట్లు వుండిపోయాయి. అప్పట్లో కేవలం లక్షరూపాయలకు ప్లాట్లు కొనుకొన్న యజమానులు ఇప్పుడు కోట్ల రూపాయల విలువైన ఆ ఫ్లాట్లను 20లేదా 30వేలు పెట్టి మట్టితో పూడ్పించడానికి లెక్కలు వేసుకుంటున్నారు.


మాగుంట వారి ఆధీనంలో వున్న ప్లాట్ నెం. 348

ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ పలుమార్లు స్థలాల యజమానులను సంప్రదించి వారి ఖాళీస్థలాల్లో నిలిచి వున్న నీరు కారణంగా పందులు తిరగడమే కాకుండా దోమలు ఉత్పత్తి అవుతున్నాయని తద్వారా అక్కడ నివాసం వుండే ప్రజలు రోగాలబారిన పడుతున్నారని విజ్ఞప్తి చేయగా చాలా మంది స్పందించి వెంటనే తమ స్థలాలను మట్టితో పూడ్పించి లెవెల్ చేసి నీరు నిలవకుండా చేశారు. మరికొంత మంది మాత్రం మూర్ఖంగా వ్యవహరిస్తూ మీకు జబ్బులొస్తే మీరే పూడ్పించుకోండి మాకేం అవసరం అంటూ అసోసియేషన్ సభ్యులపై విరుచుకుపడడం గమనార్హం.

ఉదాహరణకు పిచ్చిరెడ్డి కళ్యాణమండపం యజమాని చెరకుపల్లి పిచ్చిరెడ్డి ఇంటి వెనుక ఖాళీస్థలం మాధవయ్య & సన్స్ ఫర్నిచర్ షాపుకు చెందినది. గతకొంతకాలంగా పిచ్చిరెడ్డి అనారోగ్యంతో ఇంట్లోనే వుంటూ తమ ఇంటి వెనుక స్థలాన్ని పూడ్పించమని పలుమార్లు అసోసియేషన్‌కి విజ్ఞప్తి చేశారు. అయితే గత ఏడాది కాలంగా వందలసార్లు మాధవయ్య & సన్స్ వారిని ఈ విషయమై అభ్యర్థిస్తే మేం పూడ్చే ప్రసక్తేలేదు మీకు చేతనైంది చేసుకోండంటూ తలబిరుసుగా సమాధానం చెప్పారు. మీకు దోమలు కుడితే మాకేం సంబంధం, వెళ్ళి మునిసిపల్ అధికారులని అడగండంటూ అసోసియేషన్ సభ్యులని తరుముకున్నారు.

మునిసిపల్ రూల్స్ ప్రకారం ఖాళీస్థలాలను తప్పనిసరిగా పూడ్చాలి, లేదంటే వాళ్ళే చర్యలు తీసుకుంటారని చెప్తే మాకు ఆనం కుటుంబం అండగా వుంది మమ్మల్ని మునిసిపాలిటీ వాళ్ళేం పీకుతారు, అంత దూరం వస్తే చూసుకుంటాం అని వారి సోదరుడు అసోసియేషన్‌కి చెప్పాడు. దీన్ని బట్టి గమనిస్తే వీరి మూర్ఖత్వం, పీనాసితనం ఏ స్థాయిలో వుందో మనం అర్థం చేసుకోవచ్చు. కోట్లు విలువ చేసే వారి స్థలాన్ని బాగుచేసుకోమని


మాగుంట వారి ఆధీనంలో వున్న ప్లాట్ నెం. 381

(మిగతా 12వ పేజీలో)

# "బాసు" భక్తి



**భారతదేశంలో చట్ట ప్రకారం బహిరంగ ధూమపానం నిషేధం.
కానీ మన నెల్లూరు గ్రామీణ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డికి చట్టాలు చుట్టాల్లాంటివనుకోండి.
ఇటీవల మూలాపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో తమ "బాసు" సిగెరెట్టుకి నిప్పంటించి
తన విధేయత ప్రదర్శించుకుంటున్న వీరభక్తుడు మాజీకార్పొరేటర్ పిండి సురేష్‌బాబు.**

# దడపుట్టిస్తున్న రాజన్నదళం



శత్రువులను సైతం స్నేహితులుగా చేసుకోవడం లౌక్యంగల రాజకీయ నాయకుడి లక్షణం. స్నేహితుడిని సైతం శత్రువుగా మార్చుకోవడం మూర్ఖపు నాయకుల లక్షణం. మేకపాటి సోదరులు ఈ రెండోరకం రాజకీయాలు చేస్తుంటారు. తమ మూర్ఖత్వంతోనే ఉదయగిరి నియోజకవర్గంలో కంట్లో నలుసుమాదిరిగా మెట్టుకూరు చిరంజీవిరెడ్డిని తయారు చేసిపెట్టుకున్నారు.

జడ్పీ మాజీఛైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅనుచరుడిగా ఆయనతో పాటే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరాడు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి. ఈయనకు ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాలలో గట్టి పట్టుంది. ఒకే పార్టీలో ఉంటున్నప్పటికి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి, చిరంజీవిరెడ్డికి పడకుండా వచ్చింది. సహకార ఎన్నికలప్పుడు వీరి మధ్య విభేదాలకు శంకుస్థాపన జరిగింది. ఆ తర్వాత పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేసాడనిచెప్పి చిరంజీవిరెడ్డితో పాటు ఆయన అనుచరులను కూడా సస్పెండ్ చేయించారు మేకపాటి సోదరులు. దీంతో చిరంజీవిరెడ్డి సొంతంగా రాజన్నదళం పేరుతో పార్టీని పెట్టుకున్నాడు. మొన్న పంచాయితీ ఎన్నికల్లో కూడా కలిగిరి మండలంలో తన సత్తా చాటుకున్నాడు. ఇప్పుడు ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో పర్యటిస్తూ తన వర్గాన్ని పెంచుకుంటున్నాడు. రేపు ఎన్నికల్లో రాజన్నదళం తరపున పోటీ చేస్తే మేకపాటికి ఇబ్బంది ఖాయం.

# తెలుగుభాషపై వక్తృత్వపోటీ


ప్రసంగిస్తున్న జానకీదేవి

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని కెఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తెలుగుభాషపై వక్తృత్వపోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఆంగ్లపదం దొర్లకుండా తెలుగులో మాట్లాడిన వారిని విజేతలుగా ఎంపిక చేసారు. కార్యక్రమానికి నెల్లూరు సంతపేటలోని బి.యిడి కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు డా॥ ఎన్.జానకీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మన మాతృభాష తెలుగని, అందులో పట్టు సాధిస్తే పరభాషలను ఎంతో సులభంగా నేర్వవచ్చని పేర్కొన్నారు. మాతృభాషను మరవడం అంటే కన్నతల్లిని మరవడమేనని అన్నారు. తెలుగు ఉపాధ్యాయులు గుండాల నరేంద్రబాబు, ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు రవీంద్రయ్యల సమక్షంలో జరిగిన వక్తృత్వపోటీలో విజేతలైన విద్యార్థులకు డా॥ జానకీదేవి బహుమతులందించారు. తదుపరి ఆమెను ఉపాధ్యాయులు దుశ్శాలువాతో సత్కరించారు.

# విశేషరీతిలో 'రత్నం' విజ్ఞాన ప్రదర్శన

నెల్లూరు ధనలక్ష్మీపురంలోని రత్నం హైస్కూలులో ఫిబ్రవరి 26వ విశేషరీతిలో విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ సోమశేఖరం విజ్ఞాన ప్రదర్శనను సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రత్నం విద్యాసంస్థల ఛైర్మెన్ కె.వి.రత్నం మాట్లాడుతూ విద్యార్థుల్లో అమూర్తభావనలుగా వున్న వాటిపై చక్కటి అవగాహన ఏర్పరిచేందుకు ఈ విజ్ఞాన ప్రదర్శనలు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో రత్నంహైస్కూలు యం.డి.వేణుగోపాల్, అకడమిక్ డైరెక్టర్ శంకరయ్య, పిడతాపోలూరు స్కూలు మేనేజర్ భాస్కరనాయుడు, సీఈఓ హరిప్రసాద్, ప్రిన్సిపల్ పుష్పలత, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# నన్ను నిలువునా ముంచిండ్రు

**ఓ పోరాట యోధుడి ఆత్మకథ**

ఇది కథనుకోండి... వ్యథనుకోండి... నా మనసులో బాధను చెప్పుకుంటున్నా... నా మనసు పడే వేదన వర్ణించాలంటే ఆరుద్ర, ఆత్రేయలు రావాలేమో... ఎన్ని లీటర్ల మందు తాగితే నేను ఈ బాధను మరచిపోగలను...

అవి నేను తెలుగుదేశంపార్టీలో మంచిగా వుండే రోజులు. ఎన్టీఆర్ అయితే నన్ను తమ్ముడి లెక్క చూస్కునేటోడు. అందుకే నా కొడుక్కి ఆయన పెరే పెట్టుకున్నా. ఎన్టీఆర్ తర్వాత దొంగసచ్చినోడు చంద్రబాబు వచ్చిండు. మొదట మంత్రి పదవి ఇచ్చిండు. పరిస్థితి బాగానే వుందిలే అని సర్దుకొంటి, *1999* ఎలక్షన్‌లు జరిగాక నాకు మంత్రి పదవి ఎగ్గొట్టిండు, ఏం జేస్తన్... పదవి లేకపోతే ఫైళ్లుండవ్, పైసలుండవ్... నేను ఖాళీగా ఎందుకుండాలె... జనాన్ని ఖాళీగా ఎందుకుంచాలె అని తెలంగాణ ఉద్యమం లేవదీస్తి, మా ఊర్లో శెట్టిగారి షాపుకెళ్లి రంగుల బట్టలు చూపించమంటిని, ఆ శెట్టి నా ముందు పలు రంగుల గుడ్డలు వేసి... ఏం కేసీఆర్ పండక్కి కొత్త చొక్క, చెడ్డీ కుట్టించుకుంటున్నావా అని అడిగిండు. లేదురా భాయ్... కొత్త పార్టీకి ఏ రంగు జెండా పెడదామా అనుకుంటున్నా అని చెప్పా. ఆ శెట్టి భయ్ వుండి... ఈ గులాబీరంగు గుడ్డ తీసుకోన్నా... ఇంతవరకు ఏ పార్టీ వాళ్లు ఈ రంగు జెండా పెట్టుకోలేదన్నాడు. నాకు కూడా ఆ రంగు నచ్చింది. టీఆర్ఎస్ పార్టీని పెట్టేసి గులాబీ రంగు జెండా పట్టుకున్నాను. ఎలక్షన్ కమీషనోళ్లు కారు గుర్తు ఇచ్చారు. పార్టీ పెట్టాక నా పని బాగుండింది. అంతకు ముందు తెలుగుదేశంలో ఎన్టీఆర్‌కు, చంద్రబాబుకు నేను జైకొడ్తిని, ఇక్కడ మాత్రం వచ్చిన వాళ్లంతా నాకు జై కొడుతుంటే ప్రాణం గాల్లో తేలినట్లు ఉండే. తెలంగాణ అనే అగ్గిపుల్లను నేను వెలిగిస్తిని, క్రమక్రమంగా ఆ అగ్గిపుల్లతో తెలంగాణ అంతటా మంటలు పెడ్తిని. అన్ని పార్టీల్లో నాయకులొచ్చె, నా పంచన చేరిండ్రు. జాతీయ స్థాయిలో నేనో లీడర్ నైపోతిని. కాంగ్రెస్, తెలుగుదేశం, బీజేపీ వోళ్లు నాతో పొత్తు కోసం పాకులాడిండ్రు. చంపుడో, చావుడో, తెంచుడో, దంచుడో, పంచుడో, నంచుడో అంటూ తెలంగాణ ఉద్యమాన్ని తెగఎగదోస్తిని. సీమాంధ్ర పారిశ్రామికవేత్తలొచ్చి నా కాళ్ల ముందు బడి... కేసీఆరా నువ్వే కాపాడాలనిరి. వాళ్ల దగ్గర మస్తు కలెక్షన్‌లు... తెలంగాణ భవన్ కడితి. వై.యస్. టైంలో అయితే నాకు కొంచెం బ్యాడయ్యింది. తెలంగాణ ఉద్యమాన్ని అణచడానికి ఆయన ప్రయత్నించిండు. తెలంగాణ కోసం అంటూ చీటికి మాటికి రాజీనామాలు చేసోటోడ్ని. ఇలా రాజీనామా చేసే కరీంనగర్ నుండి ఓసారి చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు జీవన్ రెడ్డి మీద గెలిచా. ఆ ఉపఎన్నికల్లో తలెత్తుకోలేని ఫలితాలొచ్చె. నేను అవమానం దిగమింగుకోలేక ఫాంహౌస్ నుండి బయటకు రాలేకపోతిని. ఇక తెలంగాణ ఉద్యమం అయిపోయింది, ఈ వై.యస్. నా పాలిట సైతాన్‌లా మారిండనుకునే టైంలో నా టైం మారింది. వై.యస్.ను దేవుడు తన దగ్గరకు తీసుకుపోయి రోశయ్యను నా పాలిట దేవుడిలా పంపాడు. రోశయ్య సీఎం అయ్యాక నిరాహారదీక్షకు కూర్చొంటి, పాపం ఆయనకు చేతులెత్తి మొక్కాలే... కేసీఆర్ పోతేపోయాడు. దీక్షను చేస్తే చేసుకోనీ అని ఆయన ఆనాడు ఊర్కొనివుంటే నా బ్రతుకు ఇంకోరకంగా ఉండేది. ఆరోజు ఆయన నిమ్మరసం ఇచ్చి లేపబట్టి నా ప్రాణం నిలిచింది. తెలంగాణ ఉద్యమానికి మళ్లీ ప్రాణం వచ్చింది. లేకుంటే అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాల్లాగా తెలంగాణలో నా బొమ్మలు కూడా ఊరికొకటి లెక్కన ఉండేవి. రోశయ్య కాలంలో ఉద్యమాన్ని ఎగదోసా! ఉద్యమాలలో కూలీ పనులు చేస్తూ కడుపుకు తిండి కోసం కోట్లలో కూలీలు సంపాదించా... కిరణ్ సీఎం అయ్యాక కూడా ఉద్యమాన్ని నడుపుకుంటూ, నేను నా పిల్లలూ దీనిని జీవనోపాధి వృత్తిగా చేసుకుని హాయిగా బ్రతుకుతుంటిమి. ఉద్యమంలో భాగంగా ఎన్నో కారుకూతలు కూస్తిమి, అలా నోట్లోంచి పొరపాటున జారిన ఓ మాటే ఈరోజు నా కొంప ముంచింది. తెలంగాణ ఇస్తే కాంగ్రెస్‌లో టీఆర్ఎస్‌ను విలీనం చేస్తనని నోరుజారాను. కాంగ్రెసోళ్లు దీనిని విని వుండరులే అనుకున్నాను. కాని వాళ్లది పాము చెవులాయ... పసిగట్టిండ్రు. ఇదిగో తెలంగాణ ఇస్తున్నాం... నువ్వు కాంగ్రెస్‌లో పార్టీని విలీనం చెయ్ అంటూ ప్రపోజల్ పెట్టిరి. నా నోరే నాకు చేటు తెచ్చిందనుకున్నా. విలీనం చేయనంటే వాళ్లు వెనక్కి పోతారు... జనం నా మీద ఎక్కుతారు. అందుకే మనసులో బాధున్నా అట్లగే విలీనం చేస్తానని ఒప్పుకున్నా. ఈ తెలంగాణ వచ్చేది లేదు సచ్చేది లేదులే అని నమ్మా. కాంగ్రెస్ తెలంగాణ బిల్లు తెచ్చింది. కొందరు సపోర్ట్ చేస్తామన్నారు. కొన్ని పార్టీలు చేయబోం అన్నవి. తెలంగాణ ఉద్యమనాయకుడిగా నేనూ ట్రై చెయ్యాలి కాబట్టి అన్ని పార్టీల నాయకుల గడపలు తొక్కా. మనసులో ఒకటి పెట్టుకుని పైకి ఇంకోటి నటించా. టీ-బిల్లుకు మద్దతు ఇవ్వండని అన్ని పార్టీల వారిని అడిగా. బిల్లుకు మద్దతిస్తామని ఏ పార్టీ వాళ్లయినా చెప్పినప్పుడు పైకి నవ్వేటోడ్ని, మనసులో మాత్రం తెగ బాధ పడేటోడ్ని. ఈ ఫాల్ట్ బిల్లుకు మద్దతెందుకు పలుకుతార్రా అని తిట్టాలనిపించేటిది. ఎవరన్నా బిల్లుకు మద్దతు ఇవ్వమన్నప్పుడు మాత్రం వాళ్ల ముందు బాధపడుతున్నట్లు నటించేటోడ్ని. మనసు మాత్రం ఖుషీగా ఉండేటిది. చివరకు ఆ బీజేపీవోళ్లు నన్ను ముంచిండ్రు. పార్లమెంటులో బిల్లు ఆగిపోద్దనుకున్నా. బిల్లు ఆగిపోతే వచ్చే ఎన్నికల్లో పది పార్లమెంట్లు దక్కేవి. అసెంబ్లీలో మంచిగా సీట్లొచ్చేవి. కాంగ్రెస్, తెలుగు దేశంల కంటే నా సీట్లే ఎక్కువుండేవి. వచ్చే కేంద్రప్రభుత్వంలో నేను చక్రం తిప్పేటోడ్ని. తెలంగాణ వాళ్లకు కేంద్రంలో మంత్రిపదవులిప్పించుకునేటోడ్ని. తెలంగాణలో నా పార్టీ వుండేది. కేంద్రంలో బీజేపీ వచ్చుంటే నేను తెలంగాణ తెచ్చానన్న పేరుండేది. కాని ఇప్పుడు ఆ పేరు, నా పార్టీ లేకుండా పోతుంది. కాంగ్రెసోళ్లు మా పార్టీని విలీనం చేసుకోవాలంటుండిరి. కాంగ్రెస్‌ను చూస్తుంటే నాకు చిరుచేపలను మింగే సొరచేపలా కనిపిస్తుండె. పార్టీని విలీనం చేస్తే కాంగ్రెస్‌లో నా బ్రతుకేంగావాలా? నా కళ్ల ముందు చిరంజీవి కనబడుతుండె. భగవంతుడా.. పగోడికి కూడా ఈ చావొద్దు.

ఇట్లు...
**మీ కేసీఆర్.**



# రాజధాని రగడ

(మొదటిపేజీ తరువాయి)

నష్టదాయకమే. అందుకే అటవీభూములు, పెద్దఎత్తున ప్రభుత్వ భూములున్న ప్రాంతాన్నే రాజధానికి ఎంపికచేసే అవకాశాలు కనపడుతున్నాయి. ఈ లెక్కన చూస్తే రాజధాని యోగం ప్రకాశం జిల్లాకే వున్నట్లు సమాచారం. ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, దొనకొండ, త్రిపురాంతకంలలో వేలఎకరాల అటవీ భూములున్నాయి. ఈ ప్రాంతం అటు రాయలసీమకు ఇటు దక్షిణకోస్తాతో పాటు విశాఖజిల్లా వరకు అందుబాటులో ఉంటుంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు ఎక్కడ రాజధాని పెట్టినా దూరాభారం తప్పదు. మిగతా 11జిల్లాలకు మాత్రం ఇదే అనువైన ప్రాంతం. రాయలసీమ వాళ్లను కూడా ఇందుకు ఒప్పించవచ్చు. ప్రధానంగా భూములతో సమస్య వుండదు. భూసేకరణకు వేలకోట్లు వ్యయం చేయాల్సిన అవసరం లేదు. రాజధాని కోసం కేంద్రం ఇచ్చే నిధులను నిర్మాణాలకు, మౌళిక సదుపాయాల కోసం వాడుకోవచ్చు. నీళ్ల పరంగా కూడా ఇబ్బంది ఉండదు. శ్రీశైలంతో పాటు వెలిగొండ రిజర్వాయర్ కూడా దగ్గర్లో ఉంది.

అయితే ఈసారి రాజధాని అంటే అన్నీ తీసుకుపోయి అక్కడే పెట్టే పరిస్థితి ఉండదు. హైదరాబాద్ విషయంలో అందరూ అదే పొరపాటు చేసారు. ఇది మా రాజధాని అని సీమాంధ్రులంతా అక్కడే పెట్టుబడులు పెట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నిధులన్నీ అక్కడే కుమ్మరించాయి. అలాకాకుండా హైదరాబాద్‌కు ధీటుగా సీమాంధ్రలోనూ మరో రెండు నగరాలను అభివృద్ధి చేసుంటే ఈరోజు హైదరాబాద్‌ను వదులుకున్నందుకు మనం ఇంతగా బాధపడాల్సివచ్చేది కాదు. ఇప్పుడైనా రాజధానిని కేవలం పరిపాలనకు మాత్రమే పరిమితం చెయ్యాలి. సీమాంధ్రలోని అన్ని ప్రాంతాలను కలిపి కొన్ని జోన్‌లుగా విభజించాలి. కర్నూలు, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నంలను ప్రత్యేక జోన్‌లుగా చేసి ఒక్కో జోన్‌ను ఒక్కో రంగంలో అభివృద్ధి పరచాలి. విద్య, వైద్యం వంటివాటిని అన్ని ప్రాంతాలలోనూ సమంగా అభివృద్ధి చేయాలి.

అన్ని ప్రాంతాలలో అన్ని వసతులు ఉన్నప్పుడు అసలు రాజధాని గురించి సమస్యే ఉండదు.

# జగన్ జపం

(మొదటిపేజీ తరువాయి)

చేయడంతో చంద్రబాబు దెబ్బతిన్నాడు. కాని జగన్ మాత్రం సుష్మాస్వరాజ్ ఫోటోకు దండేసి దండం పెట్టుకోవచ్చు. లోక్‌సభలో ఆమె చేసిన పనితోనే వచ్చే ఎన్నికల్లో నరేంద్ర మోడీకి ఓటేయాలనుకున్నవాళ్లు కూడా ఇప్పుడు ఆ ఆలోచన మానుకుని జగన్ వైపు వచ్చేసారు. నిర్ణయం తీసుకోవడంలో జగన్ కూడా చాలా తెలివిగా వ్యవహరించారు. సీడబ్ల్యూసీలో విభజన నిర్ణయం తీసుకున్నాక జగన్ వెంటనే సమైక్యాంధ్ర స్టాండ్ తీసుకున్నారు. ఇక విభజన ఆగదనే విషయం ఆయనకు అప్పుడే అర్థమైంది. చంద్రబాబు లాగా రెండుకళ్లు పోగొట్టుకోవడం ఎందుకనుకుని సమైక్యాంధ్ర నినాదం ఎత్తుకున్నారు. తెలంగాణలో పార్టీపై ఆశలు వదిలేసుకున్నాడు. కాబట్టే ఈరోజు సీమాంధ్రలో పార్టీ ఎదురులేని స్థాయిలో నిలుపుకున్నాడు.

# తెలంగాణ హీరో

(మొదటిపేజీ తరువాయి)

పేర్చుకుంటూ పోయాడు. ఉద్యమకాలంలో ఎన్నో ఆటుపోట్లు చవిచూసాడు. పలుమార్లు రాజకీయంగా కూడా ఎదురుదెబ్బలు తిన్నాడు. వై.యస్ హయాంలో అయితే ఇక కేసీఆర్ పని అయిపోయినట్లేనన్నారు. వాస్తవానికి వైయస్ ఉండుంటే కేసీఆర్ పరిస్థితి కూడా అదే! కాని వైయస్ మరణంతో కేసీఆర్‌కు ప్రాణం పోసినట్లయ్యింది. వై.యస్ చనిపోయాక కేసీఆర్ ఉద్యమాన్ని ఉధృతస్థాయిలోకి తీసుకెళ్లాడు. కేంద్రం దీనిపై ఆలోచించేలా చేసాడు.

అయితే ఈరోజు తెలంగాణ రావడానికి కేసీఆర్ చేసిన ఉద్యమం కంటే కేసీఆర్ వల్ల వచ్చే రాజకీయ ప్రయోజనాలే ప్రధాన కారణమయ్యాయి. తెలంగాణ వస్తే టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానన్న కేసీఆర్ మాటలను కాంగ్రెస్ అధిష్టానం గట్టిగా పట్టుకుంది. సీమాంధ్రలో జగన్ హవా, తెలంగాణలో టీఆర్ఎస్ జోరుమీద వుండగా, కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి వచ్చింది. సీమాంధ్రలో ఏంచేసినా కాంగ్రెస్ కోలుకునే పరిస్థితి లేదు. కాబట్టి ఒక ప్రాంతంలోనైనా సీట్లను దక్కించుకోవాలనుకుంది. 2014లో రాహుల్‌ను ప్రధానిని చేయాలనుకున్న కల నెరవేరాలంటే ఆంధ్రప్రదేశ్ నుండి కనీస సీట్లు కావాలి. ఏంచేసినా సీమాంధ్రలో సీట్లు రావు కాబట్టి తెలంగాణను లక్ష్యంగా చేసుకున్నారు. టీఆర్ఎస్‌ను విలీనం చేసుకునే ప్రాతిపదికతో కాంగ్రెస్ తెలంగాణను ప్రకటించింది. ఇప్పుడు తెలంగాణ రావడంతో టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయక తప్పడం లేదు. కాంగ్రెస్‌తో పొత్తా... విలీనమా అన్న దిశగా చర్చలు జరుగుతున్నాయి. పార్టీని నిలబెట్టుకుని కేసీఆర్ పొత్తువరకే పరిమితమైతే భవిష్యత్‌లో తన ఉనికిని కాపాడుకోగలడు. టీఆర్ఎస్ పార్టీ రేపు తెలంగాణలో పోటీచేసే అన్ని సీట్లలోనూ నెగ్గగలదు. అప్పుడు కేసీఆర్ సొంత సత్తా కూడా తెలుస్తుంది. అలాకాకుండా కాంగ్రెస్‌లో టీఆర్ఎస్ విలీనమైందా... తెలంగాణ హీరో జీరో అయినట్లే! తెలంగాణ కోసం తన రాజకీయ భవిష్యత్‌ను, బ్రతుకును సోనియాగాంధీకి తాకట్టు పెట్టినట్లే! విలీనమైతే చిరంజీవి లాగా కేసీఆర్ కూడా టెన్‌జనపథ్ ముందు చేతులు కట్టుకుని నిలబడక తప్పదు.

# ఖాళీస్థలాలు

(10వ పేజీ తరువాయి)

చెప్తే అసోసియేషన్‌పై విరుచుపడుతున్న వీరి అజ్ఞానాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదు. మాగుంట వాళ్లు అమ్మేయగా మిగిలినఅనేక ప్లాట్లలో సైతం ఇదే పరిస్థితి. మురుగుగుంటలు, ముళ్లకంపలతో ఈ ప్లాట్లన్నీ మురికిమయంగా దోమల నిలయంగా మారిపోయాయి. ఇప్పటికైనా మాగుంట సంస్థవాళ్లు ఈ విషయాన్ని వారి యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటే ప్రజలు హర్షిస్తారు.

మునిసిపాలిటీ సైతం ఈ విషయాలలో పత్రికా ప్రకటనలకే పరిమితమైపోయింది తప్ప ఎక్కడా చర్యలు చేపట్టలేదు. ఖాళీ స్థలాలలో నీళ్లు నిలచి అపరిశుభ్రతకు కారణం కావడం చట్టరీత్యా ఆ స్థల యజమానులు చేసే నేరం అంటూ కమీషనర్ జాన్‌శ్యాంసన్ వచ్చిన కొత్తల్లో పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి గోళ్లు గిల్లుకుంటున్నాడు తప్ప ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదు.

మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ వారు మట్టితో పూడ్చని ఖాళీస్థలాల యజమానుల వివరాలూ, వారి చిరునామాలూ అతికష్టం మీద సాధించి మునిసిపాలిటీ వారికి అందించినా ఇంత వరకు ఎలాంటి చర్యలూలేవు. ఇప్పటికైనా ఇటు మాగుంటవాళ్లు అటు మునిసిపాలిటీ వాళ్లు స్పందించి తగిన చర్యలు తీసుకుంటే ఇక్కడున్న వాళ్లు రోగాల బారినపడకుండా సంతోషంగా జీవిస్తారు. స్థల యజమానులారా మానవత్వంతో ఆలోచించండి.

# మునిగే పడవే

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకించారు. రాష్ట్రంలో సమస్యలు పరిష్కరించకుండా ఎలా విభజిస్తారంటూ అధిష్టానానికే ఎదురు తిరిగారు. రాష్ట్ర విభజన బిల్లును శాసనసభలో తిరస్కరించి పంపి కేంద్రం నిర్ణయాన్ని ధిక్కరించారు. విభజన బిల్లును నిరసిస్తూ ఢిల్లీలో మూడుగంటల పాటు దీక్ష కూడా చేసారు. సమైక్య ఉద్యమంలో ఏపీ ఎన్జీఓలకు వెన్నుదన్నుగా నిలిచారు. ఇంతవరకు బాగానే వుంది.

కాని కాంగ్రెస్‌కు ఎలాగూ ఇక శత్రువవుతున్నామనుకున్నప్పుడు దానికి వ్యతిరేకంగా ఆయన తీవ్రస్థాయిలో పోరాటం చేసి వుండాల్సింది. ప్రభుత్వంలో కిరణ్‌కు మొదటి నుండి ప్రతికూలంగా మారిన అంశం రాష్ట్ర కేబినెట్‌లో ఎక్కువమంది మంత్రులు ఆయనకు వ్యతిరేకం కావడం. రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచడానికి ఆయన చేసిన ప్రయత్నాలకు సీమాంధ్ర మంత్రులు, సీమాంధ్రకు చెందిన పీసీసీ అధ్యక్షుడే సహకరించలేదు. ఇక సమైక్యాంధ్ర విషయంలోనూ కిరణ్ విలేకరుల సమావేశాలకు పరిమితమయ్యాడు తప్ప బహిరంగ పోరాటం చేయలేదు. ఆయన ఢిల్లీలో అడుగుపెట్టి విభజన బిల్లుకు మద్దతు ఇవ్వొద్దంటూ అన్ని పార్టీల నాయకులను కలిసి కోరితే పరిస్థితి ఇంకో విధంగా వుండేది. కాంగ్రెస్‌పార్టీ ఇబ్బందిలో పడేది. సొంత పార్టీ ముఖ్యమంత్రే కాంగ్రెస్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాడని ప్రతిపక్షాలు ఎండగట్టేవి. విభజనను వ్యతిరేకిస్తూ సీఎం హోదాలో కిరణ్ ఢిల్లీలో నిరహారదీక్షకు కూర్చుని ఉంటే పరిస్థితులు తల్లక్రిందులయ్యేవి. కాంగ్రెస్‌కు ఊపిరాడకుండా వుండేది. ఒకవేళ కాంగ్రెస్ మూర్ఖంగా విభజన బిల్లును పాస్ చేసినా, దీనిని ఆపడానికి అంతకంటే మూర్ఖంగా ప్రయత్నించాడనే పేరు కిరణ్‌కొచ్చేది.

తుఫాన్‌ను అడ్డుకోలేకపోయాను గాని విభజన తుఫాన్‌ను అడ్డుకుంటానన్న ఆయన మాటలు ఎక్కడా ఆచరణ సాధ్యం కాలేదు. కేంద్రం ఏ దశలోనూ బిల్లుకు బ్రేకు వేయకుండా ముందుకు తీసుకుపోయింది. రాష్ట్రశాసనసభ తిరస్కరించిన బిల్లునే పార్లమెంటులో పెడితే సీఎం పదవికి రాజీనామా చేస్తానని కిరణ్ అన్నాడు. కాని లోక్‌సభలో బిల్లు పెట్టాక కూడా ఆయన రాజీనామా చేయలేదు. రాజీనామాకు ముందు ఫైళ్లన్నీ క్లియర్ చేయడం కూడా విమర్శలకు తావిచ్చింది. రాజీనామా ప్రకటన చేసే సమయంలో కూడా సీడబ్ల్యూసీ నిర్ణయమప్పుడే రాజీనామా చేస్తానని అధిష్టానానికి చెప్పానని, కాని అలా చేస్తే ప్రభుత్వానికి సమస్యలు వస్తాయని వద్దని వారించారని, అందుకే ఆ రోజు రాజీనామా చేయలేదన్నాడు. సీఎం రాజీనామా చేస్తే ఇబ్బందులొస్తాయనేది కాంగ్రెస్ అధిష్టానమే చెప్పిందంటే కిరణ్ రాజీనామా చేస్తే ఖచ్చితంగా ఒత్తిడి వచ్చేదే కదా! ఆరోజు ఆయన రాజీనామా అవకాశాన్ని ఉపయోగించుకోలేదు. ఈ రోజు రాజీనామా చేసినా ఉపయోగం లేకుండా పోయింది.

కిరణ్‌ను నమ్ముకుని కాంగ్రెస్‌కు అడ్డం తిరిగిన ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేల పరిస్థితే ఇప్పుడు అగమ్యగోచరంగా వుంది. వైకాపా, తెలుగుదేశంలలోకి వెళ్లలేని వాళ్లు కిరణ్ పెట్టే పార్టీతో నడవాలనుకుంటున్నారు. కిరణ్ పార్టీ పేరే అవతారంగా వుంది. సమైక్యాంధ్ర పార్టీ అంటున్నారు. రాష్ట్రం చీలిపోయాక ఈ పేరు పెట్టుకోవడమెందుకు? ఇక సొంతంగా పార్టీని నడిపే సత్తా కూడా కిరణ్‌కు లేదు. ఆయన పార్టీని నమ్ముడమంటే రంధ్రం పడిన పడవలో సముద్ర ప్రయాణం చేయడమే!

# నారాయణ విద్యార్థుల ప్రతిభ

నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ నిర్వహించిన ఇండియా అనలాగ్ డిజైన్-14 పోటీల్లో విజేతలుగా నిలిచారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి ఫిబ్రవరి 24న ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం నవంబరు నెలలో జరిగిన ఈ పోటీల్లో ఇంజనీరింగ్ విభాగాలైన ఈసీఈ, ఈఈఈ, ఈఐఈలలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొని విశేష ప్రతిభను కనబరిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వర్‌రెడ్డి అభినందించారు.

# ఏకగ్రీవంగా ఆమ్‌ఆద్మీ పీఓసీలు

నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి బొమ్మ వద్ద వున్న ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కార్యాలయంలో ఫిబ్రవరి 24న జరిగిన కార్యవర్గ సమావేశంలో పార్టీ పీఓసీల నియామకం జరిగింది. నెల్లూరు నగరం, గ్రామీణం, కోవూరు, కావలి ప్రాంతాలకు పాయింట్ ఆఫ్ కాంట్రాక్ట్ (పీఓసీ)లను జిల్లా పీఓసీ వై. చిన్నయ్య సభ్యుల సూచనలతో ఏకగ్రీవంగా ఎన్నికచేసారు. మల్లి వెంకటేశ్వర్లు రాయసం వాసుదేవరావు, కొమరిక వెంకటేశ్వర్లు, షేక్ రియాజ్‌లను నెల్లూరు నగర పీఓసీలుగా, పూనమల్లి రామకృష్ణ, కారుమంచి కాంతారావు, గండవరపు చంద్రశేఖర్, బి.సుబ్బారావులను నెల్లూరు గ్రామీణం పీఓసీలుగా, పి.రామ్మోహన్‌రెడ్డిని కోవూరు పీఓసీగా, ఎం.డి.ఇబ్రహీం, షేక్ ఉస్మాన్‌లను కావలి డివిజన్ పీఓసీలుగా నియమించామని ఆయన తెలిపారు.

# "మనసు చిత్రాలు"కు సోమిరెడ్డి జమున స్మారక అవార్డు

2013 సంవత్సరం సోమిరెడ్డి జమున స్మారక నానీల అవార్డును హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ వై.రామకృష్ణారావుకు ప్రదానం చేస్తున్నట్టు అవార్డు వ్యవస్థాపకులైన ప్రముఖ రచయిత్రి డాక్టర్ పెళ్లకూరు జయప్రద తెలిపారు. రామకృష్ణారావు రచించిన "మనసు చిత్రాలు" నానీల సంపుటి అవార్డుకు ఎంపికైనట్టు ఆమె తెలిపారు. 5సంవత్సరాలుగా ఆమె ఈ అవార్డును వివిధ కవులకు ప్రదానం చేసారు. పెరసం ఆధ్వర్యంలో జరుగబోవు సాహిత్య సభలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్టు పెరసం ప్రధాన కార్యదర్శి జి.సుభద్రాదేవి తెలిపారు.

# మత్తు పదార్థాల బారినపడకుండా చేయండి

తెలుగు మహిళా అధ్యక్షురాలు అంచలవాణి తదితరులు ఫిబ్రవరి 26న జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్‌ను కలసి యువత, విద్యార్థులకు మత్తుపదార్థాల సరఫరాపై ఆందోళన వ్యక్తం చేసారు. నెల్లూరుజిల్లాలో జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధితో దేశం నలుమూలల నుంచి ఉద్యోగార్థం వస్తున్న యువకులను, విద్యార్థులను ఆకర్షిస్తూ గంజాయి తదితర మత్తు పదార్థాలను వారికి అలవాటు చేస్తున్నారని దీనికి పాల్పడుతున్న మాఫియాను అరికట్టాలని వారు ఎస్పీని కోరారు.

# రెండు కుటుంబాలు

(3వ పేజీ తరువాయి)

గౌతం రాకతో మేకపాటి కుటుంబం నుండి జిల్లాలో ముగ్గురు అభ్యర్థులు రంగంలో దిగబోతున్నట్లు అర్థమైపోయింది.

జిల్లాలో మొత్తం 11నియోజకవర్గాలు వున్నాయి. వీటిలో 10అసెంబ్లీ 1పార్లమెంటు. 10అసెంబ్లీలలో 2 రిజర్వు నియోజకవర్గాలుకాగా మిగిలినవి 8. మొత్తం మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, తెలుగుదేశం, వై.యస్.ఆర్.సి.పి.ల నుండి 33మంది అభ్యర్థులు బరిలో దిగుతుండగా వీరిలో 6లేదా 7మంది ఆ రెండు కుటుంబాల వారే కావడం గమనార్హం. జిల్లా రాజకీయాలలో తామే చక్రం తిప్పాలనుకుంటున్న వీరి పోకడ సామాన్య ప్రజలకు ఏ మాత్రం వీళ్ళ ఉపయోగపడగలరన్న అనుమానం ప్రజల్లో కలుగుతుంది. వాళ్లేవరో ఊళ్ళు పంచుకుంటున్నట్లుగా జిల్లా రాజకీయాలని ఈ కుటుంబాల వాళ్ళు పంచుకోవడం ఏ మాత్రం "రాజనీతో" వాళ్ళే ఆలోచించుకోవాలని ఓటరు మహాశయులు చర్చించుకుంటున్నారు. రాజకీయమా వర్ధిల్లు.

# 'రాష్ట్ర'పతి

(మొదటిపేజీ తరువాయి)

కాపు వర్గానికి సీఎం కుర్చీ ఇస్తే అరకొర మిగిలిన రెడ్లు కూడా పార్టీకి దూరమయ్యే అవకాశముంది. దీనిబదులు రేపటి ఎన్నికల్లో చిరంజీవికి సీమాంధ్రలో ప్రచారబాధ్యతలు అప్పగిస్తే మేలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. కాబట్టి కిరణ్ తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ఇక సీఎం లేనట్లే.

సమైక్యరాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రి కిరణే కాబోతున్నాడు.

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. ఆత్మీయుల నుండి సమాచారాలు ఉపశమనం కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలలో బాగా పోటీ ఉంటుంది. ఆర్థికంగా స్వల్ప పెరుగుదల ఉంటుంది. ఖర్చులు కొద్దిగా పెరిగినా ఇబ్బంది ఉండదు. ఉద్యోగులకు అధికారుల నుండి, పబ్లిక్ నుండి వత్తిడి, ఇబ్బందులుంటాయి. యజమానులకు పనివాళ్ళతో పేచీలు కలగవచ్చును.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

విద్యార్థులకు మంచి ప్రగతి, శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. ఆదాయం బాగుంటుంది. వృత్తి పరంగా అవకాశాలు పెరుగుదల ఉంటుంది. వృత్తిలో క్రొత్త అనుభవాలు చవిచూస్తారు. క్రొత్త వస్తువులు కొనడం, స్థిరాస్తుల సమకూర్చుకొనే ప్రయత్నాలు సాగుతాయి. ఇతరుల వల్ల ఆటంకాలు ఏర్పడినా చేపట్టిన పనులు నెరవేరుతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వివాహాది శుభకార్య తేదీలు నిర్ణయించగలరు. వారాంతంలో కొద్దిగా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార రంగంలో పుంజుకొని, ఆదాయము పెంచుకుంటారు. వృత్తి జీవనము కలవారు జాగ్రత్తలు తీసుకొనాలి. స్థిరాస్తులు ఏర్పరచుకొనే ప్రయత్నాలు సాగుతాయి. పెట్టుబడి రంగాలలో లాభాలుంటాయి. కోర్టు వ్యవహారాలందు అనుకూలత ఉంటుంది. ఋణాలు మంజూరు కాగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష 1,2 పాదాలు

వ్యాపార వర్గాలలో ఆదాయం బాగుండుట, భూములు స్థలాలు గృహాలు వంటివి కొనుగోలుకై ఒప్పందాలు జరుగగలవు. వృత్తి నిర్వహణలో గుర్తింపు, ఆదాయం పెరుగుతుంది. చెల్లింపులు సకాలంలో ఉంటాయి. చేపట్టిన పనులలో వత్తిడి ఉంటుంది. షేర్ మార్కెట్ స్వల్ప లాభాలలో ఉంటుంది. అవగాహన సరిగా ఉండక కుటుంబంలో విభేదాలు రావచ్చును.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 28.02.2014 నుండి తేది. 06.03.2014 వరకు

ఈ వారం మేషంలో కేతువు, మిథునంలో గురువు, తులలో శని కుజ రాహువులు, మకరంలో బుధ శుక్రులు, కుంభంలో రవి, కుంభ మీన మేష రాశులలో చంద్రుడు సంచరిస్తాడు.

### ముహూర్తములు

ముహూర్తాలు లేవు.

### మాఘమాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 28 | శుక్ర | చతుర్దశి | సా॥గం.04.36వ॥ |
| తేది. 01 | శని | అమావాస్య | ప॥గం02.25వ॥ |

### ఫాల్గుణ మాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 02 | ఆది | పాడ్యమి | ప॥గం.12.26వ॥ |
| తేది. 03 | సోమ | విదియ | ఉ॥గం.10.40వ॥ |
| తేది. 04 | మంగళ | తదియ | ఉ॥గం.09.27వ॥ |
| తేది. 05 | బుధ | చతుర్థి | ఉ॥గం.08.33వ॥ |
| తేది. 06 | గురు | పంచమి | ఉ॥గం.08.10వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

తొందరపాటు ప్రవర్తన ఉండి మరలా పశ్చాత్తాపం ప్రకటిస్తారు. చెల్లింపులు సక్రమంగా జరుపుతారు. ప్రభుత్వపరంగా అనుమతులు, వ్యవహారాల కారణంగా అధికారుల మందలింపులు ఉంటాయి. అనుకున్న పనులు సరిగా జరుగక టెన్షన్, శ్రమపడటం జరుగుతుంది. వృత్తి జీవనం కలవారికి అవకాశాలు గుర్తింపు బాగుంటుంది. ఉద్యోగ బాధ్యతలు పెరుగుతాయి.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కోర్టు కేసులు వాయిదా పడవచ్చును. వ్యాపార అవకాశాలు చేజారిపోవచ్చును. వృత్తి వ్యాపారాలలో బాగా శ్రమించినా ఆదాయము సంతృప్తికరంగా ఉండదు. క్రయవిక్రయాలలోను, క్రొత్త కాంట్రాక్టులలోను, క్రొత్త కాంట్రాక్టులందు తొందరపడి నిర్ణయాలు తీసుకొనవద్దు. సొంత వ్యవహారాలు ఓపికగా ఆలోచించండి. హామీలు, అప్పులు ఇవ్వకండి. విద్యా ప్రగతి బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి నిర్వహణలో సామర్థ్యం చూపి ఆకట్టుకుంటారు. షేర్ల పై లాభాలు ఆశించిన రీతిలో ఉండవు. శుభకార్య ప్రయత్నాలలో కొద్ది ఆటంకాలుంటాయి. వ్యాపార రంగంలో పెరుగుదలకు అవకాశాలు, ఆదాయ వృద్ధి ఉంటుంది. అనుకోని ఖర్చులు పైనబడినా సర్దుబాటు కాగలవు. ఆస్తి వ్యవహారాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఇతరులపై వ్యాఖ్యలు మానుకొనండి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి పరంగా వచ్చిన సమస్యలను అధిగమించగలరు. నిరుద్యోగులకు అవకాశాలు లభించగలవు. తీసుకొనే నిర్ణయాలు, చేసే పనులందు తొందరపాటు ఉంటుంది. వ్యాపారములందు అభివృద్ధి, ఆదాయము పెరగడం ఉంటుంది. స్టాక్ మార్కెట్ రంగాలలో నష్టాలుండవచ్చును. ప్రభుత్వ పరంగా అనుమతులు మంజూరు కాగలవు. అదనపు బాధ్యతలు పైనబడగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

క్రొత్త ఆర్థిక ప్రయత్నాలలో నిరుత్సాహం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఆదాయం ఉండదు. ఖర్చులు పెట్టవలసిన పనులు త్వరితంగా సాగుతాయి. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తగా మెలగాలి. అదనపు పనిభారం పైనబడుతుంది. చేపట్టిన పనులకు ఆటంకాలు రావడం వల్ల కష్టపడతారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంక్ ఋణాలలో ఆలస్యం ఉంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కోర్టు వ్యవహారాలు వాయిదా పడవచ్చును. చేపట్టిన పనులు మార్పులు చేర్పులతో సాగగలవు. స్థిరాస్తుల మీద, షేర్ల మీద స్వల్ప లాభాలుండగలవు. వృత్తి పరంగా ఇబ్బందులుండి సామాన్య ఆదాయముంటుంది. వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు చేజారిపోగలవు. అవసరాలకు ఋణాలు చేయవలసి రావచ్చును. స్థిరాస్తుల లావాదేవీలందు జాగ్రత్త అవసరం. ఉద్యోగులపై పనిభారం ఉంటుంది. అనుకోని దూర ప్రయాణాలుంటాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

చేపట్టిన పనులపై శ్రద్ధ తగ్గుతుంది. షేర్లు పెట్టుబడులపై లాభాలు స్వల్పముగా ఉంటాయి. ఆదాయం సంతృప్తికరంగా ఉండినా అనుకోని అదనపు ఖర్చులుంటాయి. స్థాన మార్పుల కై ప్రయత్నాలు కొంత చర్చలు జరుగుతాయి. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. గృహ వాహన రిపేర్లుంటాయి. క్రయవిక్రయాలు మందకొడిగా సాగుతాయి. శుభకార్యములందు ఇబ్బందులు పడతారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు జరగడానికి డబ్బు ఖర్చు పెట్టగలరు. ఉద్యోగులు సమర్థవంతంగా పనులు చేయడం, అధికారులతో చేరువకావడం జరుగుతుంది. వృత్తి పరంగా గుర్తింపు బాగుంటుంది. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు విషయాలలో జాగ్రత్త అవసరం. కుటుంబ వ్యక్తుల సహకారం బాగుంటుంది. దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. అధికార ప్రయాణాలుంటాయి.

# రెండు దెయ్యాలు మనపై కక్షకట్టాయి



కార్యవర్గ సమావేశంలో ప్రసంగిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

సోనియాగాంధీ, సుష్మాస్వరాజ్ అనే రెండు దెయ్యాల మూలంగానే రాష్ట్రం చీలిపోయి తెలుగుజాతి హృదయం ముక్కలైందని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఫిబ్రవరి 23వ తేదీ నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడుతూ కేవలం 23 నిముషాల వ్యవధిలో ఈ రెండు దెయ్యాలు లోక్‌సభ తలుపులు మూసేసి, లోక్‌సభ టీవీ ప్రత్యక్ష ప్రసారాలను ఆపేసి చీకట్లో చీకటి ఒప్పందం చేసుకుని తెలుగుజాతి మధ్య చిచ్చు పెట్టాయన్నారు. 2004లో సోనియాగాంధీని ప్రధానిని చేస్తే తాను గుండు గీయించుకుంటానన్న సుష్మాస్వరాజ్‌కు ఈరోజు అదే సోనియా పెద్దమ్మలా ఎలా గోచరించిందని ప్రశ్నించారు. వీళ్లిద్దరూ పెద్దమ్మా, చిన్నమ్మలు కాదని దేశానికి, తెలుగుజాతికి పట్టిన దరిద్రాలన్నారు. సీమాంధ్రకు ప్రత్యేక ప్రతిపత్తి ఐదేళ్లు చాలదని, కనీసం పదేళ్లయినా ఉండాలని ఆయన డిమాండ్ చేసారు. విభజనతో నష్టపోయిన సీమాంధ్రను పునర్నిర్మించి, దేశంలోనే ఈ రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలపగలిగిన నాయకుడు చంద్రబాబునాయుడేనన్నారు.

జిల్లా పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర మాట్లాడుతూ రానున్న ఎన్నికల కోసం చంద్రబాబునాయుడు రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల ముందుకు తీసుకెళ్లాలన్నారు. పార్టీ పథకాలయిన రైతులకు 9గంటల ఉచిత విద్యుత్, ఋణమాఫీ, డ్వాక్రా ఋణాల మాఫీ, విద్యార్థులకు మేలైన ఫీజురీయంబర్స్‌మెంట్, మహిళలకు ప్రత్యేక పథకాలు, నిరుద్యోగులకు 2వేల రూపాయల భృతి వంటివాటిపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, బల్లి దుర్గాప్రసాద్, పరసారత్నం, బీద మస్తాన్‌రావు, నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టి.రమేష్‌రెడ్డి, పి.అరుణ, కిలారి వెంకటస్వామినాయుడు, నూనె మల్లిఖార్జునయాదవ్, చేవూరు విజయమోహన్‌రెడ్డి, అన్నం దయాకర్‌గౌడ్, ఒట్టూరు సంపత్‌రాజు, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, జి.వి.ఎన్.శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ నేతాజీలో ఘనంగా సైన్స్ ఎక్స్‌పో!

కీర్తి మెమోరియల్ డే సందర్భంగా సైన్స్, మ్యాథ్స్ ఎక్స్‌పో–2014ను నెల్లూరు విజయమహల్‌గేటు దగ్గర శ్రీనివాస అగ్రహారం లోని శ్రీ నేతాజీ ఫైలెట్ హైస్కూలు ప్రాంగణంలో ఫిబ్రవరి 25న నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ యం.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న మేధస్సును వెలికితీసి వారి ఆలోచనలకు పదును పెట్టి సృజనాత్మకంగా తమ యొక్క ప్రతిభాపాటవాలను ప్రదర్శించుటకు ఈ ఎక్స్‌పో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ ఎక్స్‌పోలో ప్లేక్లాసు నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు దాదాపు 500 ప్రదర్శనలు వుంచారని తెలిపారు. వాటిలో రాకెట్ మోడల్, ఓజోన్‌పొర, అంతరిక్షంలో మానవుడు, ఆటోమేటిక్ రైల్వేగేట్స్, హార్వెస్టింగ్ ఆఫ్ రైన్‌వాటర్, రక్తము గ్రూపును కనుగొనుట, కూరగాయల నుండి విద్యుదుత్పత్తి, డైనమో, గ్యాస్ వెల్డింగ్ ఫన్‌విల్ లాంగ్వేజ్, ట్రైఫర్ లక్, రియోస్టాట్‌విత్ లైట్, పట్టుపురుగుల పెంపకం తదితర ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభను చాటాయి.



ఎక్స్‌పోలో చిన్నారుల ప్రదర్శనలు

ఈ కార్యక్రమానికి గూడూరులోని ప్రాస్పర్ హైస్కూలు కరస్పాండెంట్ దశరథరామిరెడ్డి, బుచ్చిరెడ్డిపాళెంలోని గోపాలకృష్ణ స్కూలు కరస్పాండెంట్ ఎన్.శ్రీధర్, సంగంలోని వికాస్‌స్కూలు కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి, ఆత్మకూరులోని చైతన్య హైస్కూలు కరస్పాండెంట్ ఇ.భాస్కర్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొనగా పాఠశాల డైరెక్టర్ నరేంద్రరెడ్డి, హెడ్‌మిస్ట్రెస్ ఎన్.ప్రసన్న, వైస్ ప్రిన్సిపల్ డి.వాణి, హెడ్మాస్టర్ వి.సుధాకర్‌రావులు పర్యవేక్షించారు.

# తీరంలో మృత తాబేళ్లు



ఒడ్డుకు కొట్టుకొచ్చిన మృతతాబేళ్లు

ఫిబ్రవరి 23వతేదీన జిల్లాలోని ఇందుకూరుపేట మండలంలోని సముద్రతీర ప్రాంతంలో వందలాది తాబేళ్లు మృత్యువాత పడి ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. ఒకేసారి ఇన్ని తాబేళ్లు మృతి చెంది ఉండడం చూసి మత్స్యకారులు సైతం ఆవేదన చెందారు. ప్రస్తుతం ఇది తాబేళ్ళ గుడ్లుపెట్టే సీజన్. ఎప్పుడన్నా ఒకటి అరా తాబేళ్లు చచ్చిపోయి ఒడ్డుకు కొట్టుకురావడం సాధారణమే. కాని ఇంత భారీసంఖ్యలో తాబేళ్లు చనిపోవడానికి మరబోట్లే కారణమంటున్నారు. ఈ సంఘటన జరగడానికి ముందు 50 నుండి 60 మరబోట్లు వరకు సముద్రంలో వేట సాగించాయి. మరబోట్లకు వున్న వలలు తగిలే ఇన్ని తాబేళ్లు చనిపోయి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం నుండి విడవలూరు మండలంలోని రామతీర్థం వరకు తీరంలో 800 తాబేళ్ల మృతదేహాలు కనిపించాయి.

# రైతుకూలీ సంఘం నాయకుడి హత్య

సైదాపురం మండలం రైతుకూలీ సంఘం అధ్యక్షుడు దోంతగిరి రంగయ్య (50) అనుమానాస్పద స్థితిలో మరణించారు. కలిచేడు గ్రామం వద్ద మైకా గని సమీపంలో తూము కల్వర్టర్ వద్ద ఆయన మృతదేహాన్ని కనుగొన్నారు. తుమ్మల తలుపూరు కనకదుర్గ గిరిజన కాలనీకి చెందిన రంగయ్య రైతుకూలీ సంఘానికి నాయకులుగా ఉంటూ అనేక పోరాటాలు చేసారు. ప్రత్యర్థులు అతనిని హత్యచేసి అక్కడ పడేసి పోయారని అనుమానిస్తున్నారు.

# కళ్యాణ వైభవం...!



మాడరన్ స్టోర్స్ అధినేత దొంతంశెట్టి నరసింహరావు - పద్మావతిల మనుమరాలు, దుగ్గిశెట్టి జయచంద్ర - వాణిల కుమార్తె **ధ్యానిత - రాకేష్** (బెంగుళూరు వాస్తవ్యులు రాచపల్లి ఆనందరామయ్యశెట్టి - కమలల కుమారుడు)ల కల్యాణం ఫిబ్రవరి 24వ తేదీ బెంగుళూరులోను, రిసెప్షన్ వేడుకలు నెల్లూరులోని అచ్యుత సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ యారం వెంకటరమణయ్య - విజయలక్ష్మిల కుమార్తె **డా॥ వెంకట సంధ్య - డా॥ శ్రీధర్** (విజయవాడ సూర్యారావుపేట వాస్తవ్యులు మేడసాని బాలచెన్నయ్య - రంగకుమారిల కుమారుడు)ల వివాహం ఫిబ్రవరి 20వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.

# ఆల్తూరుకు ఆత్మీయుల అభినందన



శ్రీశైల దేవస్థానం ఛైర్మెన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి తొలిసారిగా నెల్లూరుకు విచ్చేసిన ఆధ్యాత్మికవేత్త ఆల్తూరు ఆదినారాయణరెడ్డిని ఫిబ్రవరి 26వతేదీ బుధవారంనాడు పలువురు ఆత్మీయులు కలసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆల్తూరు ఆదినారాయణరెడ్డి శ్రీమతి సులోచనమ్మ ఆయన కుమారుడు గిరీష్‌రెడ్డితో పాటు పలువురు ఆప్తులు బంధుమిత్రులు పాల్గొని ఆదినారాయణరెడ్డిని పూలమాలలతో సత్కరించారు.

నెల్లూరు మూలాపేటలో వున్న శ్రీ మూలస్థానేశ్వర ఆలయానికి(శివాలయం) గిరీష్‌రెడ్డి ఛైర్మెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండగా ఇప్పుడు ఆదినారాయణరెడ్డి శ్రీశైలం దేవస్థానానికి ఛైర్మెన్‌కావడం వారి ఆప్తులను ఆనందపరచింది. తండ్రితనములకు మరోసారి "లాయర్" అభినందనలు.

# వైభవంగా డికెడబ్ల్యూ కళాశాల స్వర్ణోత్సవాలు

నెల్లూరు దర్గామిట్టలోని డికెడబ్ల్యూ కళాశాల యాభై ఏళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా ఫిబ్రవరి 23, 24తేదీల్లో స్వర్ణోత్సవాలు శోభాయామానంగా జరిగాయి. ఈ వేడుకల్లో కళాశాల పూర్వ విద్యార్థులైన విశ్రాంత హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ కె.మస్తానమ్మ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అరుణకుమారి, ప్రముఖ పారిశ్రామికవేత్త సోదరి శశికళ, గూడూరు మున్సిపల్ మాజీ ఛైర్మెన్ కోడూరు కల్పలత, నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి సతీమణి హిమవతి, వి.ఆర్.కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక తదితరులు పాల్గొని కళాశాలలో తమ విద్యాభ్యాసం అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకొని సంభ్రమాశ్చర్యాలకు లోనుచేసారు. ఇప్పటి తమ ఉన్నత స్థానానికి ఆనాటి అధ్యాపకుల బోధన, తాము వారి సూచనలను అనుసరించి సాగించిన విద్యాభ్యాసం, క్రమశిక్షణే కారణమని తెలిపారు. మొదటిరోజు విద్యార్థినులు కళాశాల వైభవాన్ని తెలియజేసే విధంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ముగింపు సభలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య జి.రాజారామిరెడ్డి, నగరశాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 9న

# సినారా 'గుండెదీపం' ఆవిష్కరణ




నెల్లూరు టౌనుహాలులో మార్చి 9న కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కీర్తిపురస్కారగ్రహీత, సుప్రసిద్ధకవి చిన్ని నారాయణరావు రచించిన కవితాసంపుటి "గుండె దీపం" ఆవిష్కరణోత్సవం జరుగుతుందని కళాంజలి అనంత్ తెలిపారు. సినీరచయిత, నెల్లూరీయులు వెన్నెలకంటి అధ్యక్షతలో 'లాయర్' సంగ్రాహకులు శివప్రభాత్‌రెడ్డి జ్యోతి ప్రకాశనంతో జరగనున్న సభలో విశిష్ట అతిథిగా ప్రముఖ సినీ రచయిత, దర్శకులు జె.కె.భారవి, ముఖ్య అతిథిగా ప్రముఖ సినీగేయరచయిత చంద్రబోస్‌లు పాల్గొంటుండగా కావలి నియోజకవర్గ శాసనసభ్యులు బీద మస్తాన్‌రావు "గుండెదీపం"ను ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. సభకు ముందుగా అనంత్ లౌలీఈవెంట్స్ ఆధ్వర్యంలో సుగంధిని, అనూష, హంసిని, రంజని, జ్ఞానశ్రీ, శ్వేత, తేజస్విలచే సినీసంగీతవిభావరి వుంటుందని తెలిపారు.

# రెండుకళ్ల సిద్ధాంతం.. రెండు ప్రాంతాల్లో నష్టం

**రెండు పడవలపై కాళ్లు పెట్టొద్దని పెద్దోళ్లెందుకు చెబుతుంటారో తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఇప్పుడర్థమై ఉండాలి. రెండు పడవల మీద కాళ్లు పెడితే వాటి పాటికవి వెళ్ళిపోతాయి... మధ్యలో మునిగిపోయేది మనమే.**

రాష్ట్ర విభజన విషయంలో రెండుకళ్ల సిద్ధాంతాన్ని నమ్ముకున్న చంద్రబాబు పరిస్థితి ఇలాగే మారింది. రాష్ట్ర విభజనతో రెండింటికి చెడిన రేవడి అయ్యాడు. అటు తెలంగాణలోనూ, ఇటు సీమాంధ్రలోనూ ఎక్కడా పార్టీని గట్టిగా నిలుపుకో లేకపోయాడు. ఇరుప్రాంతాలకు సమన్యాయం అంటూ చివరకు అన్యాయమై పోయాడు. రాష్ట్రాన్ని విడదీస్తే టెంకాయ కొడితే రెండు కొబ్బరిచిప్పలు సమంగా వచ్చినట్లుండాలన్నాడు. చివరకు చూస్తే ఆయన బొక్క పగిలినట్లయ్యింది.

వాస్తవానికి తెలంగాణకు మేము అనుకూలమంటూ చంద్రబాబు ఇచ్చిన లేఖతోనే విభజనకు పునాదిపడింది. కేంద్రం వివాదాలు రాకుండా సమస్యలు పరిష్కరించి విభజన పూర్తి చేసి వుంటే ఇరుప్రాంతాలలోనూ తెలుగుదేశంపార్టీ కొంత బలపడేది. కాని కేంద్రం తెలంగాణ పట్ల పక్షపాతం చూపిస్తూ ఏకపక్ష విభజనకు పూనుకోవడంతో చంద్రబాబుకు దిమ్మతిరిగింది. కేంద్రం ఈ విభజనకు చంద్రబాబు ఇచ్చిన లేఖను సాకుగా చూపించడంతో ఆయనకు మింగుడుపడని పరిస్థితి వచ్చింది. ఈ ఏకపక్ష విభజనను పూర్తిగా వ్యతిరేకించలేకపోయాడు. అలాగని సమర్థించలేక పోయాడు. సమన్యాయం చేయండంటూ ఢిల్లీ చుట్టూ తిరిగాడు. వివిధ పార్టీల నాయకులను కలిసాడు. ఈ అన్యాయపు విభజనను అడ్డుకోండని కోరాడు. ముఖ్యంగా బీజేపీపై ఆయన కొండంత ఆశలు పెట్టుకున్నాడు. సీమాంధ్రుల సమస్యలు పరిష్కరించందే టీ-బిల్లును ఆమోదించేది లేదంటూ కమలనాధులు చేసిన ప్రకటనలను గట్టిగా, గుడ్డిగా నమ్మాడు. టీ-బిల్లుపై బీజేపీ గట్టిగా నిలబడేలా చేసేందుకు అద్వానీ, రాజ్‌నాథ్‌సింగ్, నరేంద్ర మోడీల చుట్టూ చక్కర్లు కొట్టాడు. మోడీ ఏ రాష్ట్రంలో వుంటే ఆ రాష్ట్రానికి పరుగులు తీసాడు. బీజేపీ అభ్యంతరాలతో బిల్లు ఆగిపోయినా లేదా బీజేపీ సూచించిన సవరణలను బిల్లులో చేర్చినా ఈ ఘనత తమదేనంటూ సీమాంధ్రకు న్యాయం చేసామంటూ బీజేపీతో జతకట్టి ప్రచారం చేసుకోవాలనుకున్నాడు. బీజేపీ సవరణలకు పట్టుబట్టి, వాటిని ఆమోదింపజేసి ఉంటే టీడీపీకి ఇరు ప్రాంతాలలోనూ కొంచెం మెరుగైన పరిస్థితి ఉండేది. రెండుచోట్లా బీజేపీతో పొత్తు పెట్టుకుని నరేంద్రమోడీ అనుకూల ఓటుతో లబ్ది పొందాలని చంద్రబాబు భావించారు. ఈ విధంగా జరిగి ఉంటే బీజేపీ - టీడీపీ పొత్తు కొంతవరకు మంచి ఫలితాలనే ఇచ్చి వుండేది. కాని ఇప్పుడు బీజేపీ చేసిన పనితో చంద్రబాబుకు ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి. పూర్తిగా టీ-బిల్లుకు అనుకూలంగా మాట్లాడలేక పోయాడు కాబట్టి అక్కడా పరిస్థితి అనుకూలంగా లేదు. విభజనకు లేఖ ఇవ్వడంతో పాటు సమన్యాయం చేయలేకపోయాడు కాబట్టి సీమాంధ్ర ప్రజలు గుర్రుగా వున్నారు. ఈ సమయంలో బీజేపీతో పొత్తు పెట్టుకుంటే సీమాంధ్రలో ఇంకా డేంజర్! బీజేపీ మీద వున్న కసిని ప్రజలు ఆయన మీద కూడా చూపిస్తారు. మొత్తానికి ఈ రాష్ట్ర విభజన ఎపిసోడ్‌లో రెండు ప్రాంతాలలోనూ పార్టీని కాపాడుకోవాలనే తపనతో రెండుకళ్ల సిద్ధాంతాన్ని అనుసరించి తన వేళ్లతో తన కళ్లను పొడుచుకున్న చంద్రబాబు నాయుడే అత్యుత్తమ అమాయకుడు.



# ఉద్వేగం చల్లారింది

## సీమాంధ్ర పౌరుషం ఇదేనా?

గత ఆరు నెలలుగా సీమాంధ్రలో ఎటువంటి ఉద్వేగ పరిస్థితులున్నాయి. ఎంతటి ఆందోళనలు నెలకొన్నాయి. రాష్ట్రాన్ని విభజించాలంటూ సీడబ్ల్యూసీలో నిర్ణయం తీసుకున్న వెంటనే సీమాంధ్ర భగ్గుమంది. సీమాంధ్రలోని 13జిల్లాల్లో ఆందోళనలు ఎగిసిపడ్డాయి. సోనియాగాంధీ నిర్ణయం తీసుకోవడంతో నెహ్రూ, ఇందిరా, రాజీవ్‌గాంధీల విగ్రహాలను ఎక్కడపడితే అక్కడ కూల్చేసారు, కాల్చేసారు. ప్రభుత్వ కార్యాలయాలను ధ్వంసం చేసారు. రోడ్లమీద మంటలు పెట్టారు. కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మలు తగలబెట్టారు. సోనియాగాంధీకి కృత్రిమ సమాధాలు కట్టారు. సీమాంధ్ర కేంద్రమంత్రులు, ఎంపీల బొమ్మలకు పాడెలు కట్టి శవయాత్రలు నిర్వహించారు. రెండు నెలలపాటు సీమాంధ్ర రోడ్ల మీద ఆర్టీసీ బస్సులే తిరగలేదు. రెండు నెలలు ప్రభుత్వ కార్యాలయాలే పనిచేయలేదు. రెండు నెలలు విద్యార్థుల చదువులే సాగలేదు. సమైక్యాంధ్ర ఉద్యమంలో ప్రతి ఒక్కరూ ఎంతోకొంత ఇబ్బందిపడ్డారు. సమైక్యాంధ్రకు మద్దతు పలకని నాయకులపై ఆందోళనకారులు రాళ్లదాడులు నిర్వహించారు. కాంగ్రెస్ అధిష్టానానికి తొత్తులుగా వ్యవహరించిన ఎంపీలైతే సీమాంధ్రలో అడుగుపెట్టడానికి భయపడ్డారు. విజయనగరంలో సమైక్యవాదులైతే పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణకు సినిమా చూపించారు. వరుసగా రెండురోజుల పాటు ఆయనకు సంబంధించిన ఆస్తులపై ఆగకుండా దాడులు నిర్వహించారు. జనాలు పనులు మానుకుని ఎంతో కసితో ఆందోళనలు నిర్వహించారు. రెండు నెలల పాటు నిర్విరామంగా ఉద్యమం జరగడమంటే ఆషామాషీ కాదు. కాని తొలిసారిగా సీమాంధ్రలో భారీస్థాయిలో ఉద్యమాలు జరిగాయి. పార్లమెంటులో విభజన బిల్లును పెట్టేరోజైతే సమైక్యవాదుల్లో బి.పి ప్రమాదకర స్థాయికి పోయింది. పార్లమెంటులో విభజన బిల్లు ఏమవుతుందోనని ఊపిరిబిగపట్టి చూసారు. కాని బిల్లు ఆమోదం పొందడంతో సీమాంధ్రులు నిరుత్సాహపడిపోయారు. వాస్తవంగా బిల్లు ఆమోదం పొందాక ఆందోళనలు పెరిగి ఉండాలి. కాని ఇక్కడ ఉద్యమం చప్పున చల్లారింది. ఇప్పుడు ఎవరు కూడా ఈ అంశం మీద వేడిగా లేరు. విభజన ప్రక్రియలో పాలుపంచుకున్న కేంద్రమంత్రులు యధేచ్ఛగా సీమాంధ్ర జిల్లాలకు వచ్చిపోతున్నారు. సీమాంధ్ర కేంద్రమంత్రి అయ్యుండి విభజనకు మద్దతుపలికిన పనబాక లక్ష్మి మొన్ననే గూడూరు వచ్చిపోయింది. ఒక్కరు కూడా నిరసన వ్యక్తం చేయలేదు. సీమాంధ్రలో పరిస్థితిని అంచనా వేసేనేమో కేంద్రం చాలా తేలిగ్గా విభజన నిర్ణయం తీసుకోగలిగింది.



# గూడూరు డివిజన్ వార్తలు

## గ్యాస్ దీపాలు వెలిగించింది కాంగ్రెస్సే!



వికలాంగులకు వీల్‌చైర్‌లు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య

గూడూరు ఐసీఎస్ రోడ్డులోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో 22వ తేదీ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న మహిళలకు గ్యాస్ కనెక్షన్లను కేంద్ర పెట్రోలియం, జౌళిశాఖ సహాయమంత్రి పనబాక లక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కువ గ్యాస్ కనెక్షన్లు మహిళలకు ఇచ్చామన్నారు. తాను గెలుపొందిన బాపట్ల నియోజకవర్గానికి అయిదు వేల కనెక్షన్లు మంజూరు చేయగా గూడూరు నియోజకవర్గంలో నిరుపేద మహిళలకు ఆరువేల కనెక్షన్లు వచ్చాయన్నారు. వీటిని త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా మంజూరు చేసిన 300 కనెక్షన్లను ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత్ పెట్రోలియం రాష్ట్ర సమన్వయకర్త భాస్కర్ రావు. హెచ్‌పీసీఎల్ అధికారులు, ఆర్డీవో మధుసూదనరావు, గూడూరు కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పనబాక కృష్ణయ్య ఎన్‌డీసీసీ ఉపాధ్యక్షుడు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, కె.మునిగిరిష్, బాబురెడ్డి వై.హరి బాబుయాదవ్, మనుబోలు ప్రసాద్‌రెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు. కాగా ముందుగా డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో రోటరీక్లబ్ వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డిఎన్‌జేసీ సౌజన్యంతో వికలాంగులకు పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ లబ్ధిదారులకు పంపిణీ చేసిన పరికరాలను వినియోగించుకోవాలే కానీ విక్రయించకూడదని చెప్పారు. రాష్ట్రంలోనే ఇంత భారీ ఎత్తున పరికరాలను పంపిణీచేయడం ఇదే ప్రథమమన్నారు. అనంతరం 16లక్షలు విలువైన ట్రైసైకిళ్ళు, హియరింగ్ ఎయిడ్స్, క్రచ్చర్స్, హ్యాండ్ స్టిక్స్‌లు సుమారు 350మందికి పంపిణీ చేశారు.

## బకాయిలు వెంటనే చెల్లించాలి

### మున్సిపల్ కమీషనర్ సుశీలమ్మ



గూడూరు పట్టణంలోని వారు ఇంటి, తాగునీటి పన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని పురపాలక సంఘ కమీషనర్ జి.సుశీలమ్మ ఇటీవల ఒక ప్రకటనలో తెలిపారు. చెల్లించకపోతే బకాయిదారులకు నోటీసులు జారీచేసి తాగునీటి కుళాయి కనెక్షన్లు తొలిగిస్తామని హెచ్చరించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో బకాయిదారుల వివరాలు బహిర్గతం చేసి ఇళ్లను జప్తు చేస్తామని కమీషనర్ సుశీలమ్మ తెలిపారు.

## ప్రలోభాలకు లొంగొద్దు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మధుసూదనరావు

రానున్న ఎన్నికల్లో రాజకీయ నాయకుల ప్రలోభాలకు లొంగొద్దని ఆర్డీవో మధుసూదన్‌రావు తెలిపారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులు పత్రికలపరంగా అనుకూలంగా వార్తలు రాయడం, వ్యతిరేకంగా వార్తలు, డబ్బు ఇచ్చినట్లుగా సమాచారం ఉన్నట్లైతే కఠినచర్యలు తీసుకుంటున్నట్లు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారన్నారు. ఓటర్లను ప్రభావితం చేయడంపై ప్రత్యేక నిఘా కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2014 ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల కమీషనర్ ఆదేశాల మేరకు గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఆయా పరిధిలో నిఘా కమిటీలను ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు.

ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ డి.ఎ.వో దత్తాత్రేయశర్మ, అన్ని పత్రికల విలేకర్లు పాల్గొన్నారు.

### విజయలక్ష్మి కుటుంబానికి

## ముఖ్యమంత్రి సహాయనిధి చేయూత



విజయలక్ష్మికి చెక్కు పంపిణీ చేస్తున్న తహాశీల్దార్ ఇస్మాయిల్

గూడూరు పట్టణంలోని అరుంధతీయపాళెంకు చెందిన బట్టా విజయలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయనిధి క్రింద 25వేలు చెక్కును తహాశీల్దార్ కార్యాలయంలో గూడూరు తహాశీల్దార్ ఇస్మాయిల్ విజయలక్ష్మికి సోమవారం నాడు అందజేశారు. విజయలక్ష్మి భర్త ప్రదీప్‌కుమార్ ప్రమాదంలో మృతిచెందడంతో సిఎం సహాయనిధి నుండి అందజేసినట్లు తెలిపారు. సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పలువురు దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలను విన్నవించారు. భూసమస్యలు, సర్వే, భూకబ్జాలు, పట్టాదారు పాసుపుస్తకాల సమస్యలను పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్, ఆర్.ఐ.శ్రీనివాసులు, విఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## అవగాహన పెంచుకోవాలి

### - ట్రైనీ కలెక్టర్ వర్షిణి



రెవెన్యూ శాఖలో గ్రామస్థాయి అధికారులు రెవెన్యూ అంశాలపై అవగాహన పెంచుకోవాలని అప్పుడే సమస్యలను పరిష్కరించవచ్చని శిక్షణ కలెక్టర్ అలగ వర్షిణి తెలిపారు. గూడూరు ఎంపిడివో కార్యాలయంలో సోమవారం డివిజన్‌లోని తొమ్మిది మండలాల విఆర్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామరెవెన్యూ రికార్డులు, భూసర్వే పై పూర్తి అవగాహన ఉండడం గ్రామస్థాయిలో రెవెన్యూ రికార్డులు నిర్వహించడం తెలుసుకోవాలన్నారు. సర్వే జమాబందీ తదితర అంశాలపై వివరించారు. కాగా గూడూరు డివిజన్ వీఆర్వోల సంఘం ఆధ్వర్యాన శిక్షణా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా ఆ సంఘనాయకులు గ్రిద్దలూరు రమణయ్య, అంకయ్య, శివకుమార్ నాగార్జునరెడ్డి తదితరులు కలిశారు.

## కేంద్ర మంత్రిని కలిసిన జిల్లా ఎస్పీ



గూడూరు పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో కేంద్రమంత్రి పనబాక లక్ష్మిని జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొట్టమొదటిసారిగా మంత్రి జిల్లాకురావడంతో ఎస్పీ కలిశారు. గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి పనబాక కృష్ణయ్య కూడా ఆమెతో వున్నారు.

## నయనకే నా ఓటు...

సున్నితమైన కథాంశాలతో సినిమాల్లో చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేకగుర్తింపు తెచ్చుకున్న శేఖర్ కమ్ముల తన కెరీర్‌లో తొలిసారిగా రీమేక్ చేస్తున్న సినిమా 'అనామిక'. తెలుగు, తమిళంలో ఒకేసారి చిత్రీకరిస్తున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో నయనతార పెర్ఫార్మెన్స్ గురించి ఆయన మాట్లాడుతూ ఆమె ముందు విద్యా బాలన్ కూడా దిగదుడుపేనని చెప్పాడు.



మూ'వీ'క్షణం

## బళ్ళారి 'బాబు'



సూపర్‌స్టార్ మహేష్‌బాబు ప్రస్తుతం బళ్ళారిలో 'ఆగడు' సినిమా షూటింగ్‌లో బిజీగా వున్నాడు. బళ్ళారిలో మైనింగ్ ప్రాంతంలో షూటింగ్ చేస్తున్నారు. అక్కడ దుమ్ము, ధూళీ ఎక్కువ. ఇంత దుమ్ములోనూ మహేష్‌బాబు ప్రొఫెషనల్‌గా షూటింగ్‌లో పాల్గొంటూ వృత్తిపట్ల తన అంకితభావాన్ని చూపుతున్నాడు. శ్రీనువైట్ల దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ సినిమా రియాలిటీ కోసమే దట్టమైన దుమ్ము మధ్య షూటింగ్ చేస్తున్నారట. ఇంత దుమ్ము మధ్య షూటింగ్‌లో పాల్గొంటున్న టీమ్‌కు శ్రీను వైట్ల కృతజ్ఞతలు తెలిపాడు.



## తమిళ జులాయి ప్రశాంత్

అల్లు అర్జున్, ఇలియానాలు జంటగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వచ్చిన 'జులాయి' సినిమా తమిళంలో రీమేక్ కాబోతుంది. ఈ చిత్రానికి హీరోగా 'జీన్స్' సినిమాతో తెలుగుప్రేక్షకులకు దగ్గరైన ప్రశాంత్ నటించనున్నాడు. చాలా కాలంగా హిట్స్‌కు దూరంగా వున్న ప్రశాంత్‌కు ఈ సినిమా మంచి బ్రేక్ ఇస్తుందేమో చూడాలి. తెలుగు 'జులాయి'లో పోలీస్‌ఆఫీసర్‌గా రాజేంద్ర ప్రసాద్ పోషించిన పాత్రను తమిళంలో తంబి రామయ్య పోషిస్తున్నారు.




## గౌతమ్‌ను చూస్తే గర్వం

కామెడీస్టార్ బ్రహ్మానందం కొడుకు గౌతమ్ కొన్నేళ్ల క్రితమే హీరోగా తెలుగు తెరకు పరిచయమయ్యాడు. అయితే అప్పుడు ఆయన పెద్దగా రాణించలేదు. గౌతమ్ ప్రస్తుతం బాడీలాంగ్వేజ్‌ను మార్చుకుని సెకెండ్ ఇన్నింగ్స్‌ను మొదలు పెట్టాడు. చైతన్య దంతులూరి దర్శకత్వంలో వస్తున్న 'బసంతి' సినిమా ద్వారా ఆయన మళ్ళీ తెరపైకి రాబోతున్నారు. మళ్ళీ ఫీల్డ్‌లో తన కొడుకును చూస్తుంటే గర్వంగా వుందని అందరినీ నవ్వించే బ్రహ్మానందం ఆనందపడుతున్నాడు.

## రెహమాన్ ఆల్బమ్‌లో యామీ

స్వరబ్రహ్మ ఏ.ఆర్.రెహమాన్ 'రానక్' అనే టైటిల్‌తో కొత్త ఆల్బమ్‌ను నిర్మిస్తున్నాడు. దీనికి వీడియో కూడా తీసేసాడు. ఈ ఆల్బమ్‌లో యామీ గౌతమ్‌కు స్థానాన్ని కల్పించడంతో ఈ భామ ఆనందానికి అవధులు లేవు. ఈ ఆల్బమ్‌లో ఓ పాటకు కేంద్రమంత్రి కపిల్ సిబాల్ లిరిక్స్ అందించడం విశేషం.



## డాన్సర్ టూ సింగర్



దాదాపు 100కు పైగా ఐటమ్ సాంగ్స్‌లో కనిపించి తెలుగు ప్రేక్షకులకు మత్తెక్కించిన ముమైత్ ఖాన్ చాలాకాలంగా తెరపై కనిపించడం లేదు. అయితే ఇప్పుడు ఆమె మరో కొత్త రూపంలో మన ముందుకు రాబోతుంది. పాప్ సింగర్‌గా ఆమె మనల్ని అలరించబోతుంది. మంచి బీట్ వున్న పాటతో, డాన్స్ మూమెంట్స్ ఇస్తూ రూపొందించిన ఓ పాట మరికొద్దిరోజుల్లో విడుదల కాబోతుంది. ఐటంగార్ల్‌గా తెలుగుప్రేక్షకుల మనసు దోచిన ముమైత్‌ఖాన్ సింగర్‌గా కూడా రాణించాలని ఆశిద్దాం!

నెల్లూరుజిల్లా రాజకీయాలలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఓ సంచలనం. 1999లో తెలుగుదేశంపార్టీ ద్వారా రాజకీయ రంగంలో అడుగుపెట్టిన ఆయన ఇప్పటివరకూ ఓటమన్నది ఎరుగడు. సమర్థవంతమైన వ్యాపారవేత్తగా ఎన్నో విజయాలను సాధించి ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయ రంగాన్ని వేదికగా చేసుకుని తాను అనుకున్న లక్ష్యాలను, చేపట్టిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుంటూ నెల్లూరుజిల్లాలోనే తానో ప్రత్యేక వ్యక్తిగా గుర్తింపును తెచ్చుకున్న వ్యక్తి ఆదాల ప్రభాకర్‌రెడ్డి. 1999లో గెలిచిన తొలిసారే అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో అల్లూరు నియోజకవర్గం కోసం కష్టపడి పనిచేసి నియోజకవర్గంలోని రైతుసోదరుల అభ్యున్నతికి నిరంతరం కృషిచేసిన చరిత్ర ఆదాలది. ఆయన హయాంలో అల్లూరు నియోజకవర్గంలో ఎన్నో నీటిపారుదల కాలువలను మరమ్మతులు చేయించి కోట్ల రూపాయల నిధుల ద్వారా రైతన్నలకు నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయడంలో ప్రత్యేకస్థానాన్ని ఆదాల సంపాదించుకున్నాడు.



# అభివృద్ధే ధ్యేయం

**- 'లాయర్'తో ఆదాల**

*2004లో అల్లూరు నుండి సర్వేపల్లికి మారి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా విజయం సాధించి వరుసగా రెండుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై గడచిన 10సంవత్సరాలలో సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధిని అశేషంగా సాధించి జిల్లాలోనే సర్వేపల్లిని పారిశ్రామిక ప్రగతికి కేంద్రంగా మార్చిన ఘనత కూడా ఆదాల ప్రభాకర్‌రెడ్డిదే. రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్‌పార్టీతో విభేదించిన ఆదాల ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాల దృష్ట్యా కాంగ్రెస్‌పార్టీకి వీడ్కోలు పలికి తన తొలి పార్టీ తెలుగుదేశంలో చేరిపోయాడు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేయబోతున్నాడు. ఈ సందర్భంగా ఆదాల రాజకీయ ప్రస్థానంలో సాధించిన అభివృద్ధి భవిష్యత్తులో ఆయన దృష్టి సారించనున్న ప్రగతి కార్యక్రమాలపై 'లాయర్'తో ముచ్చటించారు. ఆ విశేషాలు 'లాయర్' పాఠకుల కోసం.*

**వ్యా**పారవేత్తగా అనూహ్య విజయాలు సాధించి ఆర్థికంగా తనకంటూ ఒక స్థాయిని ఏర్పరచుకుని ప్రజలకు తనకు చేతనైన సేవలు అందించాలనే ఒకే ఒక ధ్యేయంతో తాను రాజకీయాలలో అడుగుపెట్టానని అంటాడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి. 1999లో అల్లూరు నియోజకవర్గం నుండి తొలిసారిగా శాసనసభ్యుడిగా గెలిచి అనంతరం చంద్రబాబు తొలి క్యాబినెట్‌లోనే 30నెలలు మంత్రిగా జిల్లాలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు అల్లూరు నియోజకవర్గంలో పలు వ్యవసాయ ఆధారిత కాలువలను మరమ్మతు చేయించి రైతులకు ఆసరాగా నిలవడమే కాకుండా తీరప్రాంతంలోని మత్స్యకారుల బాగోగులను పట్టించుకుని వారికి కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధి ఫలాలను అందించానని చెప్పారు.

డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి గారి ఆశయాల పట్ల ఆకర్షితుడనై 2004లో కాంగ్రెస్‌పార్టీలో చేరానని, ఆనాడు ఎన్నికల సమయంలో చెప్పిన దాని కంటే వందరెట్లు ఎక్కువ అభివృద్ధిని సర్వేపల్లి నియోజకవర్గంలో చేసిచూపించానని అన్నారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఆధారంగా ఈరోజు నెల్లూరుజిల్లా మొత్తం పారిశ్రామిక జిల్లాగా పరుగులు తీస్తోందని అంటాడు ఆదాల. ఆసియాలోనే ప్రతిష్టాత్మకమైన ఓడరేవుగా కృష్ణపట్నం పోర్టు ఆవిర్భవించి ఆ పోర్టుకు అనుసంధానంగా కొన్ని వందల పరిశ్రమలు ముత్తుకూరు చుట్టూ విస్తరిస్తున్నాయని, ఈ అభివృద్ధంతా తన సారధ్యంలో జరగడం తన అదృష్టమని అంటాడాయన.

పోర్టుతో పాటు 8ఆయిల్ రిఫైనరీలు, ఎరువుల రీప్యాకింగ్ కొరకు ఉపయోగించే ప్లాస్టిక్ బ్యాగుల తయారీ కర్మాగారం, ప్లాస్టిక్‌పైపులు తయారుచేసే పరిశ్రమ, దాదాపు 2000కోట్లు మొదటిదశ పెట్టుబడిగా క్రిబ్‌కో ఎరువుల కర్మాగారం, మరో రెండువేల కోట్లతో ఈ కర్మాగారం భవిష్యత్తులో విస్తరణ ఇవన్నీ సర్వేపల్లిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలని అంతే కాకుండా 4పవర్‌ప్లాంట్‌లలో ఇప్పటికే శరవేగంగా పనులు జరుగుతుండగా మరో మేజర్ పవర్‌ప్లాంట్ భవిష్యత్తులో ఆవిష్కృతమౌతుందని వీటితోపాటుగా వ్యవసాయ ఆధారిత కాలువలను ఆధునీకరించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి జిల్లాలో అత్యధిక శాతం చేసిన శాసనసభ్యుడిని తానేనని నియోజకవర్గంలో 30 వేల పక్కా గృహాలు నిర్మించింది కూడా తానేనని ఆదాల అంటున్నారు. పోర్టును అనుసంధానం చేస్తూ వెంకటాచలం నుండి నేరుగా రైల్వే లైను, 4లైన్ల రహదారి అలాగే నెల్లూరు నగరాన్ని కలుపుతూ ముత్తుకూరు వరకు మరో 4లైన్ల రహదారి ఏర్పాటు చేసిన ఘనత కూడా తన నాయకత్వంలోని సర్వేపల్లి నియోజకవర్గానికే దక్కిందని ఆదాల అన్నారు. అభివృద్ధి ఫలాలతో ప్రజల మనసుల్లో స్థానం పొందానే తప్ప వర్గాలను, వర్ణాలను ఎప్పుడూ ప్రోత్సహించలేదని, ఒక్క గ్రామంలో కూడా ఎక్కడా కక్షలూ కార్పణ్యాలు లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో అందరికీ సమన్యాయం చేస్తూ వారి దీవెనలందుకున్నానని అన్నారు.

ముత్తుకూరు, సర్వేపల్లి చుట్టుపక్కల ఏర్పడిన పరిశ్రమల ద్వారా ఇప్పటికే దాదాపు 20వేల మంది ఉపాధి అవకాశాలు పొందారని భవిష్యత్తులో మరో 20వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

5సంవత్సరాలు అల్లూరు శాసనసభ్యుడిగా, 10సంవత్సరాలు సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల ప్రతినిధిగా, యం.యల్.ఏ స్థానంలో వుంటూ అనూహ్యరీతిలో అభివృద్ధిని సాధించి సర్వేపల్లి నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధిని చేశానని ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో తెలుగుదేశంపార్టీ పక్షాన నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేసి ప్రజల ఆశీస్సులతో జిల్లాలో అనాదిగా ప్రజల ఆకాంక్షగా మిగిలిపోయిన ఇఫ్కో కర్మాగారం, బిట్రగుంట వద్ద రైల్వే కోచ్ ఫ్యాక్టరీలతో పాటు విమానాశ్రయం, ప్రతి నియోజకవర్గంలో కనీసం రెండు భారీపరిశ్రమలతో పాటు ఇంకా అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సాధించడమే ధ్యేయంగా నెల్లూరీయుల ముంగిళ్ళకు వస్తున్నానని అన్నారు.


గుజరాత్‌లో సంపూర్ణంగా అభివృద్ధిని సాధించి గుజరాత్‌ని రోల్‌మోడల్‌గా చూపించి భారతదేశాన్ని సంక్షేమమార్గంలో నడిపిస్తానని చెప్తున్న నరేంద్ర మోడీ తనకు ఆదర్శమని, ఆయనలాగే అల్లూరు, సర్వేపల్లి నియోజకవర్గాలను అభివృద్ధిబాటలో నడిపించి నేడు నెల్లూరుజిల్లాను ప్రగతిపథంలో పయనింపజేయడానికి ప్రజల దీవెనలు కోరుకుంటున్నానని అన్నారు ఆదాల ప్రభాకర్‌రెడ్డి.

రైతు బిడ్డగా, పారిశ్రామికవేత్తగా, విద్యావేత్తగా, అన్ని రంగాల ప్రజల అవసరాలు తనకు తెలుసని అన్ని ప్రాంతాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తన ఈ లక్ష్యానికి ప్రతిఒక్కరూ అండదండగా నిలవాలని అభ్యర్థిస్తున్నాడు ఆదాల. ఆల్ ది బెస్ట్ టు హిమ్.

## మోడీ నాకు ఆదర్శం

**గుజరాత్‌లో సంపూర్ణంగా అభివృద్ధిని సాధించి గుజరాత్‌ని రోల్‌మోడల్‌గా చూపించి భారతదేశాన్ని సంక్షేమ మార్గంలో నడిపిస్తానని చెప్తున్న నరేంద్ర మోడీ నాకు ఆదర్శం.**

**ఆయనలాగే అల్లూరు, సర్వేపల్లి నియోజకవర్గాలను అభివృద్ధిబాటలో నడిపించి నేడు నెల్లూరుజిల్లాను ప్రగతిపథంలో పయనింపజేయడానికి ప్రజల దీవెనలు కోరుకుంటున్నాను.**




***ఆసియాలోనే ప్రతిష్టాత్మకమైన ఓడరేవుగా కృష్ణపట్నం పోర్టు ఆవిర్భవించి ఆ పోర్టుకు అనుసంధానంగా కొన్ని వందల పరిశ్రమలు ముత్తుకూరు చుట్టూ విస్తరిస్తున్నాయి, ఈ అభివృద్ధంతా నా సారధ్యంలో జరగడం నిజంగా నా అదృష్టం.***

***అభివృద్ధి ఫలాలతో ప్రజల మనసుల్లో స్థానం పొందానే తప్ప వర్గాలను, వర్ణాలను ఎప్పుడూ ప్రోత్సహించలేదు, ఒక్కగ్రామంలో కూడా ఎక్కడా కక్షలూ కార్పణ్యాలు లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో అందరికీ సమన్యాయం చేస్తూ వారి దీవెనలందుకున్నాను.***






Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.